ఐఐటీ మద్రాస్ సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్






# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 4 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 31 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


శాస్త్రవేత్త వీరభద్రన్‌కు క్రాఫోర్డ్ ప్రైజ్

భూ వాతావరణంపై సీఎఫ్సీల ప్రభావాన్ని కనుగొన్న ప్రథమ సైంటిస్టుగా రికార్డు




కుదిరిన వాణిజ్య ఒప్పందం

# భారత్‌పై ప్రతీకార సుంకాల్ని 18 శాతానికి తగ్గిస్తున్నం




## అమెరికా వస్తువులపై సున్నా సుంకాలకు.. రష్యా చమురు కొనుగోలు నిలిపివేతకు మోడీ ప్రభుత్వం అంగీకరించింది

### ప్రధాని మోడీతో ఫోన్ చర్చల అనంతరం ట్రంప్ ప్రకటన

### 140 కోట్ల మంది తరఫున ట్రంపునకు కృతజ్ఞతలు ప్రకటించిన మోడీ

వాషింగ్టన్, ఫిబ్రవరి 3: భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో

...మిగతా 2లో

## సహనమే సత్ఫలితాన్నిచ్చింది

### వాణిజ్య ఒప్పందంపై ఎన్డీయే సమావేశంలో ప్రధాని

### మోడీని సత్కరించిన కూటమి ఎంపీలు



ఢిల్లీ, ఫిబ్రవరి 3: అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ఆయన అన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన

...మిగతా 2లో

## ఇంత సడెన్‌గా ఎట్ల కుదిరింది?

### ప్రశ్నించిన రాహుల్ గాంధీ



ఢిల్లీ, ఫిబ్రవరి 3: వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికా ఒత్తిడికి ప్రధాని మోడీ లొంగిపోయారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఒప్పందం ద్వారా రైతుల కష్టాన్ని అమ్మేశారని విమర్శించారు. 'దాదాపు నాలుగు నెలలుగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందం సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా ఎందుకు ఖరారైందో మనం అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో ప్రధానిపై తీవ్ర ఒత్తిడి ఉంది. అమెరికాలో వ్యాపారవేత్త అదానీపై కేసు వంటి వ్యవహారాలు దీనికి కారణం. వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని రాజీ పడ్డారు. రైతుల కష్టాన్ని, మొత్తం దేశాన్నే అమ్మేశారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

## నేడు మిర్యాలగూడలో రేవంత్ పర్యటన

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన



హైదరాబాద్, ఫిబ్రవరి 3 (మనం బ్యూరో): సీఎం రేవంత్ రెడ్డి బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో పర్యటించనున్నారు. రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేయనున్న సీఎం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు.

**అసంతృప్తులను బుజ్జగించండి**

ఈ నేపథ్యంలో మంత్రులంతా వెంటనే జిల్లాలకు వెళ్లాలని.. బలహీనంగా ఉన్న మునిసిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించి గెలుపు వ్యూహాలు రచించాలని సీఎం ఆదేశించారు. అదే విధంగా.. అసంతృప్త నేతలను ఎలాగైనా బుజ్జగించాలని.. పరిస్థితులపై రోజువారీ రిపోర్టు తనకు అందించాలని ఆదేశం.

ముగిసిన ఉపసంహరణ గడువు

## బరిలోనే రెబల్స్



### కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుపై ప్రతికూల ప్రభావం

### లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (మనం బ్యూరో): మున్సిపల్ ఎన్నికలలో కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు మంగళవారంతో పూర్తయింది. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఈనెల 11న ఒకే విడతలో పోలింగ్ జరుగనుంది. బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరుగనున్నాయి. ఎక్కడైనా రీ పోలింగ్ నిర్వహించాల్సి వస్తే ఫిబ్రవరి 12న నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 13న ఫలితాలు ప్రకటించనున్నారు. ఫిబ్రవరి 16న 116 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, 7 కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరుగనుంది. ఇదిలా ఉండగా, ప్రధాన పార్టీల అభ్యర్థులకు రెబల్స్ తలనొప్పి తప్పడం లేదు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసినప్పటికీ రెబల్స్ ఎన్నికల బరిలో కొనసాగుతుండటంపై అభ్యర్థులలో టెన్షన్ నెలకొంది. రెబల్స్ బరిలో ఉంటే తమ ఓట్లకు ఎక్కడ గండి పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. బుజ్జగింపులతో పని కాకపోవడంతో ఇక ఆయా పార్టీల అధినేతలు నేరుగా జోక్యం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలతో

...మిగతా 2లో

## కడియంకు స్పీకర్ నోటీసులు

### నేడు 11 గంటలకు హాజరు కావాలని ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (మనం బ్యూరో): ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై బుధవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో విచారణ జరుగనుంది. ఈమేరకు విచారణ షెడ్యూల్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కడియం శ్రీహరికి మరోసారి పంపిన నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. విచారణకు హాజరు కావాలని అసెంబ్లీ కార్యదర్శి నుంచి కడియంకు నోటీసులు కూడా అందాయి. అదే విధంగా కడియంపై అనర్హత పిటిషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద కూడా విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపారు.

## రోడ్డు ప్రమాద మరణాల తగ్గింపునకు కృషి చేస్తున్నం

### రోడ్డు భద్రత ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్




హైదరాబాద్, జనవరి 3 (మనం బ్యూరో): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించి మరణాల సంఖ్యను తగ్గేలా అవగాహన కల్పిస్తున్నామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పౌరులు, రోడ్డు భద్రతకు స్పృహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞా వెబ్‌సైట్‌ను మంత్రి పొన్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో రోడ్డు

...మిగతా 2లో

## రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కార్యాచరణ రూపొందించండి

### ప్రభుత్వ శాఖల కార్యదర్శులకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశం



హైదరాబాద్, జనవరి 3 (మనం బ్యూరో): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కె.రామకృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాల

...మిగతా 2లో

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీంకోర్టు స్పష్టత



హైదరాబాద్, ఫిబ్రవరి 3 (మనం బ్యూరో): తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.

## మేడారం జాతర విజయవంతమైంది



- ప్రతిపక్ష పార్టీల నేతలు జాతర ఏర్పాట్లు బాగున్నాయన్నరు
- త్వరలో గోదావరి పుష్కరాలపై అధికారులతో సమీక్షిస్త
- మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 3 ( మనం బ్యూరో): ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మేడారం జాతర విజయవంతమైందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ

...మిగతా 2లో

జగిత్యాలలో రోడ్డు ప్రమాదం

## నలుగురి మృతి

2




## చట్టాలను పాటించకపోతే దేశం నుంచి వెళ్లిపోండి

### వాట్సాప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీం ఆగ్రహం

ఢిల్లీ, ఫిబ్రవరి 3: ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్ను వీడి వెళ్లొచ్చు' అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్ లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్

...మిగతా 2లో

## ఇక్కడ ఓట్లు అమ్మబడవు




అశ్వారావు పేట, ఫిబ్రవరి 3: ఇక్కడ నోటుకు ఓట్లు అమ్మబడవు అంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో అప్పారావు అనే ఓ వ్యక్తి తన ఇంటి ముందు గేటుకు ఫ్లెక్సీ కట్టారు. అశ్వారావుపేటలో మునిసిపాలిటీ ఎన్నికలు జరుగుతున్నాయి. అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. వార్డు, నిలబడిన అభ్యర్థులనుబట్టి ఓటుకు ఇంత ఇస్తారంట అంటూ పట్టణంలో రకరకాల ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే పట్టణానికి చెందిన ఎలక్ట్రికల్ వ్యాపారి అప్పారావు తమ ఇంట్లో ఓట్లు నోటుకు అమ్మబడవు అంటూ ఫ్లెక్సీ పెట్టారు. అందరూ ఈ విధంగా డబ్బులు వద్దంటే బాగుండునేమో అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## చమురు కొనుగోలు నిలిపివేతపై భారత్ మాకేమీ చెప్పలేదు

### పుతిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్






మాస్కో, ఫిబ్రవరి 3: తమ నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేయడంపై భారత్ ఎటువంటి అధికారిక సమాచారం ఇవ్వలేదని రష్యా స్పష్టం చేసింది. అమెరికాతో చమురు కొనుగోలు ఒప్పందం చేసుకున్నట్లు గానీ.. రష్యా నుంచి దిగుమతులు ఆపేస్తామని గానీ భారత్ చెప్పలేదని వెల్లడించింది. అమెరికాతో ట్రేడ్ డీల్లో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేసి, వెనెజువెలా చమురును కొనుగోలు చేయడానికి భారత్ ముందుకొచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన పై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి

...మిగతా 2లో

# భారత్‌పై ప్రతీకార సుంకాల్ని 18 శాతానికి తగ్గిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం(ఇందులో రష్యా నుంచి చమురు కొంటున్నందుకు విధించిన 25 శాతం అదనపు సుంకం ఉంది) సుంకాలు 18 శాతానికి తగ్గుతాయి. ప్రధాని నరేంద్ర మోడీకి సోమవారం ట్రంప్ ఫోన్ చేశారు. అనంతరం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో ప్రకటన చేస్తూ.. 'నాకున్న గొప్ప స్నేహితుల్లో భారత ప్రదాని మోడీ ఒకరు. భారత్ కు ఆయన శక్తిమంతమైన, గౌరవప్రదమైన నాయకుడు. మేం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు, రష్యా చమురు కొనుగోలు నిలిపివేత, అమెరికా, వెనెజువెలా నుంచి భారత్‌ట మరింత చమురు కొనుగోలు వంటి అంశాలపై చర్చించాం. ఇది ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకగలదని అనుకుంటున్నా. మోడీపై గౌరవంతో ఆయన విజ్ఞప్తిమేరకు వెంటనే వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నా. అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత ప్రధాని కట్టుబడి ఉన్నారు. 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లకు అదనంగా మరిన్ని దిగుమతులకు ఆ దేశం సిద్ధంగా ఉంది. వారితో మాకున్న అద్భుతమైన బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ముందుకు సాగనుంది. మోడీ, నేను అన్ని విషయాలను చక్కబెడుతున్నాం' అని ట్రంప్ ఆ పోస్టులో వివరించారు.

**140 కోట్ల మంది భారతీయుల తరపున డొనాల్డ్‌కు చాలా చాలా ధన్యవాదాలు.. : మోడీ**

ట్రంప్ ప్రకటనపై మోడీ స్పందించారు. భారత ఉత్పత్తులపై ఇక నుంచీ 18 శాతం అమెరికా సుంకమే అమలు కానుందని ప్రధాని మోడీ వెల్లడించారు. ఇది ఎంతో సంతోషకరమని ఎక్స్ లో వ్యాఖ్యానించారు. 'అద్భుత ప్రకటన చేసినందుకు 140 కోట్ల మంది భారతీయుల తరపున అధ్యక్షుడు ట్రంప్నకు చాలా చాలా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అయితే, ఆయన వాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించలేదు. 'ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పని చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరుచుకుంటాయి. ప్రపంచ శాంతికి, సుస్థిరతకు, సుసంపన్నతకు ట్రంప్ నాయకత్వం ఎంతో కీలకం. శాంతి కోసం ఆయన చేసే ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతిస్తుంది.

రెండు దేశాల భాగస్వామ్యాన్ని అత్యున్నత స్థాయికి చేర్చేందుకు ఆయనతో సన్నిహితంగా కలిసి పని చేసేందుకు ఎదురుచూస్తున్నా' అని మోడీ వివరించారు. మోడీ, ట్రంప్ ఫోన్లో మాట్లాడుకున్నారని భారత్లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్‌లో తెలిపారు. విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్ జైశంకర్ మూడు రోజుల అమెరికా పర్యటన ప్రారంభమైన నేపథ్యంలో ఈ సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

# శాస్త్రవేత్త వీరభద్రన్‌కు క్రాఫోర్డ్ ప్రైజ్

## భూ వాతావరణంపై సీఎఫ్సీల ప్రభావాన్ని కనుగొన్న ప్రథమ సైంటిస్టుగా రికార్డు

**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత సంతతి వాతావరణ శాస్త్రవేత్త వీరభద్రన్ రామనాథన్‌ను భూ విజ్ఞానశాస్త్రంలో నోబెల్ గా భావించే క్రాఫోర్డ్ ప్రైజ్ వరించింది. కాలుష్య మేఘాలు, క్లోరోఫ్లోరో కార్బన్ (సీఎఫ్సీ)ల వంటి సూపర్ పొల్యూటెంట్లపై దశాబ్దాల పాటు చేసిన పరిశోధనకు ఆయనకు ఈ అవార్డును ఇస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. రామనాథన్ 'నాసా'కు పనిచేస్తున్న సమయంలో కార్బన్ డయాక్సైడ్ కంటే ఫ్రిడ్జ్ లు, ఏరోసోల్స్‌లో ఉపయోగించే సీఎఫ్సీలే 10 వేల రెట్లు ఎక్కువగా భూ వాతావరణంలో ఉష్ణాన్ని పట్టి ఉంచుతాయని కనుగొన్నారు. దీంతో గ్లోబల్ వార్మింగ్ కు కార్బన్ డయాక్సైడే ప్రధాన కారణమని అప్పటి వరకూ ఉన్న భావనను ఆయన సమూలంగా మార్చేశారు.

**సికింద్రాబాద్లో ఉద్యోగం**

తమిళనాడులోని మదురైలో రామనాథన్ జన్మించారు. చదువు తర్వాత తెలంగాణలోని సికింద్రాబాద్ లో ఉన్న ఓ రిఫ్రిజరేటర్ల కర్మాగారంలో సీఎఫ్సీ విభాగం ఇంజినీర్ గా పనిచేశారు. అనంతరం అన్నామలై యూనివర్సిటీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్లో పైచదువులు చదువుకున్నారు. ఇండియన్ ఓషన్ ఎక్స్‌పెరిమెంట్ (ఇండోఎక్స్) పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ అధ్యయనంలో ఆయన ప్రధానంగా దక్షిణాసియాపై దృష్టి సారించారు. ఇక్కడ కాలుష్య మేఘాలు (బ్రౌన్ క్లౌడ్స్) వాతావరణంలో పెరిగిపోయి భారత రుతుపవనాల ప్రభావాన్ని క్షీణింపజేస్తున్నాయని, హిమాలయాల్లోని హిమానీనదాలు కరిగిపోవడాన్ని వేగవంతం చేస్తున్నాయని కనుగొన్నారు. రామనాథన్ ప్రస్తుతం కాలిఫోర్నియా యూనివర్సిటీలోని స్క్రిప్స్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఓషనోగ్రఫీలో డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్ ఎమెరిటస్ హోదాలో ఉన్నారు. స్వీడన్ దేశపు స్టాక్ హోంలో మేలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయనకు క్రాఫోర్డ్ ప్రైజ్ తో పాటు రూ.8.23 కోట్లు రివార్డును ప్రదానం చేస్తారు.

# సహనమే సత్ఫలితాన్నిచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

వైఖరికి నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు.

దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోడీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంలో చేసిన కృషికి గానూ ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోడీకి సన్మానం చేశారు.

# ట్రేడ్ డీల్ కుదరడంలో కీలక పాత్రధారి గోర్

**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పంద చర్చల్లో కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన ట్రంప్ ప్రకటనతో తొలగిపోయింది. ఈ నేపథ్యంలో సెర్గియో గోర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. భారత్లో అమెరికా రాయబారిగా జనవరిలో అధికారికంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇరుదేశాలమధ్య ద్వైపాక్షిక, వాణిజ్య బంధాన్ని మరోస్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆ సమయంలో వెల్లడించారు. ట్రంప్ టారిఫ్లు, ఆయన చేసిన ప్రకటనలు రెండు దేశాల సంబంధాల్లో ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించగా.. రాయబారిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది సమయంలోనే భారత్-అమెరికా సంబంధాలను పునర్నిర్మించడంలో గోర్ కీలకపాత్ర పోషించారు. ఇరుదేశాల మధ్య బలమైన స్నేహం వల్లే ఈ ఒప్పందానికి అంగీకారం లభించిందని ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ఇప్పటినుంచి రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయం ప్రారంభం అవుతుందని అభివర్ణించారు.39 ఏళ్ల సెర్గియో.. ట్రంప్నకు వీర విధేయుడు. అందుకే అతితక్కువ కాలంలోనే ఆయన ట్రంప్ పరిపాలన విభాగంలో స్థానం సంపాదించగలిగారు. అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్ (ట్భటజజీా ఏౌట)ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్యఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం అప్పట్లో దౌత్యవర్గాలను షాక్కు గురిచేసింది. గోర్ నియామకంపై భారత్లో మిశ్రమ స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. కానీ ట్రంప్ మాత్రం ''నా అజెండాను అమలుచేయడానికి నేను పూర్తిగా విశ్వసించే ఓ వ్యక్తి నాకు కావాలి. ఆ విషయంలో సెర్గియో గొప్ప రాయబారి అవుతాడు'' అని పొగడ్తల వర్షం కురిపించారు.

**2020లో ప్రజల దృష్టిని ఆకర్షించి..**

1990ల్లో గోర్ కుటుంబం అమెరికా కు వలస వచ్చింది. ఆయన తల్లిదండ్రులవి రష్యా మూలాలు. అమెరికా వచ్చిన కొంతకాలానికే గోర్కు పౌరసత్వం లభించింది. జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ అయిన ఆయన.. 2008లో పొలిటికల్ సైన్స్, అంతర్జాతీయ వ్యవహారాల్లో పట్టా పొందారు. తొలినుంచి రిపబ్లికన్ పార్టీతో సంబంధాలు కొనసాగించిన గోర్.. రిపబ్లికన్ నేషనల్ కమిటీకి కమ్యూనికేషన్ అండ్ రీసెర్చ్ అనలిస్టా పనిచేశారు. 2020లో ట్రంప్ హయాంలో విక్టరీ ఫైనాన్స్ కమిటీకి చీఫ్ ఆఫ్ స్టాఫ్గా నియమితులు కావడంతో అందరి దృష్టిని ఆకర్షించారు. తర్వాత ఆయన ట్రంప్నకు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు. 'మేయర్ ఆఫ్ మార్-ఎ-లాగో'గా నిక్నేమ్ను సంపాదించుకున్నారు. మార్-ఎ-లాగో అనేది ఫ్లోరిడాలోని ట్రంప్ రిసార్ట్ పేరు.

గోర్.. భారత్కు రాయబారిగా నియమితులు కాకముందు వైట్హౌస్లో పర్సనల్ డైరెక్టర్గా పనిచేశారు. ట్రంప్ (ౄ్ౌబజూఛీ ఖీటఱఝఇ) రాజకీయ అజెండాకు తగ్గట్టుగా నిర్ణయాలు అమలుచేశారు. ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీల మధ్య స్నేహబంధం నిజమైందేనన్నారు. తమకు భారత్ తర్వాతే ఎవరైనా అని పేర్కొన్నారు.

# ఐఐటీ మద్రాస్ 'సమ్మర్ ఫెలోషిప్' ప్రోగ్రామ్

**చెన్నై, ఫిబ్రవరి 3:** ఐఐటీ మద్రాస్ వేసవిలో చేపట్టనున్న ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆసక్తి కలిగినఅభ్యర్థులుమార్చి 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు మాసాల పాటు జరిగే ఈ సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ మే 18న ప్రారంభమై జులై 17తో ముగియనుంది.

**నెలకు రూ.15 వేలు స్టైపెండ్**

ఇంజినీరింగ్, మేనేజ్మెంట్, సైన్సెస్ లేదా హ్యూమానిటీస్ రంగాల్లో నాణ్యతతో కూడిన విద్యా పరిశోధనపై విద్యార్థుల్లో అవగాహన, ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ ప్రోగ్రామ్ అందిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.15వేలు చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు.

**ఎవరు అర్హులు?**

బీఈ/బీటెక్/బీఎస్సీ (ఇంజినీరింగ్) మూడో సంవత్సరం లేదా ఇంటిగ్రేటెడ్ ఎంఈ/ఎంటెక్ ప్రోగ్రామ్లలో మూడు/ నాలుగో సంవత్సరం చదువుతున్నవారితో పాటు మంచి అకడమిక్ రికార్డు కలిగిన ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/ఎంఏ/ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

**హాస్టల్ వసతి..**

ఈ రెండు నెలల కాలానికి లభ్యతను బట్టి హాస్టల్, మెస్ సదుపాయం కూడా ఉంటుంది. .

**ఫెలోషిప్ ఆఫర్ చేస్తున్న ఇంజనీరింగ్ సబ్జెక్టులు..**

ఏరోస్పేస్ ఇంజినీరింగ్
అప్లైడ్ మెకానిక్స్ అండ్ బయో మెడికల్ ఇంజినీరింగ్
బయో టెక్నాలజీ
కెమికల్ ఇంజినీరింగ్
సివిల్ ఇంజినీరింగ్
కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్
డేటా సైన్స్ అండ్ ఏఐ
ఇంజినీరింగ్ డిజైన్
ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్
మెకానికల్ ఇంజినీరింగ్
మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ
మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్
ఇంజినీరింగ్
ఓషన్ ఇంజినీరింగ్

**సైన్స్ విభాగంలో..**

ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్
హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్
మేనేజ్‌మెంట్ స్టడీస్

# బరిలోనే రెబల్స్

(మొదటి పేజీ తరువాయి)

పోలిస్తే అధికార కాంగ్రెస్ పార్టీకి రెబల్స్ బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థులకు పోటీగా రెబల్స్ బరిలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండొద్దని స్పష్టం చేసినా ఫలితం లేకపోవడంతో నేరుగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ రంగంలోకి దిగారు.

సోమ, మంగళవారాలలో లోక్‌సభ నియోజక వర్గాల వారీగా మంత్రులు, ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించారు. రెబల్స్ పోటీ నుంచి తప్పించే బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులదేనని స్పష్టం చేశారు. కనీసం పోలింగ్ సమయం వరకైనా ఎలాగోలా రెబల్స్‌ను దారిలోకి తీసుకొచ్చి కాంగ్రెస్ అభ్యర్థుల విజయంపై ప్రతికూల ప్రభావం పడకుండా చూడాలని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

మరోవైపు, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేశారు.

ప్రచారానికి ఇంకా కేవలం వారం రోజులే మిగిలి ఉండటంతో ప్రత్యర్థుల వ్యూహాలకు ప్రతి వ్యూహాలు రచిస్తూ గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు.

# రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కార్యాచరణ రూపొందించండి

(మొదటి పేజీ తరువాయి)

నుంచి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సీఎస్ఎస్ కింద రూ.5 లక్షల కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించిందనీ, దీనిలో భాగంగా జనాభా ప్రాతిపదికన రాష్ట్రానికి కనీసం రూ.25 వేల కోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఫార్మా రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారనీ, ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం ఉందనీ, వరంగల్‌లో మామునూరు ఎయిర్‌పోర్టు కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి గణనీయమైన అవకాశం ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి మరో రూ.10 వేల కోట్లు రావాల్సి ఉందనీ, ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాల్సి ఉందన్నారు. 16వ ఆర్థిక కమీషన్‌లో భాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందనీ, దీంతో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల కేటాయింపు ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వంలో వినియోగం కాకుండా ఉన్న మిగులు నిధులను రాష్ట్రానికి దక్కేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

# 'పుర'పోరు ప్రశాంతంగానిర్వహించాలి

- **ఎన్నికల చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**
- **రాష్ట్ర పోలీసులకు డీజీపీ ఆదేశాలు**

**హైదరాబాద్,ఫిబ్రవరి 3(మనం,ప్రత్యేక ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికలను చట్టం ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని డీజీపీ బి.శివధర్ రెడ్డి రాష్ట్ర పోలీస్ అధికారులకు అదేశాలిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల పోలీస్ కమీషనర్లు , జిల్లాల ఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్హెచ్ఓ) లతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈక్రమంలో కొత్తగూడెం, కరీంనగర్, మహబూబ్నగర్, మంచిర్యాల, నిజామాబాద్, నల్గొండ, రామగుండం కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డులతో పాటు, 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈనెల 11వ తేదీన పోలింగ్, 13 తేదీన కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర పోలీస్ శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిజిపి సూచించారు. ఏ రకమైన ఫిర్యాదులు గాని ,అవాంఛనీయ సంఘటనలు గాని జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం హైదరాబాద్ పోలీస్ లీగల్ అడ్వైజర్ శ్రీ రాములు మాట్లాడుతూ....చట్టం ప్రకారం ఓటర్లను ప్రభావితం చేయడం, ఒకరికే ఓటు వేయాలని ఒత్తిడి తీసుకురావడం లేదా నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, బాధితులపై సామాజికంగా, ఆర్థికంగా బహిష్కరణలు విధిస్తే చట్టరీత్యా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేలా మద్యం పంపిణీ చేసినా, ఎక్సైజ్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కనీసం ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందనీ ,ఆయుధాల చట్టం ప్రకారం లైసెన్స్‌డ్ ఆయుధాలను కలిగి ఉన్న వారు నిబంధనల మేరకు పోలీస్ స్టేషన్లలో జమ చేయాలని, లేనిపక్షంలో ఒక ఏడాది నుంచి మూడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించాలని నిబంధనలు ఉన్నాయని వివరించారు.

**ఎన్నికల నిబంధనలు:**

ఎన్నికల ప్రచార పర్వంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అనుసరించాల్సిన నిబంధనల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని లీగల్ అడ్వైజర్ శ్రీ రాములు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించినా, అశ్లీల ప్రకటనలు ప్రదర్శించినా వాటిని తొలగించడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని తెలిపారు. అలాగే ధ్వని కాలుష్యాన్ని నియంత్రించేందుకు టౌన్ న్యూసెన్స్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు.

పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు వాడటం చట్టరీత్యా నేరమన్నారు. ప్రచార వాహనాల విషయంలోనూ మోటార్ వాహనాల చట్టం-1988 కింద అనేక ఆంక్షలు అమల్లో ఉన్నాయనీ, ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల పోలీస్ కమీషనర్లు, ఎస్పీలు , స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, శాంతి భద్రతల ఎఐజి రమణ కుమార్ తదితరులు హాజరయ్యారు.

# చమురు కొనుగోలు నిలిపివేతపై భారత్ మాకేమీ చెప్పలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రకటన చేశారు. సుదీర్ఘకాలంగా భారత్ రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటోందని డిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం ముఖ్యమైన విషయమని అన్నారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను జాగ్రత్తగా విశ్లేషిస్తున్నామన్నారు. భారత్ తో ద్వైపాక్షిక సంబంధాలకు, వాణిజ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం చేసుకునేందుకు కృషి చేస్తామని ఆయన ప్రకటించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించుకోవాలని భారత్పై అమెరికా ఒత్తిడి తీసుకువస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రేడ్ డీల్లో భాగంగా భారత్కు వెనెజువెలా చమురు విక్రయించడానికి సిద్ధమవుతోన్నట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించారు.

యూఎస్ నియంత్రణలో ఉన్న వెనెజువెలా చమురును విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత్ సైతం ఇందుకు అంగీకరించిందన్నారు.

# చట్టాలను పాటించకపోతే దేశం నుంచి వెళ్లిపోండి

(మొదటి పేజీ తరువాయి)

మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు.

**ప్రైవసీ పాలసీ?**

2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్ బుక్ తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం ఈ విధంగా హెచ్చరించింది.

# నలుగురి మృతి

**జగిత్యాల, ఫిబ్రవరి 3:** ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. వ్యవసాయ కూలీలు పసుపుకోతకు వెళ్లి తిరిగి వస్తుండగా.. మల్లాపూర్ మండలం ముగిలిపేట వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి నీటి గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ఐ-బొమ్మ రవి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**హైదరాబాద్,ఫిబ్రవరి 3(మనం,ప్రత్యేక ప్రతినిధి):** సినిమాల పైరసీ కేసులో నిందితుడు ఐ-బొమ్మ రవి తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణను ఉన్నత న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. ఐ బొమ్మ రవిపై సీసీఎస్ పోలీసులు 4 కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం చంచల్ గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ మంజూరు చేయాల్సిందిగా నాంపల్లి కోర్టులో రవి పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. న్యాయస్థానం అంగీకరించలేదు. దీంతో నాలుగు కేసుల్లోనూ తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ గత నెల 21న హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని.. సమయం కావాలని రవి తరఫు న్యాయవాది కోరడంతో హైకోర్టు ఈ మేరకు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

# మణిపూర్ నూతన సీఎంగా యుమ్నం ఖేమ్చంద్ సింగ్



**ఇంఫాల్, ఫిబ్రవరి 3:** మణిపూర్లో రాష్ట్రపతి పాలనకు ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొత్త సీఎంగా భాజపా నేత యుమ్నం ఖేమ్చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. మంగళవారం ఆయన భాజపా శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. అలాగే, మహిళా నేత నెమ్చా కిప్జెన్ ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. మణిపుర్ ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు ఉంది. 2023 మే నుంచి జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడికింది. 250 మందికిపైగా మృతి చెందగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలోనే గతేడాది ఫిబ్రవరిలో సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన విషయం తెలిసిందే. బీరెన్ సింగ్ రాజీనామాతో ఏడాది కాలంగా సీఎం పోస్టు ఖాళీగా ఉండటంతో... తాజా పరిణామాల నేపథ్యంలో కొత్త సీఎంగా ఖేమ్చంద్ బాధ్యతలు చేపట్టనున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మణిపూర్ అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం 37 మంది భాజపా ఎమ్మెల్యేలు ఉన్నారు. నేషనల్ పీపుల్స్ పార్టీ నుంచి ఆరుగురు, కాంగ్రెస్, నాగా పీపుల్స్ ఫ్రంట్ల నుంచి ఐదుగురు చొప్పున, కుకీ పీపుల్స్ అలయన్స్ నుంచి ఇద్దరు, జేడీయూ నుంచి ఒకరు, ముగ్గురు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

# మేడారం జాతర విజయవంతమైంది

(మొదటి పేజీ తరువాయి)



మంత్రి సీతక్క అన్నారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో మంత్రి సీతక్క మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. జాతర, గుడి పనులు సజావుగా సాగాయనీ, ఏర్పాట్లపై కొంత మంది దుష్ప్రచారం చేశారనీ, అయినప్పటికీ క్లాస్, మాస్‌తో పాటు హైక్లాస్ పీపుల్ కూడా జాతరకు వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారనీ, వచ్చే మేడారం జాతర నాటికి చుట్టుపక్కల రోడ్లను వెడల్పు చేసి ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామన్నారు. ఒకటి రెండు రోజుల్లో తిరుగు జాతర ప్రారంభమవుతుందన్నారు. గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాద మరణాల తగ్గింపునకు కృషి చేస్తున్నం

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞా హామీ పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు వినియోగదారులలో క్రమశిక్షణ, అవగాహన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రోత్సహించే దార్శనికతను పునరుద్ఘాటించారు. పౌరులు ట్రాఫిక్ నియామాలను పాటించడానికి, రోడ్డుపై ఉన్న ప్రతి జీవితాన్ని గౌరవించడానికి పౌర ప్రతిజ్ఞను తీసుకోవాలనీ, తల్లిదండ్రులు పిల్లలలో సురక్షితమైన అలవాట్లను రూపొందించాలన్నారు. రోడ్డు భద్రత అంటే కేవలం అమలు మాత్రమే కాదనీ, రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి రోడ్డు భద్రతకు ప్రభుత్వం రక్షణ కల్పించేందుకు భరోసా ఇస్తుందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.





## ఘనంగా సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు

**నల్లబెల్లి, ఫిబ్రవరి 03, మనం న్యూస్:** నల్లబెల్లి మండల పరిధిలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం కాకతీయ బ్రిలియంట్ హైస్కూల్, రుద్రగూడెం వేదికగా ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ మండల స్థాయి పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, గ్రామీణ స్థాయిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పంపనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లబెల్లి తహసీల్దార్ యం. కృష్ణ, మండల విద్యాశాఖాధికారి అనురాధ హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకతీయ బ్రిలియంట్ హైస్కూల్ డైరెక్టర్ రామారావు, హెచ్ఎం రణధీర్ రెడ్డి, ఉపాధ్యాయులు, పీఈటీలు రవీందర్, దేవి లాల్, రుద్రగూడెం సర్పంచ్, పంచాయతీ సెక్రటరీలు లక్ష్మి, సుధాకర్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గుర్తుల కేటాయింపులో ఎక్కడ కూడా పొరపాట్లకు తావివ్వొద్దు..

### నిబంధనల ప్రకారమే అభ్యర్థులకు గుర్తులను కేటాయించాలి

### తెలుగు అక్షర క్రమం ఆధారంగానే అభ్యర్థుల క్రమ సంఖ్య ఉండేలా చూసుకోవాలి

### నాగర్ కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ఉమ్మడి మహబూబ్‌గర్, ఫిబ్రవరి 3 (మనం బ్యూరో):** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులను అభ్యర్థుల పేర్లలోని తెలుగు అక్షరమాల క్రమానుసారంగా కేటాయించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

మంగళవారం నాగర్ కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా, వార్డుల వారీగా దాఖలైన నామినేషన్ల ఆధారంగా రూపొందించిన అభ్యర్థుల జాబితాలను రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు కలెక్టర్కు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అభ్యర్థుల పేర్ల ఆధారంగా తెలుగు అక్షరమాల క్రమంలో తయారు చేసిన జాబితాలను, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వివిధ రాజకీయ పార్టీల తరపున, అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారికి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తుల కేటాయింపు జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ ఉపసంహరణ, గుర్తుల కేటాయింపుపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల బరిలో నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు స్వయంగా హాజరై ఉపసంహరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతినిధి లేదా ఏజెంట్ ద్వారా ఉపసంహరణ పత్రాలు అందజేసిన సందర్భంలో తప్పనిసరిగా సంబంధిత అభ్యర్థికి ఫోన్ చేసి నిర్ధారణ చేసుకోవడంతో పాటు పత్రాలపై ఉన్న సంతకాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఈ సందర్భంగా అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జాతీయ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల అధికారిక బీ-ఫారమ్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆయా పార్టీలు మొదటగా వెల్లడించిన ఫారం-ఏ ఆధారంగానే బీ-ఫారమ్లు సమర్పించబడ్డాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందన్నారు. ఎన్నికల విధులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ ఆర్డీవో సురేష్, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, నాగర్ కర్నూల్ తహసిల్దార్ తబితా రాణి, వివిధ వార్డులకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, తదితరులు ఉన్నారు.

## పదవి విరమణ పొందిన ప్రభుత్వ అధికారికి ఘనంగా సన్మానం

**హైదరాబాద్, ఫిబ్రవరి 3(మనంన్యూస్):** నాగాసాని పాండు ముదిరాజ్ తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్. లో ప్రభుత్వ ఉద్యోగంలో నిజాయితీగల సేవలు అందించి పదవీ విరమణ పొందిన సదర్భంగా మంగళవారం డిపార్ట్మెంట్ల అధికారులు, సీనియర్ ఆఫీసర్స్, సహ ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యులు బిజెపి మహిళా మోర్చా సీనియర్ నాయకులు కే. సుజాత, మీడియా కన్సల్టెంట్ చిట్ల శివ కుమార్ ముదిరాజ్ ఇతరులు హాజరై నాగాసాని పాండు ముదిరాజ్ కి సన్మానించి వారికి జ్ఞాపికను అందజేశారు.




ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పాండు క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారు. వారి భావిజీవితం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. వారికి నాగసాని కుటుంబ సభ్యులు మరియు బంధువుల అందరూ సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# సిట్ విచారణను ప్రభావితం చేసేలా రేవంత్ మాటలు

### సిరికొండ మధుసూదనా చారి

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** రెండు రోజుల క్రితం కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వెకిలి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. రేవంత్ మాటలు సిట్ విచారణను ప్రభావితం చేసేలా ఉన్నాయన్నారు. కేసీఆర్ ఏనాడు కూడా విచారణను ఎదుర్కోను అని అనలేదన్నారు. మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున మొదటి నోటీసు విచారణకు టైమ్ కోరారు. ఎన్నో విచారణలను రెండేళ్లలో ఎదుర్కొన్నాం... దేనికి భయపడమని ఆయన అన్నారు. అవును.. కేసీఆర్ ముమ్మాటికీ జాతిపితే అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన చరిత్ర కేసీఆర్‌ది అన్నారు.

కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిర స్థాయిగా ఉంటారన్నారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రెడ్డిది చీమ కాలంత ప్రమేయం కూడా లేదు? అన్నారు. మొన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి విద్వేష పూరిత ప్రసంగాలు వద్దని సూచించినా దాన్ని పెడచెవిన పెట్టి రేవంత్ కేసీఆర్‌పై దిగజారుడు వ్యాఖ్యలు చేశారని సిరికొండ మధుసూదనా చారి అన్నారు. రేవంత్‌ది కుక్క తోక వంకర అనే బుద్ధి అని, హార్వర్డ్ వెళ్లినా అంతరిక్షం వెళ్లినా రేవంత్ బుద్ధి మారదని చురకలింటించారు. గ్యారంటీల అమలు వదిలి గారడీ ప్రభుత్వాన్ని నడుపుతున్నాడన్నారు. కేసీఆర్ పదవులకు రాజీనామా చేసి సొంతగా పార్టీ పెట్టి తెలంగాణ సాధించారని, రేవంత్ తన చిల్లర బుద్ధిని చాటుకుంటూ కేసీఆర్‌పై అదే పనిగా పిచ్చి విమర్శలు చేస్తున్నారన్నారు. రేవంత్ విమర్శలను తెలంగాణ సమాజం గమనిస్తోందని.. సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధిచెబుతుందని మధుసూదనా చారి అన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని.. జాతర నిర్వహణకు శాశ్వత ఏర్పాట్లు చేస్తామని సీఎం, మంత్రులు ఉత్తర కుమార ప్రగాల్భాలు పలికారన్నారు. 15 గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యిందని దుయ్యబట్టారు. కనీస ఏర్పాట్లు చేయలేకపోయారని మండిపడ్డారు. ఇదొక్క వైఫల్యం చాలు రేవంత్ ప్రభుత్వం ఎట్లా పనిచేస్తోందో చెప్పడానికి అన్నారు. కేసీఆర్ హయాంలో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా జరిగిందని, ఈ కాంగ్రెస్ సర్కార్ పాలనలో మాటలు తప్ప చేతలు లేవని చురకలంటించారు. అయితే, సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చిన భక్తుల అసౌకర్యానికి ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని మధుసూదనా చారీ ఈ సదర ్బంగా డిమాండ్ చేశారు.

# 2 లక్షల ఉద్యోగాలు అందని ద్రాక్షేనా?..

- ఉద్యోగాలు భర్తీపై ముఖ్యమంత్రి ముఖం చాటేసిండ్రు?
- కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుద్యోగుల ఉసురు తగుల్తది
- జాబ్ క్యాలెండర్‌కు పాతర.. కుంభకోణాలే లక్ష్యంగా కాసులకు వెతర
- మాట తప్పిన సీఎం.. ముక్కు నేలకు రాసినా నిరుద్యోగులు క్షమించరు : కేటీఆర్ ఏద్దేవా



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** 2 లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గారి మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో రిక్రూట్‌మెంట్ జీరోగా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎండగట్టారు.

అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని, పట్టుమని పదివేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులకు, విద్యార్థులకు చేస్తున్న ఈ ద్రోహంపై వెంటాడుతామన్నారు.

మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్ల నుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికే పోదని, నిరుద్యోగులకు, యువతకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు.

కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు 2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం అన్నారు. మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని కేటీఆర్ తెలిపారు.

# వామ్మో?.. ఇంత ఘోరమా?

### ప్రతిది పైసలేనా?.. మరి ప్రాణాల సంగతేంటి?

### విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు షాక్..

### తప్పుడు రిపోర్టులు ఇచ్చినందుకు రూ. 2.20 లక్షల జరిమానా?

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తప్పుడు రిపోర్టులు ఇచ్చిన విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వినియోగదారుల హక్కుల కమిషన్ భారీ జరిమాన విధించింది. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన భార్గవి అనే గర్భిణి... తన గైనకాలజిస్ట్ సూచన మేరకు ఎన్‌టీ స్కాన్ కోసం స్థానిక విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆశ్రయించింది. అయితే పరీక్ష అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి అంతా సాధారణంగానే ఉందని, సదరు సెంటర్ సిబ్బంది రిపోర్టు ఇచ్చిం(ది)డ్రు. ఇక, ఆ రిపోర్టుపై అనుమానం వచ్చిన భార్గవి మరో డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తిరిగి పరీక్ష చేయించుకోగా షాకింగ్ నిజం వెలుగులోకి వచ్చింది.

కడుపులోని శిశువు మెడపై సుమారు 11 ఎంఎం మేర ఓ గడ్డ ఉన్నట్లు రెండో రిపోర్టులో తేలింది. దీంతో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఇచ్చిన తప్పుడు రిపోర్టును నమ్మి ఉంటే తల్లీబిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు... వైద్యుల సలహా మేరకు తన గర్భాన్ని తొలగించుకోవాల్సి వచ్చిందని తెలిపింది.

తన ప్రాణాలకు ముప్పు, అలాగే తప్పుడు రిపోర్టులు ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ భాదితురాలు వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కమిషన్, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ వైఖరిలో స్పష్టమైన నిర్లక్ష్యం ఉందని నిర్ధారించింది.

దీంతో బాధితురాలికి కలిగిన మానసిక వేదనకుగానూ రూ. 2 లక్షల పరిహారం, కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 20 వేలు, పరీక్ష ఫీజు రూ. 1,700 తక్షణమే చెల్లించాలని సదరు యాజమాన్యాన్ని ఆదేశిస్తూ కీలక తీర్పునిచ్చింది.

## మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి మృతి పట్ల మంత్రి శ్రీధర్ బాబు సంతాపం

**మంథని,ఫిబ్రవరి03(మనం న్యూస్)** మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి మృతి పట్ల రాష్ట్రఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల. శ్రీధర్ బాబు సంతాపం ప్రకటిం చారు. సర్పంచి గా ఎంపీపీగా శాసనసభ్యులుగా ఆయన మంత్రి నియోజక వర్గానికి ఎనలేని చేసిన ప్రజాసేవను ఈ సం దర్భంగా శ్రీధర్ బాబు స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## హరిపురం గ్రామంలో పశు వైద్య శిబిరం

**ఓదెల ఫిబ్రవరి 3,(మనం న్యూస్):** భారత మాజీ ప్రధాని పీ.వీ నరసింహారావు, తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం హరిపురం గ్రామంలో ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శిబిరంలో పశు గర్భకోశ చికిత్స,చర్మ వ్యాధులు,నట్టల నివారణ మందుల పంపిణీ తో పాటు గాలీ కుంటు వ్యాధి నివారణ మందులు,లంపి స్కిన్ వ్యాది నివారణ చర్యలు చేపట్టారు.



సుమారు 550ఆవులకు,గేదెలకు, కోళ్ళకు చికిత్స అందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్, డాక్టర్ జె. రాధ కృష్ణా రావు(ప్రొఫెసర్ -, డిపార్ట్మెంట్ ఆఫ్ వెటర్నరీ సర్జరీ,రేడియాలజీ విభాగం), డాక్టర్ రాజశ్రీ,, డాక్టర్ స్వాతి, పశువైద్య విద్యార్థులు 13 మంది,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఆర్.సునీత,కొలనూరు స్టాఫ్ మల్లికార్జున్,వీ ఏ గోపాల మిత్ర గోపతి ప్రవీణ్,వార్డు సభ్యులు ఆసరి మహేందర్, మాకోటి కుమార్,ముప్పు రాకేష్,పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## ఆశావహుల ఆత్మహత్యా యత్నాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 :** నామినేషన్ల ఉపసంహరణ మాటేంటో గాని కొన్నిచోట్ల సున్నిత మనస్కులున్న పార్టీ అభ్యర్థులకు శాపంగా మారింది. తమకు బీఫాం ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ అభ్యర్థులు క్షణికావేశానికి గురవుతున్న ఘటనలు జరుగుతున్నాయి.




నల్గొండ జిల్లా చండూరు పురపాలికలోని 9వ వార్డులో కాంగ్రెస్కు చెందిన భూతరాజు లత నామినేషన్ వేశారు. అదే వార్డులో మరో ముగ్గురు మహిళలు నామినేషన్లు వేయడంతో తన భార్యకు టికెట్ ఇవ్వరేమోనని భూతరాజు వేణు మనస్తాపం చెంది పురుగు మందు తాగారు. తన భార్యకు టికెట్ ఇవ్వకుండా కొందరు నాయకులు అడ్డుకుంటున్నారని 'సూసైడ్ నోట్' రాసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. కుటుంబసభ్యులు సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాలతో ఆయన బయటపడ్డారు.

జగిత్యాలలోని 16వ వార్డులో కాంగ్రెస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బొల్లి శేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. ఆ స్థానంలో ఇటీవల భారాస నుంచి కాంగ్రెస్లోకి వచ్చిన వ్యక్తికి టికెట్ ఇస్తున్నారంటూ ఆవేదనతో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడే ఉన్న మాజీ మంత్రి జీవన్రెడ్డి అడ్డుకున్నారు.

కాంగ్రెస్ తరపున సూర్యాపేట 25వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కోడి శిరీష నామినేషన్ వేశారు. టికెట్ వేరే వారికి కేటాయించారని మనస్తాపం చెంది ఆమె భర్త కోడి శివ సోమవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. కార్యకర్తలు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో జరిగింది.

# నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి,ఫిబ్రవరి 3,(మనం న్యూస్):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా తయారీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని, నిర్దేశిత సమయంలోగా ప్రక్రియ పూర్తి చేసి నిబంధనల ప్రకారం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తిగా వీడియోగ్రఫీ చేయడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులను సందర్శించి వంటశాల, ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు.తదనంతరం కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు మంజూరైన భోజనశాల ను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని రేగులగూడ గ్రామంలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాల కు మంజూరైన అదనపు గదుల నిర్మాణ ప్రక్రియను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమ ంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పొగమంచు వేకువలో...

ఒకసారి- పొగమంచు కప్పేసిన వేకువలో...
పాటల పక్షులు ఇంపుగా పాడుతున్న ఆ చోట,
మంచుబిందువులు సాలెగూళ్ళకు అతుక్కుని
అవి- వెండిదారాల పైన ముత్యాల వలే
మెరుస్తున్నాయి!

సీతాకోకచిలుకలు చూడసొంపుగా
నాట్యం చేస్తున్న చోట,
అడవిపూలు చైతన్యకళతో వికసిస్తున్నాయి;
ప్రకృతిమాత కడుపు లోపల (అరణ్య మధ్యాన)
తెల్లటితోక గల జింక-
ఉత్సాహంగా,రమణీయంగా
గంతులు వేస్తోంది!

రేపనేది స్పృహకే రాని ఈ (అడవి)భూమిలో
నీ చింతలన్నీ కరిగిపోయి
జాడకు లేకుండా పోతాయి
క్రిందికీ,పైకీ ఊగే చెట్ల కొమ్మలతో
వచ్చే గాలులతో
నీ దుఃఖాలన్నీ తేలుతూ దూరంగా వెళ్ళిపోయి
మటుమాయ మవుతాయి!

నేను నా కళ్ళను మూసుకుని
గాలిని ఒకపరి పీల్చుకున్నాను;
సంతోషం నిండిన కన్నీళ్లు ధారాస్రవంతిగ
నా ముఖం పైకి ప్రవహించాయి;
ఇక ముందుకు నడక ప్రారంభించాను నేను,
కానీ ఈ పవిత్రనిర్మలప్రాంత సౌందర్యం నన్ను
మళ్ళీ అధిగమించి,
కదలకుండా నిలబెట్టి ముంచెత్తేసింది!!!

ఆంగ్లమూలం: జిమ్మీ ఓస్బోర్న్
**స్వేచ్ఛానువాదం: రఘువర్మ**
9290093933

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# సంక్షోభం నుండి ప్రగతి దిశగా...

దేశంలో అన్ని రంగాలకు ఆర్థిక వెన్నుముక విద్యుత్ రంగం. దేశ స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ పాలనలో విద్యుత్ అనేది ధనికులు, ఉన్నత వర్గం, ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రమే ఒక విలాసవంతమైన సేవగా దొరికేది. స్వాతంత్రానంతరం అన్ని వర్గాల ప్రజలకు అవసరంగా అందుబాటులో రావడానికి భారత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ఉమ్మడి జాబితాలో చేరుస్తూ రాష్ట్రాలకు కూడా విద్యుత్ రంగంపై విస్తృత అధికారాలను కల్పించింది. ఆయా రాష్ట్రాలు వారి అవసరాల నిమిత్తం విద్యుత్ ఉత్పత్తి సరఫరా పంపిణిలకై రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డులను ఏర్పాటు చేసే అవకాశం కల్పిస్తే దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాలు రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డులను ఏర్పాటు చేసుకున్నాయి. వీటి పరిధిలో ప్రతి రంగంలోని వినియోగదారులకు విద్యుత్ను అందించడానికి కృషి చేశాయి. ఈ క్రమంలో స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డులన్ని ఆదాయ ఖర్చులలో వత్యాసంతో ప్రతి సంవత్సరం నష్టాలను చవి చూస్తూ అప్పుల్లో కూరుకు పోయాయి. వీటిని అప్పుల ఉబి నుండి తీసుకు రావడానికి వివిధ సంస్కరణలు తీసుకొచ్చిన, వీటిలో భాగంగా అప్పటి వరకు ఒకే ఉమ్మడిగా ఉన్న స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డులన్నీ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణి సంస్థలుగా విడి పోయాయి. ఇలా సంస్థలుగా వికేంద్రీకరణ అయిన తరువాత ఉత్పత్తి, సరఫరా సంస్థలు కొద్దిగా ఆర్థికంగా మెరుగ్గా ఉన్న వినియోగదారుల, ప్రభుత్వ సబ్సిడీలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న పంపిణి సంస్థలు మాత్రం ఏటా అప్పుల్లో కూరుకు పోతున్నాయి. వీటిని అప్పుల ఊబిలో నుండి బయటకు తీసుకు రావడానికి ప్రభుత్వాలు తమ బాధ్యతగా ఉదయ్, రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీమ్, ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్మెంట్ స్కీమ్, ఎల్‌పిఎస్ వంటి ఆర్థిక భరోసానిచ్చే పథకాలను తీసు కొస్తూ డిస్కంల పనితీరును, ఆర్థిక స్థితిని కేంద్ర ప్రభుత్వం పర్య వేక్షిస్తూ వస్తుంది. 2012 సంవత్సరం నుండి విద్యుత్ పంపిణీ సంస్థల యొక్క ఆర్థిక, పరిపాలన విషయాల మీద భారత ప్రభుత్వ ఇందన మంత్రిత్వ శాఖ రేటింగ్ ఇస్తు వస్తుంది. దీనికి నోడల్ ఏజెన్సీగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థను నియ మించింది. ఈ సంస్థ ప్రతి సంవత్సరం దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక నివేదికలను సేకరించి వాటిలో అంశాలను పరిశీలించి రేటింగ్ ఇస్తుంది. దీనిలో భాగంగా గత జనవరి నెలలో విద్యుత్ పంపిణి సంస్థల 14వ ఇంటిగ్రేటెడ్ రేటింగ్స్ మరియు ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఈ నివేదిక విద్యుత్ పంపిణీ సంస్థల యొక్క ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన సగటు ఖర్చుకు సగటు రాబడి మధ్య తేడా, వినియోగదారుల నుండి ఆదాయ సమీకరణకు పట్టే



రోజులు, ఉత్పత్తి సరఫరా సంస్థల చెల్లింపులకు పట్టే రోజులు, అప్పుల ద్వారా సంపాదించిన ఆస్తులు (ఆస్తులు అప్పుల మధ్య నిష్పత్తి), వచ్చే ఆదాయంతో అప్పులను తీర్చే సామర్థ్యం వంటి అంశాలు, పనితీరుకు సంబంధించిన బిల్లింగ్ సామర్థ్యం, కలెక్షన్ సామర్థ్యం,పంపిణీ నష్టాలు, కార్పొరేట్ విధానాల వంటి అంశాలు, బాహ్య విధానాలకు సంబంధించిన ప్రభుత్వ సబ్సిడీల సేకరణ, ప్రభుత్వ బకాయిలు, పెరిగే ఇంధన ఖర్చులకు అనుగుణంగా టారిఫ్ పెంచడం వంటి అంశాలు ఇలా మొత్తంగా 15 అంశాలను కొలమానంగా తీసుకొని అనుకూల మార్కులు అలాగే ఆడిట్ నివేదికను పంపడంలో ఆలస్యం, అకౌంట్స్ నిర్వహణ, టారిఫ్ నమోదులో ఆలస్యం , బ్యాంకులకు రుణాలు చెల్లించడంలో వైఫల్యం, ఖర్చులు మరియు ఆదాయానికి మధ్య భర్తీ కానీ లోటు, నియంత్రణ ఆస్తుల పెరుగుదల వంటి అంశాలలో ప్రతికూల మార్కులు కేటాయిస్తూ మొత్తంగా 100 మార్కులకు రేటింగ్ ఇస్తారు. ఇలా పంపిణీ సంస్థలకు వచ్చిన స్కోరును బట్టి ఎ+(100-85),ఎ(65-85),బి(50-65),బి-(35-50), సి(15-35), సి -(5-15),డి గ్రేడ్‌లను కేటాయిస్తారు. ఇలా డిస్కంల ఆర్థిక స్థితి, పనితీరు పరిశీలించి 42 ప్రభుత్వ, 12 ప్రైవేట్ పంపిణి సంస్థల అలాగే 11 పవర్ డిపార్ట్‌మెంట్ సంస్థల గ్రేడుల నివేదిక విడుదల చేసింది. 14వ సమీకృత శ్రేణుల నివేదిక ప్రకారం 31 విద్యుత్ పంపిణీ సంస్థలు ఎ+, ఎ గ్రేడ్ లను సాధిస్తే 11 సంస్థలు సి, సి-, గ్రేడులు సాధించాయి. 13వ నివేదికతో పోలిస్తే 18 విద్యుత్ పంపిణీ సంస్థలు, 4 పవర్ డిపార్ట్‌మెంట్‌లు తమ స్థాయిలను మెరుగు పర్చుకున్నాయి. 9 పంపిణీ సంస్థలు 1 పవర్ డిపార్ట్‌మెంట్ తమ స్థాయిలను తగ్గించు కున్నాయి. అలాగే గత సంవత్సరం రేటింగ్ ప్రకారం సీ, సి-గ్రేడులలో 18 సంస్థలు ఉంటే అది ప్రస్తుతానికి 10కి తగ్గింది. గత సంవత్సరంతో పోలిస్తే అగ్రిగేట్ టెక్నికల్ అండ్ కమర్షియల్ నష్టాలు 15.97 శాతం నుండి 15.04 శాతానికి తగ్గాయి. బిల్లింగ్ సామర్థ్యం 86.99 శాతం నుండి 87.59 శాతానికి పెరిగింది. అలాగే కలెక్షన్ సామర్థ్యం 96.60 శాతం నుండి 97.00 శాతానికి పెరిగింది. 17 సంస్థలు 100 శాతం కలెక్షన్ చేస్తే 29 సంస్థల కలెక్షన్ సామర్థ్యం క్రితం గణాంకాలతో పోలిస్తే పెంచుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం అన్ని పంపిణీ సంస్థల పన్నుల అనంతర లాభం కాస్త 27020 కోట్లు నష్టంగా ఉంటే ఈ ఆర్థిక సంవత్సరం దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 2770 కోట్ల పన్ను అనంతర లాభాల్ని గడించాయి. ఇది విద్యుత్ రంగా చరిత్రలో చెప్పుకో దగ్గ మైలురాయని అని చెప్పాలి. ఒక యూనిట్ విద్యుత్ సగటు కొనుగోలు ధరకు(ఎసిఎస్) మరియు సగటు ఆదాయ అవస రాల(ఎఆర్ఆర్)ల మధ్య తేడా0.32/kwh నుండి 0.7/kwh కు తగ్గింది. ఇది గణనీయమైన తగ్గుదల అని చెప్పాలి. వివిధ పథకాల ద్వారా ప్రభుత్వాల నుండి పొందే సబ్సిడీలు శాతం 97.45 నుండి 98.90 శాతానికి పెరిగింది. మన తెలంగాణతో సహా 13 రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థలకు 100 శాతం సబ్సిడీ పద్దులను చెల్లించాయి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు. వినియోగ దారుల నుండి కలెక్షన్ 113 రోజుల నుండి 112 రోజులకు అలాగే ఉత్పత్తి సరఫరా సంస్థలకు చెల్లించే పద్దులను 132 రోజులనుండి 113 రోజులకు తగ్గింది. ఇలా ఎ+ సాధించిన 12 పంపిణీ సంస్థల్లో ఆరు ప్రైవేట్ ఆరు ప్రభుత్వ డిస్కంలు ఉన్నాయి. దేశంలో విద్యుత్ పంపిణి చేసే ప్రైవేట్ డిస్కంలు అన్ని పన్ను అనంతర లాభాలను గడించాయి. అలాగే 44 ప్రభుత్వ విద్యుత్ పంపిణి సంస్థలో 22 సంస్థలు వార్షిక లాభాలను అర్జించాయి.

ఈ గణాంకాలు పరిశీలిస్తే అర్థం అవుతుంది ప్రభుత్వ డిస్కంలు కూడా రోజూరోజుకు తమ ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చుకుంటూ తమ పనితీరును మార్చుకుంటూ ప్రజలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ను అందిస్తున్నాయి. ఇలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు వినియోగదారులు అందరు విద్యుత్ సంస్థలకు సహకరిస్తే ప్రస్తుతం ఉన్న ప్రైవేట్ పంపిణీ సంస్థలతో పాటు ప్రభుత్వ డిస్కంలు అన్ని ప్రగతి పథంలో నడుస్తాయి. కేంద్ర ప్రభుత్వం కూడా విద్యుత్ను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలనే ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

**- భైరబోయిన వెంకటేశ్వర్లు**
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ల సంఘం

# సాయుధ యోధుడు మగ్దూం

హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచమంతా గర్వించేలా, గౌరవించేలా తన గళంతోనూ, కలంతోనూ ప్రచారం చేసిన గొప్ప వ్యక్తి మగ్దూం మొహియుద్దీన్. భారత దేశంలో వచ్చిన ప్రగతి శీల రచయితల ఉద్యమానికి హైదరాబాద్లో జీవం పోసింది మఖ్దుమే. నాలుగు దశాబ్దాలకు పైగా కమ్యూనిస్టు ఉద్యమాలకు, సాహిత్య సృజనకు తన జీవితాన్ని అంకితమిచ్చాడు. మొక్కవోని ధైర్యంతో కులమతాల కతీతంగా పేదల పక్షాన నిలిచి వారి అభ్యున్నతికి ఆయన కృషి చేశాడు.



మగ్దూం మొహియుద్దీన్ ప్రముఖ అధ్యాపకుడు, ఉర్దూ కవి. 'షాయరే ఇంక్విలాయ్' (ఉద్యమ కవి, విప్లవ రచయిత) బిరుదాంకితుడు. కవి, నాటక కర్త, గాయకుడు, నటుడు కూడా. ఇతని గజల్ లు, పాఠ్యాంశాలలోను, సినిమాల లోనూ ఉపయోగించాడు. ఆయన రాసిన 'ఏ జంగ్ హై జంగే ఆజాదీ' 'ఎక్ చంబేలీకె మండ్వే తలే' అనే గీతాలు ప్రసిద్ధి పొందాయి. ఉర్దూ మహా కవిగా ప్రపంచాన్ని ఉర్రూతలూగించాడు.

మగ్దూం మొహియుద్దీన్ తెలంగాణ లోని మెదక్ జిల్లా ఆందోల్‌లో 1908, ఫిబ్రవరి 4న జన్మించాడు. ఆయన పూర్తిపేరు అబూ సయిద్ మహ్మద్ మఖ్దూమ్ మొహియొద్దీన్ ఖాద్రి. అయన పూర్వీకులు ఉత్తరప్రదేశ్‌లోని ఆజంగఢ్‌లో ఉండే వారు. ఆయన తాత (తల్లితండ్రి) రషీదుద్దీన్ ఔరంగజేబు సైన్యాలతో పాటు దక్కన్ పీఠభూమికి వచ్చాడు. అలాగే, మరో తాత (తంపూడికి తండ్రి) సయ్యద్ జాఫర్ అలీ కూడా ఉత్తర ప్రదేశ్ షాజహానాబాద్ నుండి 1857లోనే దక్షిణానికి వచ్చాడు.ఆ కుంటుంబ మంతా హైద్రాబాద్ దక్కన్ పరిసరాలకు చేరింది. ఆయన తండ్రి గౌస్ మొహియొద్దీన్ నిజాము ప్రభుత్వంలో సూపరింటెండెంటుగా పని చేసేవాడు. ఆయన రాసిన 'గోథే ప్రేమ లేఖలు' 'మక్తబా' అనే స్థానిక ఉర్దూ పత్రిక అచ్చు వేసింది.

నాగపూర్ కామ్రేడ్‌ల సహాయంతో 1930-40లలో హైద్రాబాద్‌లో 'స్టూడెంట్స్ యూనియన్' ప్రారంభించాడు. 1940లో తన సహచరులతో కలిసి కమ్యూనిస్టుపార్టీలో చేరాడు. చంద్ర రాజేశ్వర రావు, గులాంహైదర్, రాజ బహుదూర్ గౌర్, హమీదలీ ఖాద్రీలాంటి నాయకులతో కలిసి పని చేస్తుండేవాడు. అక్తర్ హుస్సేన్ రాయ్‌పురి, సిబ్తె హసన్‌లతో కలిసి హైద్రాబాద్‌లో 'అభ్యుదయ రచయితల సంఘం' స్థాపించాడు. సరోజినీ నాయుడు నివాసమైన గోల్డెన్ త్రెషోల్డ్‌లో డాక్టర్ జయసూర్య, జె.వి.నరసింగరావులతో కలిసి సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చలు జరుపుతుండే వాడు. చార్మినార్ సిగట్ ఫ్యాక్టరీ, బట్టలగిర్నీ,అల్విన్,షాబాద్ సిమెంట్, ఎన్ ఎస్సార్ రైల్వే ఎంప్లాయిస్,ఎలక్ట్రిసిటీ,సి.డబ్ల్యు.డి. మున్సిపాలిటీ, బటన్ ఫ్యాక్టరీ వంటి వందల కంపెనీల్లోని కార్మిక సంఘాలకు మఖ్దూమ్ అధ్యక్షుడయ్యాడు. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో మెదక్ నుండి పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడి పోయాడు. శాసన మండలికి ఎన్నికై 1969లో కన్నుమూసే దాకా కమ్యూనిస్టు నేతగా ఆ పదవిలో కొనసాగాడు. మఖ్దూం ఫాసిజానికి వ్యతిరేకంగా సమసమాజ స్థాపనకోసం క్రియాశీలంగా రాజకీయాల్లో పాల్గొన్నాడు. ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తి నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్నంకితం చేశాడు. మఖ్దూం మతాన్ని దూషించ లేదు, అనుసరించ లేదు. హైద్రాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ శాఖకు తొలి కార్యదర్శి. నిజాంకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్రధారి. సాయుధ పోరాటానికి ముందు కారాగార శిక్షలు, పోరాటం తర్వాత అజ్ఞాత వాసం. ఎఐటియుసికి జాయింట్ సెక్రటరీ. ఢిల్లీలో ఆల్ ఇండియాట్రేడ్ యూనియన్ సమాఖ్య (ఎ.ఐ.టి.యు.సి.) జాయింట్ సెక్రటరీగా ఉన్నాడు. 1952-55 మధ్య చైనా, సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలు, ఆఫ్రికన్ దేశాలు తిరిగి వచ్చాడు. ప్రపంచ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యాలయం వియాన్నాలో (1953-54) పనిచేశాడు.

1969, ఆగష్టు 25 తేదీన గుండె పోటుతో ఢిల్లీలో చనిపోయాడు. ఆయన పేరిట హైద్రాబాద్, హిమాయత్ నగర్‌లో సి.పి.ఐ. రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్ నిర్మించారు.

**ఫిబ్రవరి 4...మగ్దూం మొహియుద్దీన్ జయంతి**
**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# రికార్డు స్థాయిలో రక్షణ బడ్జెట్



భారత్‌కు ఓ వైపు పాక్, మరో వైపు చైనా, బంగ్లాదేశ్ నుంచి పెరుగుతున్న భద్రత సవాళ్ల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో రక్షణ బడ్జెట్‌ను పెంచింది. ఆపరేషన్ సిందూర్‌తో అత్యాధునిక యుద్ధతంత్రం అవసరాలను గుర్తించిన భారత్ అందుకు తగ్గట్లు కేటాయింపులను చేసింది. గతేడాది రక్షణ రంగానికి రూ.6.81లక్షల కోట్లు కేటాయించగా ఈసారి రూ.7.85 లక్షల కోట్లు కేటాయించింది.



ముఖ్యంగా రక్షణ దళాల ఆధునికీకరణకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసి దాదాపు 22 శాతం కేటాయింపులను పెంచింది. దేశ త్రివిధ దళాలను ప్రపంచంలోనే అత్యంత ఆధునికంగా, స్వదేశీ ఆయుధాలతో సన్నద్ధం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంది. అందుకే ఈ ఏడాది బడ్జెట్లో సైనిక ఆధునికీకరణకురూ. 2.19 లక్షల కోట్లను కేటాయించారు. గతేడాది రఫేల్ యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, మానవరహిత వైమానిక వాహనాల కోసం రక్షణ శాఖ ఒప్పందాలు చేసుకుంది. ఈ క్రమంలో తాజా బడ్జెట్ కేటాయింపులు రక్షణ శాఖకు మరింత ఊతమివ్వ నున్నాయి.

రక్షణ రంగానికి కేటాయించిన మొత్తం మూలధన వ్యయాన్ని రూ.2,19,306 కోట్లుగా నిర్మలా సీతారామన్ నిర్ణయించారు. రెవెన్యూ వ్యయాన్ని రూ.5,53,668 కోట్లుగా ఉంచారు. ఇందులో రక్షణ రంగానికి చెందిన ఉద్యోగుల పింఛన్ల కోసం రూ.1,71,338 కోట్లు కేటాయించారు. మూలధన వ్యయం కింద విమానాలు, ఏరో ఇంజిన్ల కోసం రూ.63,733 కోట్లు, నౌకాదళం కోసం రూ.25, 023 కోట్లు కేటాయించారు.

శిక్షణ, ఇతర విమా నాల తయారీకి అవసరమైన విడిభాగాలు, భాగా లపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయిం చాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. రక్షణ రంగంలోని విమానాల విడిభాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి పదార్థాలపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఈ మేరకు వ్యాఖ్యా నించారు. మంత్రి తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు డిఫెన్స్ ఏరోస్పేస్ పరిశ్రమకు మరింత ఊతమి స్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ముఖ్యంగా రక్షణ దళాల ఆధునికీకరణకు ఈ బడ్జెట్లో పెద్దపీట వేశారు. 21.84 శాతం కేటాయింపులను పెంచారు. గతేడాది కేవలం 1.8లక్షల కోట్లనే కేటాయించగా, ఈసారి దానిని రూ. 2.19 లక్షల కోట్లకు పెంచారు. గత మూడేళ్లతో పోలిస్తే అత్యధికంగా రూ.255 కోట్లు ఇచ్చారు. గతేడాది రూ.222 కోట్లు మాత్రమే కేటాయించారు. రక్షణ రంగంలో రహస్యమైనవిగా భావించే స్పెషల్ ప్రాజెక్టులకు కూడా రూ.1989.12 కోట్లను ఇచ్చారు.

ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం నేవీ, ఎయిర్‌ఫోర్స్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, స్వదేశీ ఆయుధాల తయారీని వేగవంతం చేయడానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో రక్షణ రంగానికి భారీగా బడ్జెట్ను కేటాయించింది. 2025-2026 ఆర్థిక సంవత్సరం కన్నా రూ.లక్ష కోట్లకు పైగా అదనపు మొత్తాన్ని రక్షణ రంగానికి ఇచ్చింది. అంటే గతేడాది కన్నా ఈ ఏడాది రక్షణ రంగానికి 15 శాతం నిధులను అదనంగా కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర సర్కార్ రక్షణ రంగానికి రూ.6,81,210 కోట్లు కేటాయించింది.

మూలధన వ్యయాన్ని రూ.1,80,000 కోట్లుగా నిర్ణయించింది. సవరించిన అంచనాల దశలో అది రూ.1,86,454 కోట్లకు పెరిగింది. అయితే ఈ ఏడాది రక్షణ బడ్జెట్‌ను ఏకంగా రూ.7.84 లక్షల కోట్లుకు పెంచింది. గత ఏడాది మేలో భారత్, పాకిస్తాన్ మధ్య ఘర్షణ తలెత్తిన నేపథ్యంలో రక్షణ బడ్జెట్ 15 శాతం పెరిగింది. పహల్గామ్ కాల్పుల తరువాత పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నట్టు భారత్ ప్రకటించింది.

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, వచ్చే ఏడాది అమలులోకి రానున్న పే-కమిషన్ సిఫార్సులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించే అవకాశం ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును జీడీపీలో 4.2 నుంచి 4.4 శాతం పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు యూబీఐ పేర్కొంది.

అంతేకాకుండా, 2031 నాటికి రుణ-జీడీపీ నిష్పత్తిని 50 శాతానికి తగ్గించాలనే దీర్ఘకాలిక ప్రణాళికతో కేంద్రం అడుగులు వేస్తోంది.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం తన వ్యయాన్ని కొనసాగించనుంది. జీడీపీలో దాదాపు 3.2 శాతానికి సమానమైన రూ. 12.4 లక్షల కోట్లను మూలధన వ్యయం కింద కేటాయించవచ్చు.

ఇందులో రక్షణ రంగం, జాతీయ రహదారుల నిర్మాణం , రైల్వే వ్యవస్థ ఆధునీకరణకు అత్యధిక ప్రాధాన్యత లభించనుంది. జీఎస్టీ పరిహారం సెస్ నిలిపివేత వంటి ఆదాయ పరమైన సవాళ్లు ఉన్నప్పటికీ, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతోంది.

**- ఇస్కా రాజేష్ బాబు**
93973 99298

# మీ వేలు ఎవరిని ఎన్నుకోబోతోంది?



వేలిపై సిరా చుక్క పడబోతోంది.. ఐదేళ్ల భవిష్యత్తును శాసించబోతోంది. ఆ చిన్న గుర్తు కేవలం ఓటుకు సాక్ష్యం మాత్రమే కాదు, మీ వీధి వెలుగుకు, మీ పట్టణ ప్రగతికి అది ఒక బలమైన హామీ. మురికి కాల్వల నిర్వహణ నుంచి మున్సిపల్ కార్యాలయాల పారదర్శకత వరకు మన నిత్యజీవితాన్ని ప్రభావితం చేసే క్షేత్రస్థాయి సమరానికి తెలంగాణ వేదికైంది. ఈ ఎన్నికలు కేవలం అధికారం కోసం జరిగే పోటీ కాదు ప్రజాస్వామ్య ఫలాలను నేరుగా ప్రజల ముంగిటకు చేర్చే ఒక మహత్తర అవకాశం. మీ వార్డు ప్రగతి రథసారథి ఎవరో నిర్ణయించే సమయం వచ్చేసింది.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పురపాలక ఎన్నికలు క్షేత్ర స్థాయి పాలనకు అసలైన పునాదులుగా నిలుస్తాయి. పట్టణ ప్రజల నిత్యజీవితాన్ని ప్రభావితం చేసే తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలతో పాటు పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాథమిక సేవలన్నీ పురపాలక వ్యవస్థ ద్వారానే అమలవుతాయి. అందుకే ఈ ఎన్నికల్లో పౌరుల చురుకైన భాగస్వామ్యం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అత్యంత ఆవశ్యకం.

రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం విడుదల చేసిన సమాచారం ప్రకారం, తెలంగాణలో 116 మునిసిపాలిటీలు, 7 నగర పాలక సంస్థలు ఈ ఎన్నికల్లో భాగస్వామ్యమవుతున్నాయి. మొత్తం 2,996 వార్డుల్లో సుమారు 52,43,023 మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకునేందుకు సిద్ధమయ్యారు. వీరిలో 26,80,014 మంది మహిళా ఓటర్లు, 25,62,639 మంది పురుష ఓటర్లతో పాటు 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ విస్తృత పౌర భాగస్వామ్యం పట్టణ పాలనలో సంభవించబోయే సానుకూల మార్పులకు స్పష్టమైన సూచిక.

ఈసారి పురపాలక ఎన్నికలు బహుముఖ పోటీతో రసవత్తరంగా సాగుతున్నాయి. రాజకీయ వర్గాల సమాచారం



ప్రకారం, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు అభ్యర్థులను బరిలోకి దింపాయి.ఎంఐఎం, తెలంగాణ జన సమితి, బాహుజన్ సమాజ్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ కొన్ని నగర ప్రాంతాల్లో తమ ప్రభావాన్ని కొనసాగిస్తాయి. అదనంగా, ఇతర చిన్న పార్టీలతో పాటు వేల సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉండటం తో ప్రతి వార్డులో సగటున 6 నుంచి 8 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు అంచనా. ఇది ఎన్నికలను మరింత ఉత్కంఠ భరితంగా మారుస్తోంది. ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ అధికారిక ప్రకటనల ప్రకారం, పురపాలక పోలింగ్ ఫిబ్రవరి 11, 2026న ఒకే విడతలో నిర్వహించనున్నారు. సాంకేతిక కారణాలతో ఎక్కడైనా అంతరాయం కలిగితే ఫిబ్రవరి 12న తిరిగి పోలింగ్ నిర్వహించే వెసులుబాటు ఉంది. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించగా, ఫిబ్రవరి 16న మేయర్లు లేదా చైర్మన్‌ల ఎంపికతో ఈ ప్రక్రియ ముగుస్తుంది.

భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ భాగం, పన్నెండవ షెడ్యూల్లో పేర్కొన్న 18 విధులు నేరుగా ప్రజల ప్రాథమిక అవసరాలతో ముడిపడి ఉన్నాయి. స్థానిక స్వపరిపాలన అనేది కేవలం అధికార వికేంద్రీకరణ మాత్రమే కాదు, అది పౌరుడికి అప్పగించినసామాజిక బాధ్యత. ప్రలోభాలకు లోనుకాకుండా, స్వేచ్ఛాయుతంగా, విచక్షణతో ఓటు వేయడం ప్రతి పౌరుడి నైతిక కర్తవ్యం. కుల మతాలకు అతీతంగా అభివృద్ధినే ప్రమాణంగా తీసుకుని ఓటు వేయడమే పరిపక్వ ప్రజాస్వామ్య లక్షణం.పట్టణ భవిష్యత్తుకు బాట పురపాలక ఎన్నికలు కేవలం తాత్కాలిక నినాదాల పోటీ కాదు ఇవి మన నగరాల భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపులు. వేలిపై పడే సిరా చుక్క బాధ్యతకు చిహ్నమైతే, ఆ వేలు ఎన్నుకున్న నాయకత్వమే పట్టణ వికాసానికి ప్రాణం. ఎన్నికలతో ప్రజాస్వామ్యం ముగియదు, అక్కడే బాధ్యతాయుత పాలన మొదలవుతుంది. మీ వీధి వెలగాలంటే, మీ పట్టణం గెలవాలంటే ఫిబ్రవరి 11న మీ ఓటు హక్కును చట్టబద్ధంగా, విచక్షణతో వినియోగించుకోవడమే నిజమైన పౌర ధర్మం. వివేకంతో ఓటు వేద్దాం.. వికాసానికి దారి చూపుదాం.

**- ఫిరోజ్ ఖాన్**
9640466464

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, ఫిబ్రవరి 03 (మనం ప్రతినిధి): మంగళవారం మెట్ పెల్లి మండలం బండ లింగపూర్ గ్రామంలోని నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మించుకునే ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వం 5 లక్షల రూపాయలు అందజేస్తుందని తెలిపారు. ఇటుక, కంకర, బేస్మెంట్ పై ధరల నియంత్రణ ఇండ్లు లబ్ధిదారులకు ధరలు అనుగుణంగా ఉండేలా అధికారులను కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వెనుకబడి ఉన్నట్లయితే వేగవంతం పెంచాలని అధికారులకు ఆదేశించారు. గడువులోపు వారికి కేటాయించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భవనాలు ప్రభుత్వం నిర్దేశించిన పరిణామం కలిగి ఉండాలని లబ్ధిదారులకు మరియు నిర్మాణాన్ని సకాలంలో నిర్మించుకునేందుకు కావాల్సిన మేస్త్రీలు, కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆర్థిక పరమైన సమస్యలుంటే ఐకేపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలని అన్నారు. దశలవారిగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపు నేరుగా ఆధార్ లింక్ చేయబడిన లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలు మార్కింగ్, బెస్మెంట్, స్లాబ్ లెవెల్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇళ్ల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి గృహప్రవేశం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్ పిడి ప్రసాద్, ఎంపిడివో సురేష్ మరియు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన

# సీఎం కప్ క్రీడా పోటీలు



సుల్తానాబాద్, ఫిబ్రవరి 03 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలు సుల్తానాబాద్ మండలం, మున్సిపాలిటీ స్థాయి పోటీలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో దివ్యదర్శనరావు, మున్సిపల్ కమిషనర్ రమేష్, మండల విద్యాశాఖ అధికారి ఆరెపల్లి రాజయ్య, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్ హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత శారీరకంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, సీఎం కప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రతిభకు మంచి వేదిక లభిస్తోందని పేర్కొన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, ఐక్యత పెరుగుతాయని తెలిపారు.ఈ పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ జి ఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్, ప్రకాష్ (పెద్దన్న) వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, సంధ్య, శ్రీవాణి,ఆసియా, సరోజ,స్వప్న,వెంకటేష్, మధుకర్, సంపత్, సత్యం, ఇక్బాల్, అజ్జు, రంజిత్, మమత విద్యార్థులు పాల్గొన్నారు.



# పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 03 (మనం న్యూస్): సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మి నంబులాద్రి స్వామి రథోత్సవం, జాతర సందర్బంగా మంగళవారం సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ స్వామి వారి కృపా కటాక్షాలతో పెద్దపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దూసుకు వెళ్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పని ప్రదేశాలల్లో మహిళల పై లైంగిక వేదింపుల నిరోధక చట్టం కమిటీలు ఏర్పాటు చేయాలి

- జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్ రావు

పెద్దపల్లి,ఫిబ్రవరి 03 (మనం ప్రతినిధి): పని ప్రదేశాలల్లో మహిళల పై లైంగిక వేదింపుల నిరోధక చట్టం అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలల్లో పని చేస్తున్నటువంటి మహిళల పై పని ప్రదేశాలల్లో లైంగిక వేదింపుల నివారణ కొరకు 10 మంది మహిళలలు అంతకు మించి పని చేస్తున్న ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలల్లో చట్ట ప్రకారం కమిటీలు ఏర్పాటు చేయాలని ,పని ప్రదేశంలో మహిళల పై లైంగిక వేదింపుల నిరోధక చట్టం - 2013 ప్రకారం అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసి అట్టి కమిటీ సభ్యుల పేర్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్ నందు నమోదు చేసి ఫిబ్రవరి 20 లోగా కమిటీలు ఏర్పాటు చేయాలని. లేనియెడల సంబంధిత అధికారికి, సంస్థ యాజమాన్యానికి చట్ట ప్రకారం జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# క్యాన్సర్ మహమ్మారిని పారద్రోలాలి



- జడ్జి దుర్గం గణేశ్

సుల్తానాబాద్ ఫిబ్రవరి 03 (మనం న్యూస్): క్యాన్సర్ మహమ్మారిని పారద్రోలాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పేషంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషంట్లకు క్యాన్సర్ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ రమాదేవి, న్యాయవాదులు మాడూరి ఆంజనేయులు, వొడ్నాల రవీందర్, జోగుల రమేష్, ఎస్త్రి వేణుగోపాల్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికలపై అవగాహనా సదస్సు

- ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం
- పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లు దూరంలో ఉండాలి
- ఫిబ్రవరి 16 వరకు ఎన్నికలు కోడ్ అమలులో ఉంటుంది
- గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి



గోదావరిఖని, ఫిబ్రవరి 03 (మనం న్యూస్): ఎన్నికల సమయంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి. ఈ మేరకు రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతి నగర్ (60వ డివిజన్), విఠల్ నగర్ (12వ డివిజన్) లలో అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు. అభ్యర్థులు ఎన్నికల నియామవళిని ఖచ్చితంగా పాటించాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని సూచించారు. ప్రచారం, మైకులు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లు దూరంలో ఉండాలని, ఫిబ్రవరి 16 వరకు ఎన్నికలు కోడ్ అమలులో ఉంటుందని, ఏలాంటి విజయోత్సవ ర్యాలీలు టపాకాయలు కాల్చడం చేయకూడదని, ఎన్నికల నియమాల ఉల్లంఘనలకు పాల్పడితే, అభ్యర్థులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని, అలాగే ఏలాంటి సమస్యలు ఎదురైన వెంటనే పోలీసులకు, ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలని, ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రజలు, అభ్యర్థులు పోలీసులకు సహకరించాలని, ఎన్నికల నిర్వహణకు అన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. ఈ డివిజన్ సదస్సులో ఎస్ఐలు రమేష్, అనూష, డివిజన్ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, క్రైమ్ సిబ్బంది, బ్లూ క్లోట్స్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- అనుమతి లేని డ్రోన్లు, డిజే సౌండ్స్‌పై కఠిన చర్యలు
- రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా



గోదావరిఖని, ఫిబ్రవరి 03 (మనం న్యూస్) : రామగుండం కమీషనరేట్ పరిధి పెద్దపల్లి జిల్లాలో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భద్రతను పరిరక్షించేందుకు నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. అనుమతి లేని డీజే సౌండ్స్, డ్రోన్ల వినియోగంపై నిషేధాజ్ఞలు విధించినట్లు పేర్కొన్నారు.

అయితే కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరైతే సంబంధిత డివిజన్ ఏసిపి అనుమతి తీసుకోవాలని, ఏ ప్రాంతంలో ఎంత స్థాయిలో మైక్ సెట్ వినియోగించాలో స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్ 7(1), 2016, యాక్ట్ 22(1)(ఏ) నుండి (ఎఫ్), 22(2)(ఏ) (బి), 22(3), సిటీ పోలీస్ యాక్ట్ 1348 నం. ఐగీ ఫసలీ, సెక్షన్ 30, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం 2026 ఫిబ్రవరి 01 ఉదయం 6 గంటల నుండి 2026 మార్చి 01ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటుందని, ఈ కాలంలో ఏలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, అవసరమైతే పోలీసుల అనుమతి తీసుకోవాలని, అన్ని వర్గాల ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఆ ప్రకటనలో పోలీస్ కమిషనర్ కోరారు.

# ఈనెల 10 లోపు క్రిస్టియన్ నిరుద్యోగ యువత ప్లంబర్ కోర్సు గడువు

- జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు

పెద్దపల్లి, ఫిబ్రవరి 3(మనం ప్రతినిధి): ఈనెల 10 లోపు క్రిస్టియన్ నిరుద్యోగ యువతకు ఉచితంగా ప్లంబర్ కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆదేశాల మేరకు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్, ఎస్.సి.సి.ఎల్, స్కూల్ బిల్డింగ్ , ఎన్టిపిసి గోదావరిఖని ద్వారా నిరుద్యోగ క్రిస్టియన్ మైనారిటీ యువతకు 90 రోజుల పాటు ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని అన్నారు. క్రిస్టియన్ / రోమన్ కాథలిక్ / ఆంగ్లో-ఇండియన్,సంబందిత తహసిల్దార్ గారి ద్వారా జారీ చేయబడిన బిసి-సి కుల ధృవీకరణ పత్రము తప్పనిసరిగా జత చేయాలని లేదా బాప్టిస్మ్ సర్టిఫికేట్ తో పాటు సెల్ఫ్ డిక్లరేషన్ రు.10/- ల బాండ్ పేపర్ తో తప్పనిసరిగా ఇవ్వాలని, అభ్యర్థుల వయసు 18 నుండి 45 లోపు ఉండాలని అన్నారు. దరఖాస్తుదారుల తల్లి తండ్రుల సంవత్సర అదాయం రూరల్ లో రూ.1,50,000/- లక్షలు, అర్బన్ లో 2 లక్షలకు మించ కూడదని, 7 వ తరగతి చదివి ఉండాలని, అధార్ కార్డు / వోటర్ ఐ.డి. కార్డు తప్పని సరిగా కలిగి ఉండాలని, ఏదైనా ప్రభుత్వ రంగ సంస్థలలో పైన తెలిపిన ప్లంబర్ కోర్సు లో ఇంతకుముందు శిక్షణ తీసుకొని ఉన్నవారు అర్హులు కారని అన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 10 సాయంత్రం ఐదు గంటల లోపు కలెక్టరేట్ లోని ఫస్ట్ ఫ్లోర్ రూమ్ నెంబర్ 232 నందు గల మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని, నిరుద్యోగ క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా ఆయిల్నేని వెంకటేశ్వర్ రావు




జగిత్యాల, ఫిబ్రవరి 3(మనం న్యూస్): భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ యల్ రమణ, మాజీ జడ్పీ ఛైర్పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణ బి ఆర్ యస్ అధ్యక్షునిగా ఆయిల్నేని వెంకటేశ్వర్ రావు ను నియమించినట్లు జగిత్యాల జిల్లా బి ఆర్ యస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు

# ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి

- స్వశక్తి మహిళా సంఘాలకు రుణాల పంపిణీ మరింత పెంచాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



3 ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బ్యాంకర్లతో డీసీసీ ,డీ.ఎల్.ఆర్.సి సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాలకు రుణాల పంపిణీ పెంచాలని అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్రింద విజయవంతంగా నడుస్తున్న వ్యాపార యూనిట్లకు ప్రచారం కల్పించాలని అన్నారు. వి హబ్ త్వరలో అందుబాటులో వస్తుందని, మహిళలు మరింత వ్యాపార రంగంలో ఎదిగేందుకు బ్యాంకుల కూడా ముందుకు రావాలని అన్నారు. 2025-26 లో జిల్లాలోని రైతులకు పంట రుణాల క్రింద 1916 కోట్లు పంపిణీ లక్ష్యానికి గాను 1471 కోట్ల పంపిణీ చేశామని, వ్యవసాయ టర్మ్ రుణాల క్రింద 651 కోట్ల పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ టర్మ్ రుణాల పంపిణీ పై దృష్టి సారించాలని అన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ లకు. 2025-26 లో 1215 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం కాగా 926 కోట్ల రుణం పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. 5 వేల 111 స్వశక్తి సంఘాలకు 361 కోట్ల 60 లక్షలు బ్యాంకు రుణాలు అందించామని అధికారులు తెలిపారు. మెప్మా క్రింద నిర్దేశించుకున్న లక్ష్యం కంటే అదనంగా 494 సంఘాలకు 63 కోట్ల 2 లక్షల రూపాయల రుణం పంపిణీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మహిళా సంఘాలకు పంపిణీ చేసిన రుణాలు రికవరీ పై కూడా శ్రద్ధ పెట్టాలని, ఎక్కడా ఎన్.పి.ఏ రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం స్వానిధి క్రింద వీధి వ్యాపారులకు రుణ పంపిణీ నిర్దేశిత లక్ష్యం ప్రకారం జరగాలన్నారు. రుణాలు చెల్లించిన వీధి వ్యాపారులకు మరో విడత రుణాలు అందించాలని కలెక్టర్ సూచించారు. యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో వాడుకోవాలని అన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 8 కోట్ల 57 లక్షల సబ్సిడీతో 119 యూనిట్ల, స్టాండ్ అప్ ఇండియా క్రింద 5 కోట్ల 17 లక్షల సబ్సిడీతో 57 యూనిట్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ముద్ర రుణాల కింద 14,718 మందికి 173 కోట్ల రూపాయలు అందించామన్నారు. చిన్న ఆహార శుద్ధి కేంద్రాల ఏర్పాటులో భాగంగా జిల్లాలో 74 దరఖాస్తులను ఆమోదించి రుణాలు పంపిణీ చేశామని, మరో 37 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని వీటిని పరిశీలించి అర్హులకు రుణాలు పంపిణీ చేయాలని కలెక్టర్ తెలిపారు. పీఎం విశ్వకర్మ స్కీం క్రింద జిల్లాలో 1270 మంది అర్హులైన అభ్యర్థులకు 11 కోట్ల 43 లక్షల రుణాలు పంపిణీ చేశామని అన్నారు.ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ , వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్ లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయం



- పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్

వేములవాడ,ఫిబ్రవరి3(మనం న్యూస్): మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయం అని కాంగ్రెస్ పార్టీ వేములవాడ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.మంగళవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను ఆయన విడుదల చేశారు.. వారు మాట్లాడుతూ ఈ నెల 11 న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధి కి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.. గత పది సంవత్సరాలుగా గత పది సంవత్సరాలుగా వేములవాడ పట్టణాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాజన్న ఆలయం అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.., గతంలో బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలకు అవకాశం ఇచ్చారని,గతంలో వారికి అవకాశం ఇస్తే వేములవాడ పట్టణ అభివృద్ధిని విస్మరించరని,ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చేసిన అభివృద్ధి పనులను బేరీజు వేసుకోవాలన్నారు.. మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ కి వేయాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నారని వేములవాడ ఎమ్మెల్యే గా ఆది శ్రీనివాస్ మీకు అండగా ఉన్నారని మీ అమూల్యమైన ఓటును చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించలని పిలుపునిచ్చారు..



# బి ఫాంలకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

గోదావరిఖని, ఫిబ్రవరి 03 (మనం న్యూస్): రామగుండం నగర పాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థుల బి ఫాంలకు రామగుండం నియోజకవర్గం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజనాద్రి గుట్టపై శ్రీ ధనుర్బాణ రామాంజనేయ స్వామి ఆలయంతో పాటు, సప్తగిరి కాలనీలోని శివాలయంలో వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి స్వామివారి ఆశీస్సులు ఉంటాయని, అభ్యర్థులందరూ విజయం సాధించి రామగుండం నగర సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యేరాజ్ ఠాకూర్ ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- రాష్ట్ర హౌసింగ్ సెక్రెటరీ , ఎం.డీ వీ.పీ.గౌతమ్






**సంగారెడ్డి, ఫిబ్రవరి 3 (మనం ప్రతినిధి):** ఇందిరమ్మ గృహ లబ్ధిదారులందరూ నిర్దేశిత గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యదర్శి, మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ కార్యదర్శి మరియు మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ మంగళవారం జిల్లాలోని సదాశివపేట, కోహిర్ , జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోనీ గ్రామాలలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను కలిసి ఇసుక సరఫరా, బిల్లుల చెల్లింపులు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలను బట్టి వెంటదివెంట బిల్లులు చెల్లిస్తున్నామని, ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల క్షేత్రస్థాయి పరిస్థితిని మండలాల వారీగా హౌసింగ్ ఎం.డీకి వివరించారు. జిల్లాకు 12,479 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 8081 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని, అందులో 6549 ఇండ్లు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులకు నిర్మాణ దశల వారీగా బిల్లులు వెంటవెంటనే మంజూరు చేస్తున్నామని, ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణం అందిస్తూ నిర్మాణ పనులు చేపట్టేలా ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 1930 మంది లబ్ధిదారులకు రూ.21 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డీ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఇల్లు కట్టుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకుని అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరగాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులకు ఎలాంటి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లాలో అనేక మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి సంతృప్తికరంగా ఉందని, అయితే కొన్ని మండలాల్లో నిర్మాణాలు మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రౌండ్ కాని ఇళ్లను వెంటనే గ్రౌండ్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 4,000 ఇండ్లు రూఫ్ లెవెల్లో ఉన్నాయని, వాటిని మార్చి 31లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు ఏఈలు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మోడల్ హౌస్లు పూర్తికాని ప్రాంతాల్లో ఎంపీడీవో కార్యాలయాల్లో హౌసింగ్ ఏఈలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇళ్లను సూపర్ చెక్ చేయాలని, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాల్లో సరైన సలహాలు, సూచనలు ఇస్తూ మోటివేట్ చేయాలని సూచించారు. న్యూ టెక్నాలజీ ద్వారా తక్కువ ఖర్చుతో నిర్మించిన ఇళ్లను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సర్పంచులు, లబ్ధిదారులకు చూపించి అపోహలను తొలగించాలని తెలిపారు. అదేవిధంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కాలనీలకు సంబంధించిన అన్ని ఎంబిలు రికార్డు చేసి, లబ్ధిదారులకు స్వాధీనం చేయని ఇండ్లన్నింటిని హౌసింగ్ శాఖకు స్వాధీనం చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ ఏజెన్సీలకు ఆదేశించారు. రెండు నెలల్లోగా ఫైనల్ స్టేజీలో ఉన్న అన్ని ఇండ్లు పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ జిల్లా పీడీ చలపతిరావు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ డీఈలు, ఈఈలు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# కారణాలు చెప్పొద్దు



- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని రండి
- వార్డుల్లో సమస్యలని పరిష్కరించే బాధ్యత నాది
- కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేసిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి, ఫిబ్రవరి 3 (మనం ప్రతినిధి):** సంగారెడ్డి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 38 వార్డుల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి దిశా నిర్దేశం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు అభ్యర్థులు ఎలాంటి కారణాలు చెప్పవద్దని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని వచ్చినట్లయితే సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి వార్డులను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు డ్రైనేజీలు నిర్మాణం పూర్తి చేయిస్తానని అన్నారు మీ వార్డుల్లో ఉన్న అభ్యర్థులను గెలిపించడంతోపాటు మిగతా వార్డుల్లో పరిచయం ఉన్న వాళ్లను కూడా గెలిపించేలా కార్యకర్తలు ప్రచారం చేసి గెలిపించాలని సూచించారు. ఎన్నికల తర్వాత కారణాలు చెప్పవద్దని అభ్యర్థులను గెలిపించుకొని రావడమే మీ బాధ్యత అని అన్నారు అందరూ కలిసికట్టుగా పనిచేసి 38 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి అని కోరారు ఐదో వార్డు చెందిన అవకాశం కల్పిస్తానని ఆ వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకొని రావాలని పేర్కొన్నారు.

## కలెక్టర్ దివాకర్ టిఎస్‌ను సన్మానించిన టిఎన్జీవోలు



**ములుగు,ఫిబ్రవరి 3 మనం ప్రతినిధి :** మేడారం మహా జాతరలో గద్దెల పునర్నిర్మాణంలో అహర్నిశలు శ్రమించి అక్కడే ఉంటూ పనులు పర్యవేక్షించి మేడారం జాతరను విజయవంతం చేసిన జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ను మంగళవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి అసోసియేషన్ డైరీ అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మహేందర్ జి రెవెన్యూ అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సంపత్ రావు సెక్రెటరీ జీవన్ కుమార్, ట్రెజరర్ ప్రకాష్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ కొమురయ్య, సంఘ నాయకులు రాజు, శ్రీనివాస్ లక్ష్మణ్ నాయక్, యశ్వంత్, విజయ భాస్కర్ శైలజ రఫీక్ దుర్గారావు శంకర్ రాజేశ్వరరావు రాజు, బాలయ్య, సారంగపాణి, రాజ్ కుమార్ మాధవి శీతల్ సునీత సందీప్ రహీం అహ్మద్ దేవేందర్రావు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వనదేవతల కీర్తి ప్రతిష్టతలను దెబ్బతీయడమే బిఆర్ఎస్ పార్టీ లక్ష్యం

- మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి

**ములుగు, ఫిబ్రవరి 3 మనం ప్రతినిధి :** మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల కీర్తి ప్రతిష్టలను దెబ్బతీయటమే బిఆర్ఎస్ పార్టీ లక్ష్యం అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహిళా జయరాంరెడ్డి అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర కీర్తి ప్రతిష్ట దెబ్బతినేలా టిఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మేడారంలో బాలికపై గ్యాంగ్ రేప్ అంటూ తప్పుడు ప్రచారం చేస్తూ జాతర ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇది తప్పుడు ప్రచారమని జిల్లా ఎస్పీ వివరణ ఇచ్చినప్పటికీ దాన్ని లెక్కచేయకుండా ఇలా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఎస్పీ వివరణ ప్రకారం దొంగతనం విషయంలో గొడవ జరిగితే పొరపాటున బాలికపై చేయి చేసుకోవడంతో అక్కడ స్థానికుల ద్వారా గొడవ సద్దుమణిగిందన్నారు. తప్పుడు ప్రచారాలతో మా చెల్లి జీవితాన్ని ఆగం చేయకూడదని కుటుంబ సభ్యులు సోషల్ మీడియాలో వివరిస్తున్నారు. మేడారం అభివృద్ధి చరిత్రలో నిలిచిపోయే విధంగా సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి సీతక్క చేస్తున్నందున ప్రశంసలు రావడంతో జీర్ణించుకోలేక కుట్రలు చేస్తున్నారు. సమ్మక్క సారలమ్మ వనదేవతల పై రాజకీయ తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

## మొప్పనపల్లి రోడ్డుకు మరమ్మత్తుల



**ములుగు,ఫిబ్రవరి 3 మనం ప్రతినిధి :** మండలంలో మొప్పనపల్లి గ్రామంలో నిర్వహించే దర్గా ఉరుసు ఉత్సవాలకు గ్రామంలోని రోడ్డు మరమ్మతులు చేపట్టారు. దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమం మొప్పనపల్లి గ్రామ ఉప సర్పంచ్ చిదరి సుమన్ సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది. ఉరుసు ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో, వారి సౌకర్యార్థం రోడ్డు మరమ్మతులు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సౌకర్యాల పట్ల నిరంతర శ్రద్ధ చూపుతున్న ఉప సర్పంచ్ చిదరి సుమన్ సేవలను గ్రామస్తులు, దర్గా కమిటీ సభ్యులు అభినందించారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ ఉరుసు ఉత్సవాలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించబడాలని గ్రామ పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన రాష్ట్ర గిరిజన బంజారా నాయకులు

**ములుగు, ఫిబ్రవరి 3 మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో రాష్ట్ర గిరిజన బంజారా నాయకులు పోరిక రాహుల్ నాయక్, బీసీ సెల్ యూత్ నాయకులు నాగరాజు కాంగ్రెస్లో చేరగా మంత్రి సీతక్క వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు పార్టీలో వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్,మాజీ జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ రియాజ్ మీర్జా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సమ్మయ్య, మైనారిటీ నాయకులు కుతుబుద్దీన్, యూత్ నాయకులు ప్రశాంత్,రాకేష్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం




**సంగారెడ్డి, ఫిబ్రవరి 3 (మనంప్రతినిధి):** అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా ప్రాంగణం, సంగారెడ్డిలో నీ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తున్న ప్రాణాంతక వ్యాధిగా మారిందని తెలిపారు. అయితే కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి సరైన వైద్య చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా మహిళలు , యువత ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు , అధ్యాపకులు కేన్సర్ వ్యాధి లక్షణాలు, కారణాలు, నివారణ చర్యలు ,ప్రారంభ దశలో గుర్తింపు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్రెస్ట్ కేన్సర్ , సర్వికల్ కేన్సర్ పై ప్రత్యేక అవగాహన కల్పించి, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే యువతలో పెరుగుతున్న మౌత్ కేన్సర్, లంగ్ కేన్సర్ వంటి వ్యాధులకు ధూమపానం మరియు పొగాకు వాడకం ప్రధాన కారణమని తెలిపారు. కేన్సర్ వ్యాధి నివారణలో ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం మరియు మానసిక ఒత్తిడి నియంత్రణ ఎంతో అవసరమని నిపుణులు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు మరియు చికిత్సా సౌకర్యాల గురించి కూడా విద్యార్థులకు వివరించారు. కేన్సర్ వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలు మరియు భయాలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు కేన్సర్ పై అవగాహన పెంపొందించేందుకు పోస్టర్లు , సమాచార పత్రాలు పంపిణీ చేయబడింది. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు మరియు సమాజానికి కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు కేన్సర్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, న్యాయ అవగాహన మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా కార్యదర్శి బి. సౌజన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కేన్సర్ వ్యాధిపై సమగ్ర అవగాహన పెంపొందించబడింది.

## అసత్య ప్రచారాలు చేస్తున్న తక్షణమే చర్యలు తీసుకోవాలి



- ములుగు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు

**ములుగు,ఫిబ్రవరి 3 మనం ప్రతినిధి :** ప్రింట్ పేపర్ లలో (న్యూస్ తెలంగాణ రిపోర్టర్ శంకర్, తెలంగాణా మరియు నమస్తే తెలంగాణ ) మేడారం జాతర వన దేవతలు అయినా సమ్మక్క - సారలమ్మ ల దర్శనం కోసం వచ్చిన ఒక కుటుంబంను బీఆర్ఎస్ పార్టీ స్వార్ధ రాజకీయల కోసం అమాయక మైనర్ బాలిక ను వివాదం లో తెచ్చి గ్యాంగ్ రేప్ అయ్యిందని సోషల్ మీడియా వేదికలలో కొన్ని ప్రింట్ మీడియా ఈ పేపర్ లలో ప్రచురించిన వార్తలలో ఏమాత్రం నిజం లేదని అటువంటి సంఘటన ఎక్కడ జరగలేదని తెలియజేస్తూ మైనర్ బాలిక తమ్ముడు స్వయంగా అక్కడ జరిగింది ఆ యొక్క కిరాణం షాప్ లో దొంగతనం జరిగిందని మా అక్క ను నిలబెట్టగా కొందరు తప్పుడు వార్తలు రాసి మమల్ని భాద్నామ్ చేస్తున్నారని అసత్య ప్రచారం చేసిన వారిపైన చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ఆ కుటుంబం వాపోయారు కొందరు నాయకులు వారి స్వార్థ రాజకీయలకోసం అమాయక కుటుంబాలను రోడ్డు కు లాక్కొని రావడం బాధాకరని అదేవిధంగా ఎస్పీ ఈ సంఘటన పై తగు విచారణ జరిపి నిందుతుల పట్ల తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ క్రరీ నాగేంద్రబాబు కోరారు.

## సింగరేణిలో తగ్గిన బొగ్గు ఉత్పత్తి

- పది మాసాల్లో గత ఏడాది కంటే తక్కువ
- ఇక మిగిలింది రెండు మాసాలు
- లక్ష్య సాధనకై యాజమాన్యం చర్యలు

**కాసిపేట, ఫిబ్రవరి 3(మనంన్యూస్):** సింగరేణి యాజమాన్యం ఈ పది మాసాల లో జరిగిన ఉత్పత్తి, గత ఏడాది సాధించిన బొగ్గు ఉత్పత్తి ని బేరీజు వేస్తె, గతం కంటే తక్కువ బొగ్గు వెలికితీసి వెనుకపడడం యాజమాన్యాన్ని, కార్మికులను ఆందోళనలకు గురించేస్తున్నది. ఈ గడ్డు పరిస్థితి అదిగమించెందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్టు కార్మికుల్లో చర్చ జరుగుతున్నది. 2025-26 ఉత్పత్తి ఏడాదికి కంపెనీ యాజమాన్యం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనే లక్షంగా పెట్టుకుంది. అయితే గత ఏడాది ఏప్రిల్ నుండి ఈ జనవరి మాసం చివరికి 48.93 మి ట బొగ్గు ఉత్పత్తిని తీసినట్టు సమాచారం. అయితే 2024 ఏప్రిల్ నుండి జనవరి 2025 కాలానికి 53.73 మి ట బొగ్గు వెలికి తీయడం గమనార్హం. పోయిన కాలానికంటే ఈ ఏడాది తక్కువ బొగ్గు ఉత్పత్తి తీయడం, యాజమాన్యాన్ని కొంత ఆందోళనకు గురిచేసే విషయంగా పలువురు అభివర్ణిస్తున్నారు. ఏప్రిల్ నుండి జనవరి నెలల కాలానికి 58.47 మె ట బొగ్గు ఉత్పత్తి తీయాల్సింది, కేవలం 48.93 మె ట లు అంటే 84 శాతం గా వుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే నిర్దేశించుకున్న లక్ష్యం సాధ్యం కష్టమే అంటున్నారు కార్మికులు.

**ఈ ఏడాది ప్రకటించని ప్రోత్సాహ బహుమతి**

ఏటా జనవరి నుండి మార్చి వరకు ఉత్పత్తి మాసాలుగా యాజమాన్యం పరిగణించి, కార్మికులకు నగదు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించడం ఆనవాయితీ గా వస్తున్నది. అయితే ఈ ఏడాది అలాంటిదేమి లేక పోవడం, అంతే కాకుండా వీకెండ్ సెలవు దినాల్లో ప్లేడే లు నడిపించే సంప్రదాయం ఉండేదని, వాటిని అమలు చేయక పోవడం కొంత నిరాశకు గురించేశాయని, ఉత్పత్తి లోటు కు అవి సైతం కారణాలుగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కార్పొరేట్ స్థాయి లో డైరెక్టర్ లు బదిలీ, నియామకాలు, పూర్తి స్థాయి లో ఖాళీల భర్తీ చేయక, పరిపాలన,క్షేత్రస్థాయి లో అధికారులు, కార్మికులను చైతన్యులను చేయడం లో వైఫల్యం ఇలా పలు అంశాలు బొగ్గు ఉత్పత్తి పై ప్రభావం చూపాయని కార్మికులు అంటున్నారు. యిదే సందర్భంలో ఫిబ్రవరి, మార్చ్ ఈ రెండు మాసాలున్న సమయం లో వార్షిక బొగ్గు ఉత్పత్తి 70 మి ట ల లక్ష్యం సాధించేందుకు అధికారులు చర్యలు తీసుకొంటరానే విశ్వాసంతో మెజార్టీ కార్మికులు వున్నారు.

## గజ్వేల్ బల్దియా ఎన్నికల బరిలో 88 మంది అభ్యర్థులు

- మూడు ప్రధాన పార్టీల్లోనూ రెబెల్స్ బెడద
- స్వతంత్రులు 16 మంది పోటీలో

**సిద్దిపేట, ఫిబ్రవరి 3(మనం ప్రతినిధి):** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల బరిలో 88 మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ లకు రెబల్స్ బెడద తప్పేట్లు లేదు. స్వతంత్రులు కూడా 16 మంది పోటీలో నిలవడం ప్రధాన పార్టీలతో పాటు మిగతా వారికి ఆందోళన కలిగించే అంశంగా మారింది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అన్ని వార్డుల్లో తమ అభ్యర్థులను పోటీలో నిలపగా, సిపిఐ 4, జనసేన 2, సిపిఎం, బిఎస్పి ఒక్కొక్క వార్డుల్లో పోటీలో ఉన్నారు. ఇతర పార్టీలు మరో 4 వార్డుల్లో పోటీలో నిలిచారు.

**కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు వీరే**

1వ వార్డులో కప్ప మహేష్ , 2 వ వార్డు సహనిజ్ సమీరా, 3 వ వార్డు జంగం రమేష్ గౌడ్, 4 వ వార్డ్ షరీఫ్ , 5 వార్డు సారిక శ్రీనివాస్ రెడ్డి, 6 వ వార్డు గాడి పల్లి నవ్య, 7 వ వార్డు విష్ణువర్ధన్ రెడ్డి, 8వ వార్డు జంగం రమేష్, 9వ వార్డు ఉపేందర్ రెడ్డి, 10 వ వార్డు జి స్వామి, 11వ వార్డు షరీన్ బేగం, 12వ వార్డు నరసింహారెడ్డి, 13 వ వార్డు ఆర్ సంతోష, 14వ వార్డు గుంటుకు లక్ష్మి, 15 వ వార్డు నక్క సంతోషి, 16వ వార్డు నాయిని సత్యలక్ష్మి, 17 వ వార్డు భారతమ్మ, 18 వ వార్డు సయ్యద్ మతిన్, 19వ వార్డు మున్వర్ అలీ, 20వ వార్డు కొండల్ రెడ్డి పేర్లను అధికారికంగా ప్రకటించారు.

**బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు**

1 వ వార్డు కప్ప మమత, 2 వ వార్డు గోలి మమత, 3 వ వార్డు మురళి, 4 వ వార్డు వరలక్ష్మి, 5 వ వార్డు రూప, 6 వ వార్డు బొగ్గుల స్వప్న, 7 వ వార్డు నేతి చిన్న సంతోష్ , 8 వ వార్డు గంగలోత్ శివకుమార్, 9వ వార్డు పెద్ది బాలకిషన్, 10 వ వార్డు కోట బాపురాజ్, 11 వ వార్డు కే భవాని,12 వ వార్డు ప్రతాపరెడ్డి, 13 వ వార్డు మరికంటి భాగ్యలక్ష్మి, 14 వ వార్డు గుంటుకు శిరీషరాజు, 15వ వార్డు పుల్ల మీనమ్మ బీరయ్య యాదవ్ , 16వ వార్డు అరిఫా బేగం, 17వ వార్డు కళ్యాణ్కర్ పద్మా బాయ్, 18 వ వార్డు మామిడి శ్రీధర్, 19వ వార్డు గంగిశెట్టి చందన రవీందర్, 20వ వార్డు వంటేరు గోపాల్ రెడ్డి లను ప్రకటించారు.

**బీజేపీ పార్టీ అభ్యర్థులు**

1 వ వార్డు నుండి మైస కనకమ్మ స్వామి, 2 వ వార్డు గాడి పల్లి కళ్యాణి భాస్కర్, 3 వ వార్డు కోట కిషోర్, 4 వ వార్డు రొట్టెల శ్రీనివాస్, 5 వ వార్డు సల్ల అన్నపూర్ణ, 6 వ వార్డు పేర్ల సిద్దేశ్వరి, 7 వ వార్డు మన్నెం శశిధర్ రెడ్డి, 8 వ వార్డు కే అంజనేయులు, 9వ వార్డు లింగంపల్లి హరికుమార్, 10వ వార్డు కొమ్ము చంద్రశేఖర్, 11వ వార్డు రత్నమ్మ ,12వ వార్డు దామరంచ దయాకర్ రెడ్డి, 13వ వార్డు పి కల్పన , 14వ వార్డు రేణుక, 15వ వార్డు జోడు మౌనిక 16వ వార్డు కే పుష్పలత,17వ వార్డు నాగులపల్లి కవిత, 18 వ వార్డు రామచంద్ర చారి , 19 వ వార్డు నాయిని సందీప్, 20 వార్డు ఉప్పల మధు లకు టికెట్లు దక్కాయి.

**బిఆర్ఎస్ మాజీలకు టికెట్లు**

బిఆర్ఎస్ పార్టీలో అత్యధికంగా మాజీ కౌన్సిలర్లకు మళ్లీ టికెట్లు దక్కాయి. మరికంటి వరలక్ష్మి, గుంటుకు శిరీష , మామిడి శ్రీధర్, వంటేరు గోపాల్ రెడ్డి, చందన లకు ఈసారి కూడా టికెట్లు ఇవ్వగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్ సి రాజమౌళి కుమారుడు ఎన్సీ సంతోష్ కు కూడా టికెట్ లభించింది. అత్తిలి శ్రీనివాస్, అరుణ భూపాల్ రెడ్డి లతోపాటు పలువురు టికెట్లు ఆశించి పొందలేకపోయారు. శ్రీనివాస్ రెబల్ గా పోటీలో నిలిచారు. బిజెపి నుండి కాశవైన సందీప్ కుమార్ కు టికెట్ లభించకపోవడంతో రెబల్ గా పోటీలో నిలిచారు. కాంగ్రెస్ లో కూడా రెబల్ బెడద ఉంది. రెబెల్స్, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉన్న ఆయా వార్డుల్లో గెలుపోవటములపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి.

# అప్పుడు అరాచకం.. ఇప్పుడు ఆరాటం!



## నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి.. ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తా

## ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి

ఖమ్మం, ఫిబ్రవరి 3(మనం బ్యూరో): 'అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా అరాచకంగా వ్యవహరించిన వారు... నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారు' అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో ఆయన పాల్గొని విపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. గత పాలకులు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేశారని, ఆనాడు అర్హులైన వారికి స్థలాలు ఇవ్వకుండా వంచించారని ఆయన మండిపడ్డారు.

**సొంతింటి కలను నెరవేరుస్తాం**

ఇళ్ల స్థలాలు ఇచ్చే మంత్రిని కూడా నేనేనని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించబోనని హామీ ఇచ్చారు.

**సంక్షేమ పథకాలతో పేదల చెంతకు..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి వివరించారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్గా తీర్చిదిద్దుతామని, వార్డుల్లో పెండింగ్లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను వేసవి లోపే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. తనను అసెంబ్లీ ఎన్నికల్లో దీవించినట్టే, ఏదులాపురం మున్సిపాలిటీ బరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు.

## పచ్చని చెట్లపై గొడ్డలి వేటు కథనంపై కదిలిన అధికార యంత్రాంగం




- 22,000 విలువగల టేకు కర్రలను స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ
- హెచ్ఎం తీరుపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించిన ఏటీడీవో రమేష్

కారేపల్లి, ఫిబ్రవరి 03(మనం న్యూస్): ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని గేటు కారేపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో పాల్పడిన అక్రమ టేకు చెట్ల నరికివేతపై మనం దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలపై అధికారులు స్పందించారు.అటవీ అధికారులు కర్రలను స్వాధీనం చేసుకోగా,గిరిజన సంక్షేమ శాఖ అధికారి విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు.కారేపల్లి రేంజ్,తాళ్లగూడెం రేంజ్ అటవీ శాఖ అధికారులు మంగళవారం పాఠశాలను సందర్శించి అక్రమంగా నరికివేసిన సుమారు 30 వేల విలువ చేయగల టేకు కర్రలను స్వాధీనం చేసుకొని కారేపల్లి రేంజ్ కార్యాలయానికి తరలించారు.అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ ఏటీడీవో రమేష్ ఆశ్రమ పాఠశాలకు చేరుకుని నరికి వేసిన టేకు చెట్లను గుర్తించి జరిగిన విషయాన్ని ఖమ్మం డిడి విజయలక్ష్మి కు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఈ అక్రమ నరికివేత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వ నిబంధనలను తుంగలో త్రొక్కిన హెడ్ మాస్టర్ వెంకట రమణ,వార్డెన్ ఇస్లావత్ హచ్యపై ఎలాంటి శాఖ పరమైన చర్యలు తీసుకుంటారు అనేది వేచి చూడాలి.



## 5న ఉపాధ్యాయ సంఘాల ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మం, ఫిబ్రవరి 3(మనం న్యూస్): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐజెసిటిఓ ఆల్ ఇండియా జాక్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దేశంలోని ఉపాధ్యాయ సంఘాలు చేయనున్న ధర్నా వాల్పోస్టర్ను మంగళవారం ఆవిష్కరించారు. ఖమ్మంలోని పిఆర్టియు కార్యాలయంలో ఈ పోస్టర్ను ఏఐఎఫ్టిఓ జాతీయ ఉపాధ్యక్షులు చిత్తలూరు ప్రసాద్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు, మాజీ అధ్యక్షులు వై వి, నాయకులు రాయల నరసింహారావు, తాళ్లూరు చంద్రశేఖర్, లింగం సతీష్, గుర్రం కేశవరావు, రమణ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బోణి

## ఏదులాపురం మున్సిపాలిటీలో 14వ వార్డు ఏకగ్రీవం

### సిపిఎం, బిజెపి అభ్యర్థుల ఉపసంహరణ





ఖమ్మం, ఫిబ్రవరి 3(మనం బ్యూరో): మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బోణీ కొట్టింది. ఏదులాపురం మున్సిపాలిటీలోని తెల్దారుపల్లి గ్రామంలోని 14 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్వర్గీయ తమ్మినేని కృష్ణయ్య సతీమణి తమ్మినేని మంగతాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెపై నామినేషన్లు వేసిన సిపిఎం అభ్యర్థి తమ్మినేని విజయలక్ష్మి, బీజేపీ అభ్యర్థి గజ్జి రజిత తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో తమ్మినేని మంగతాయి ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

**కాంగ్రెస్ కార్యకర్తల్లో కోలాహలం**

మంగతాయి ఎన్నిక ఏకగ్రీవం కానుండడంతో తెల్దారుపల్లిలోని ఆమె ఇంటి వద్ద సందడి వాతావరణం నెలకుంది. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్వీట్లు పంచుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మంగతాయి మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆశీస్సులతో తెల్దారుపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. తెల్దారుపల్లి గ్రామంలో మిగతా రెండు వార్డులను భారీ మెజారిటీతో గెలిపించి తమ్మినేని కృష్ణయ్యకు అంకితం చేస్తామని తెలిపారు.

తన విజయానికి అన్ని విధాలా సహకరించిన తెల్దారుపల్లి గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేసారు.



## అభ్యర్థుల చేతికి 'బీ-ఫామ్'.. ప్రచారానికి 'శ్రీకారం'!

- ఏదులాపురం మున్సిపల్ పోరులో 'హస్తం' దూకుడు
- బీ-ఫామ్లు అందజేసి... అభ్యర్థులకు దిశానిర్దేశం చేసిన మంత్రి పొంగులేటి

ఖమ్మం, ఫిబ్రవరి 3(మనం బ్యూరో): ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ పార్టీ కీలక ఘట్టాన్ని పూర్తి చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం అభ్యర్థుల చేతికి ₹బీ-ఫామ్₹ లు అందజేశారు. దీంతో మున్సిపల్ కోటపై 'హస్తం' జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రచార పర్వం ఊపందుకుంది.

**గెలుపే లక్ష్యంగా గడప గడపకూ..**

బీ-ఫామ్లు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికారులకు నామినేషన్లు సమర్పించాలని మంత్రి సూచించారు. 'అధికారికంగా బీ-ఫామ్లు అందాయి.. ప్రభుత్వ ప్రజారంజక పాలనను, అమలు చేస్తున్న గ్యారంటీలను వివరించి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

**క్లీన్ స్వీప్ టార్గెట్!**

వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఏదులాపురంలోని అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంత్రి చేతుల మీదుగా బీ-ఫామ్లు అందుకున్న అభ్యర్థులు రెట్టింపు ఉత్సాహంతో ప్రచార క్షేత్రంలోకి అడుగుపెట్టారు.

# విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్లో సీసీ కెమెరాలు

## ప్రారంభించిన కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ



చుంచుపల్లి, ఫిబ్రవరి 3(మనం న్యూస్): పట్టణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కొత్తగూడెం డీఎస్పీ ఎల్. ఆదినారాయణ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడగా, పోలీస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు మరియు వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వరావు, వన్ టౌన్ సీఐ కరుణాకర్, 3 టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, 2 టౌన్ సీఐ ప్రతాప్, చుంచుపల్లి ఎస్హెచ్ఓ రవి కుమార్, ఎస్సై ఉమా, కానిస్టేబుల్స్ రవి, పూజారి రమేష్ బాబు పాల్గొన్నారు. అలాగే ఎంఎస్ పాన్ మహల్ ప్రొప్రైటర్ గులాం మతీన్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేర నియంత్రణలో కీలక మార్పులు వస్తాయని తెలిపారు. ప్రమాదాలు లేదా ఇతర నేర సంఘటనలు జరిగిన వెంటనే నేరస్తులను గుర్తించి పట్టుకోవడం సులభమవుతుందని అన్నారు. సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలు మరియు ఇతర నేరాలు తగ్గే అవకాశముందని వివరించారు. పట్టణ భద్రత కోసం ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే సమాచారం అందించాలని డీఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ, భద్రతా చర్యలు మరింత పెరగాలని కోరుకున్నారు.

# ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- అభ్యరుల గుర్తుల కేటాయింపు ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్




ఖమ్మం, ఫిబ్రవరి 3(మనం న్యూస్): ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వైరా తహసీల్దారు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన వైరా మున్సిపాలిటీ వార్డు అభ్యర్థుల బీ-పామ్ పరిశీలన, స్వతంత్ర అభ్యర్థుల ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ ప్రతాలు, బీ-ఫామ్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర ఎన్నికలకు కేటాయించిన అధికారులందరు సమన్వయంతో పని చేయాలన్నారు. బీ-ఫామ్ లేని అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులు గా ప్రకటన, గుర్తుల కేటాయింపు పారదర్శకంగా కేటాయించాలని సూచించారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో వైరా తహసీల్దారు సురేష్ బాబు, మున్సిపల్ కమీషనర్ గురులింగం, ఎంపీడీవో తేజావత్ సక్రియ, ఎంఈఓ వెంకటేశ్వర్లు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అసెంబ్లీ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు



లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 03 (మనం న్యూస్): కొత్తగూడెం నియోజకవర్గం స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం స్థానిక ప్రకాష్ స్టేడియం గ్రౌండ్లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ సీఈఓ, జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, డివైఎస్ఓ పరంధామ రెడ్డి హాజరయ్యారు. లక్ష్మీదేవిపల్లి ఎంఈఓ కృష్ణయ్య, చుంచుపల్లి ఎంఈఓ బాలాజీ, సుజాతనగర్ ఎంఈఓ లీల, కొత్తగూడెం ఎంఈఓ మధురవాణి, వివిధ క్లస్టర్ ఇన్చార్జీలు పాల్గొన్నారు. సెక్రటరీ నరేష్, ఆఫీస్ సిబ్బంది పులి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలను సక్రమంగా నిర్వహించారు. మంగళవారం ప్రకాశం స్టేడియం గ్రౌండ్ నందు మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు అసెంబ్లీ స్థాయిలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి (డిస్ట్రిక్ట్ లెవల్) క్రీడా పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు.



# ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం పెరిగేలా ఎఫ్రీ చైల్ రీడ్స్ అమలు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి
- పాలడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తనిఖీ
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్

వైరా, ఫిబ్రవరి 3(మనం న్యూస్): పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం మెరుగుపర్చి, రీడింగ్ స్కిల్స్ పెంపొందేలాగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. వైరా మండలం పాలడుగు గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో నిర్వహిస్తున్న ఎఫ్రీ చైల్ రీడ్స్ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను తిరుగుతూ విద్యా భోదనను పరిశీలించారు. మూడవ, నాలుగు తరగతి గదులలో విద్యార్థులను ప్రత్యేకంగా అందించిన రైమ్స్ ఎలావున్నాయి, అని అడిగారు. బోర్డు పై ఇంగ్లీషు అక్షరాలు, పదాలు, పద్యాలు వ్రాసి వాటియొక్క ఉచ్చారణ, అర్థం చేసుకుంటూ, తిరిగి చెప్పగలుగుతున్నారా, ధ్వనులను బట్టి ఇంగ్లీష్ పదాలను గుర్తిస్తున్నారా అని అడిగి విద్యార్థుల సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని కిచెన్ లో వండిన అన్నం, కూరలను కలెక్టర్ పరిశీలించారు. భోజనంలో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. పాఠశాల పిల్లలతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం మంచిగా ఉంటుందా, కోడిగుడ్డు మెనూ ప్రకారం పెడ్డుతున్నారా, కూరలు రుచిగా ఉంటున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల చదివే సామర్థ్యం పెంపు చేయడం కోసం చేపట్టిన ఎఫ్రీ చైల్ రీడ్స్ అమలుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బోధన అందించాలని సూచించారు. ప్రతి రోజు విద్యార్థి గంట సేపు చదివే సామర్థ్యంపై అభ్యాసన చేసేలా సాంకేతిక పరిజ్ఞానంతో ఒక బుక్ లెట్ తయారు చేయడం జరిగిందని అన్నారు. బుక్లెట్ లో ఉన్న అంశాలను తూ.చ. తప్పకుండా ఉపాధ్యాయులు ఫాలో అవుతూ పిల్లలు చదివే సామర్థ్యం పెంపొందేలా కృషి చేయాలని అన్నారు. మధ్యాహ్నం భోజనంలో సన్నబియ్యం వాడాలని, వంటకాల కోసం గ్యాస్ సిలిండర్ లను ఉపయోగించాలని, ప్రభుత్వ మెను ప్రకారం రోజువారి వంటకాలు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు .అనంతరం అంగన్వాడీ కేంద్రంను కలెక్టర్ సందర్శించారు. చిన్న పిల్లలకు అందించే కోడిగుడ్డు, పోషక ఆహారం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైరా తహసీల్దార్ సురేషు బాబు, మండల విద్యా అధికారి కె. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దయాకర్ రావు, రమేష్, శ్రీదేవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తున్నాం



- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి
- బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం.
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు.

సుల్తానాబాద్ ఫిబ్రవరి 03 (మనం న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు తో పాటు సుల్తానాబాద్ మున్సిపల్ ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని 2వ, 3వ వార్డులలో ఆయన మంగళవారం సాయంత్రం ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. అనంతరం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ, సుల్తానాబాద్ పట్టణం నిరంతర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. ఇప్పటికే సుల్తానాబాద్ పట్టణాన్ని 2 సంవత్సరాల కాలంలో 20 కోట్లతో అభివృద్ధి చేశామని, మరిన్ని అభివృద్ధి పనులకు రూ .15 కోట్లు టెండర్లు పిలిచి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. పెద్ద చెరువును 8 కోట్ల 50 లక్షలతో మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేస్తామని, ఐబి పాత భవనాన్ని కూల్చివేసి 4కోట్లతో నూతన గెస్ట్ హౌస్ భవనాన్ని నిర్మాణం చేస్తామని, కొత్త మున్సిపల్ ఆఫీస్ భవనాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. తెలంగాణ చౌరస్తా నుండి గట్టపల్లి క్రాసింగ్ వరకు 7 కోట్ల 50 లక్షలు తో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.సుల్తానాబాద్ పట్టణంలో దాదాపు 220 కి పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిరుపేదలను ఆదుకున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలు తమ పనితీరును, అభివృద్ధి పనులను చూసి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటం ప్రభుత్వ కర్తవ్యం

- శ్రీవారి ప్రసాదం నెయ్యి కల్తీని తీవ్రంగా పరిగణిస్తూ దోషులపై కఠిన చర్యలు
- స్వల్పకాలిక పరిపాలనా కమిటీని ఏర్పాటు చేసి ఈ అంశాన్ని సమగ్రంగా సమీక్షిస్తాం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి, ఫిబ్రవరి 3(మనంప్రతినిధి):** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు కొలువైవున్న తిరుమల తిరుపతి దేస్థానం పవిత్రతను కాపాడటం ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం అని, శ్రీవారి ప్రసాదం నెయ్యి కల్తీని తీవ్రంగా పరిగణిస్తూ దోషులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని సమగ్రంగా సమీక్షించి సత్వరమే తుది నివేదికను ప్రభుత్వానికిని సమర్పించేందుకు స్వల్పకాలిక పరిపాలనా కమిటీని ప్రభుత్వం నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్ మరియు సత్యకుమార్ యాదవ్ తో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ నేడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో అజండా అంశాలను ప్రక్కనబెట్టి మరీ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) లడ్డు ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యిలో జరిగిన కల్తీలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (ఖిఐఖీ) సమర్పించిన నివేదికను సమగ్రంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ నివేదిక, భారత సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ పర్యవేక్షణలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా సమర్పించబడినదన్నారు. సిట్ నుండి ప్రభుత్వానికి రెండు పత్రాలు అందాయని, వాటిలో ఒకటి ఇప్పటికే కోర్టులో దాఖలు చేయబడిన చార్జ్ షీట్, మరొకటి ప్రభుత్వానికి ప్రత్యేకంగా పంపిన 11 పేజీల గోప్య నివేదిక అని తెలిపారు. కోర్టు చార్జ్ షీట్ను అధికారికంగా కాగ్నిజెన్సు లోకి తీసుకున్న తర్వాతనే అది ప్రభుత్వానికి మరియు సంబంధిత కక్షిదారులకు అందుబాటులోకి రానుందన్నారు. క్యాబినెట్ ముందు ఈ నివేదికను ఉంచి, అందులో పేర్కొన్న ప్రధాన అంశాలు మరియు తేలిన లోపాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగిందన్నారు. ప్రభుత్వానికి అందిన నివేదిక ప్రకారం, నెయ్యి సరఫరా, టెండర్ నిబంధనల సడలింపు, నాణ్యత లోపాలు మరియు తప్పుడు పత్రాల సమర్పణ వంటి తీవ్రమైన అవకతవకలు చోటుచేసుకున్నట్లు తేలిందన్నారు. సిట్ నివేదిక ప్రకారం, 2019 తర్వాత టిటిడి నెయ్యి కొనుగోలు విధానంలో అనవసరమైన సడలింపులు చేయడం ద్వారా నాణ్యతకు విరుద్ధమైన సరఫరాలు జరగడానికి అవకాశం కల్పించబడిందన్నారు. టెండర్ నిబంధనల్లో రూ.250 కోట్ల టర్నోవర్ షరతును రూ.150 కోట్లకు తగ్గించడం, కనీస పాల ప్రొక్యూర్మెంట్ అనుభవం లేకున్నా అర్హత కల్పించడం వంటి చర్యలు ఉద్దేశపూర్వకంగా చేపట్టబడ్డాయని నివేదిక స్పష్టం చేసిందన్నారు. తిరుమల నెయ్యి కల్తీపై క్యాబినెట్ లో సుదీర్ఘ చర్చ.మంత్రి కొలుసు పార్థసారథి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి అధ్యక్షతన నేడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో, ముందుగా నిర్ణయించబడిన అజెండా అంశాలన్నింటినీ పక్కన పెట్టి, కోట్లాది మంది హిందువుల మనోభావాలను గౌరవిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో చోటుచేసుకున్న నెయ్యి కల్తీ ఘటనపై సిబిఐ సమర్పించిన నివేదికను ముఖ్యమంత్రి గారు సమావేశంలో ఉంచి, దాని పై సుమారు మూడు గంటలపాటు చర్చ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి పవిత్రతను కాపాడటం, హిందూ భక్తుల విశ్వాసాన్ని రక్షించటం ప్రభుత్వ ధర్మమని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారన్నారు. సిబిఐ నివేదికలో పేర్కొన్న అంశాలపై ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చ జరగగా, గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారుతో సహా మంత్రులు అందరూ తమ తమ అభిప్రాయాలను వివరించారన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు మరియు దోషులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని క్యాబినెట్ ఏకగ్రీవంగా అంగీకరించిందని మంత్రి

రాజకీయ కోణంలో వక్రీకరించే ప్రయత్నాలను నిరసిస్తున్నాం.మంత్రి నాదెండ్ల మనోహర్ తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతకు భంగం కలిగించిన నెయ్యి కల్తీ వ్యవహారంపై విస్తృత చర్చ నేటి క్యాబినెట్ సమావేశంలో జరిగిందని రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారితో సహా మంత్రులందరూ భక్తుల మనోభావాలను కాపాడే దిశగా స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారన్నారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో వక్రీకరించే ప్రయత్నాలను నిరసిస్తూ, ప్రజలకు వాస్తవాలను పారదర్శకంగా తెలియజేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి గౌరవ అడ్వకేట్ జనరల్ గారిని ఆహ్వానించి చట్టపరమైన సలహాలు పొందడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి గారు భక్తుల విశ్వాసం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరించాలనే దృఢసంకల్పాన్ని వ్యక్తం చేశారన్నారు. గత ప్రభుత్వ కాలంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంశాలను బయటపెట్టి, ప్రస్తుతం ప్రభుత్వం నెయ్యి నాణ్యతపై పలు మార్లు ల్యాబ్ టెస్టులు నిర్వహిస్తూ పారదర్శకతతో చర్యలు తీసుకుంటోందని వివరించారు. భవిష్యత్తులో ఎవరు తప్పు చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని, శ్రీవారి పవిత్రతను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని క్యాబినెట్ ఏకాభిప్రాయంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. సృష్టికి విరుద్ధంగా పాలు లేకుండా నెయ్యిని తయారు చేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ తిరుమల తిరుపతి దేవస్థానం కల్తీ నెయ్యి విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వ పాలకులు వ్యవహరించారని, రూ.250 కోట్ల అవినీతి కుంభకోణంతో పాటు పవిత్రతను నాశనం చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో 2022లో సిఎఫ్టిఆర్ఐ ఇచ్చిన హెచ్చరికలను దాచిపెట్టి, టెండర్ నిబంధనల్లో ఉద్దేశపూర్వక సడలింపులు చేసి తెలియని సంస్థలకు అనుకూలం కల్పించారన్నారు. సృష్టికి విరుద్ధంగా అసలు పాలే లేకుండా రసాయనాలను ఉపయోగించి తయారు చేసిన నెయ్యిని ఉపయోగించడం ద్వారా భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆలయ పవిత్రతను దెబ్బతీసిన చర్యలు, అన్యమత ప్రచారం, డిక్లరేషన్ నిబంధనల ఉల్లంఘన, బ్రహ్మోత్సవాల సంప్రదాయాల పట్ల నిర్లక్ష్యం వంటి అంశాలు గత పాలనలో చోటుచేసుకున్నాయన్నారు. ప్రస్తుతం సిబిఐ ఇచ్చిన 11 పేజీల నివేదికపై విస్తృత చర్చ జరగగా, ఎవరు ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా దోషులను ఉపేక్షించకూడదని క్యాబినెట్ ఏకగ్రీవంగా నిర్ణయంతీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు.

# చిన్న, మధ్యతరహా వ్యాపారాల కోసం భారత్లో తొలి వాయిస్-ఆధారిత బిల్లింగ్

- ఏఐ ఏజెంట్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 'పిల్లో ఏఐ' ఆవిష్కరణ
- వాయిస్ కమాండ్ ద్వారా మొదటి ఇన్వాయిస్ను రూపొందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**విశాఖపట్నం, ఫిబ్రవరి 3 ( మనం న్యూస్)** ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చిన్న మరియు మధ్యతరహా వ్యాపార యజమానులకు శక్తినిచ్చే తదుపరి తరం వాయిస్-ఆధారిత బిల్లింగ్ మరియు అకౌంటింగ్ ఏఐ ఏజెంట్ పిల్లో ఏఐ ను ఈ రోజు అధికారికంగా ప్రారంభించారు. ఈ చారిత్రక ఆవిష్కరణ, స్థానిక వ్యాపారులు మరియు చిన్న మరియు మధ్య తరహా వ్యాపారాలకు అత్యాధునిక కృత్రిమ మేధస్సు పరిష్కారాలను చేరువ చేసే దిశగా ఒక కీలక ముందడుగుగా నిలుస్తుంది. ఈ ఆవిష్కరణ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సిఎస్ విజయానంద్ (ఐఅఖీ), మాజీ మంత్రి మరియు ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు, ముత్తవరపు సురేష్, రామ్ మోహన్, పిల్లో ఏఐ సహ-వ్యవస్థాపకుడు, అలాగే పిల్లో ఏఐ పెట్టుబడిదారులు హాజరయ్యారు. పిల్లో ఏఐ ద్వారా వ్యాపార యజమానులు తమ స్వంత మాతృభాషలో మాట్లాడటం ద్వారా బిల్లులు తయారు చేయడం, లావాదేవీలు నమోదు చేయడం, నివేదికలు పొందడం మరియు ఖాతాలను నిర్వహించడం చేయగలరు. అకౌంటింగ్ ప్రత్యేక పరిజ్ఞానం లేకుండా లేదా క్లిష్టమైన సాఫ్ట్వేర్ అవసరం లేకుండా రూపొందించబడిన ఈ యాప్, సమయం ఆదా చేయడంతో పాటు శ్రమను తగ్గించేందుకు ఉద్దేశించబడింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,పిల్లో ఏఐ రోజువారీ వ్యాపార ప్రక్రియలను సులభతరం చేయడంలో సాంకేతికత ఎలా ఉపయోగపడుతుందో చూపించే ఉత్తమ ఉదాహరణ. ఇలాంటి సాధనాలు చిన్న వ్యాపారాలు మరియు తమ ఆర్థిక వ్యవహారాలను సులభంగా నిర్వహించేందుకు, పారదర్శకతను పెంచేందుకు మరియు డిజిటల్ వృద్ధి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్పై ఆంధ్రప్రదేశ్ దృష్టిని బలపరచేందుకు తోడ్పడతాయి, అని అన్నారు. కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి గారు స్వయంగా పిల్లో ఏఐ లో మొదటి ఇన్వాయిస్ను వాయిస్ కమాండ్ ద్వారా రూపొందించి, సహజ భాషలో సంభాషణలు ఎలా తక్షణమే వాస్తవ వ్యాపార చర్యలుగా మారుతాయో ప్రదర్శించారు.

# ప్రజల ప్రాణాలే ప్రథమం ఆచంటలో దోమలపై నిరంతర పోరాటం

- పంచాయతీ అభివృద్ధి అధికారి జీవీఎస్ఎల్ నరసింహారావు



**ఆచంట ఫిబ్రవరి 3 మనం న్యూస్ :** ఆచంట గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నపేట, పెద్దపేట ప్రాంతాల్లో దోమల బెడదను నియంత్రించేందుకు పంచాయతీ అభివృద్ధి అధికారి జి.వి.ఎస్.ఎల్. నరసింహారావు (నాగబాబు) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు విస్తృత స్థాయిలో దోమల మందు పిచికారీ చేపడుతున్నారు. డ్రైన్లు, నిల్వ నీరు ఉన్న ప్రాంతాలు, ఇళ్ల పరిసరాల్లో ఏబ్యాట్ మందును మలాథిన్తో కలిపి వినియోగిస్తూ దోమల ఉత్పత్తి మూలాలనే లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమం కొనసాగుతోంది.దోమల కాటు - ప్రాణాంతక వ్యాధులకు ద్వారం దోమలు కుడితే డెంగీ, మలేరియా, చికెన్గున్యా, ఫైలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పంచాయతీ అభివృద్ధి అధికారి జి.వి.ఎస్.ఎల్. నరసింహారావు తెలిపారు.అటువంటి వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగానే దోమల మందు పిచికారీ చేపడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే గ్రామపంచాయతీ బాధ్యత అని, నిర్లక్ష్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వబోమని ఆయన పేర్కొన్నారు. చేతల్లో పని కనిపిస్తేనే పాలన - ప్రజారోగ్యంపై స్పష్టమైన వైఖరి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణ విషయంలో కేవలం హెచ్చరికలు కాదు, క్షేత్రస్థాయిలో పని చేసి చూపించడమే పరిపాలన అనే విధానాన్ని ఆచంట గ్రామపంచాయతీ అనుసరిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని తన బాధ్యతగా భావిస్తూ, పంచాయతీ కార్మికులను సమన్వయపరచి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్న పీడీఓ నరసింహారావు (నాగబాబు) చర్యలు గ్రామంలో ఆరోగ్య భద్రతకు భరోసాగా మారుతున్నాయని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.



# మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

- న్యాయమూర్తి ఎ. వాసంతి

**నరసాపురం, ఫిబ్రవరి 3 (మనం న్యూస్):** రానున్న మార్చి 14వ తేదీన నరసాపురం పట్టణంలోని అన్ని కోర్టు సముదాయాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నరసాపురం 10వ అధనపు జిల్లా జడ్జి, చైర్ పర్సన్ ఎ . వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో ఆయా కోర్టుల పరిధిలో ఉన్న రాజీపడతగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, భూ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్ట పరిహార కేసులు రాజీ చేసుకోవచ్చని ప్రతి రోజు కోర్టు సముదాయంలో జరుగుచున్న మధ్యవర్తిత్వం ద్వారా కూడా కక్షిదారులు తమ కేసులు రాజీ చేసుకొనే వెసులుబాటు ఉందని ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొనుటకు వారి వారి న్యాయవాదుల ద్వారా గాని సంభందిత పోలీసులను లేదా కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను గానీ సంప్రదించాలని న్యాయమూర్తి తెలిపారు. బ్యాంక్, బి.ఎస్.ఎన్.ఎల్ కు సంభందించిన లావాదేవీలు ప్రి లిటిగేషన్ కేసుల క్రింద సెటిల్ చేసుకో వచ్చని వర్చువల్ గా కూడా కేసులు రాజీ చేసుకొనే వెసులుబాటును ఉన్నత న్యాయస్థానాలు కల్పించినట్లు న్యాయమూర్తి వాసంతి తెలిపారు.



# ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

**నరసాపురం, ఫిబ్రవరి 3 (మనం న్యూస్):** ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్ల పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ఉపా ధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ కోరారు. మంగళ వారం నరసాపురం మండలం ఎల్ బి చర్ల పీహెచ్సీ వద్ద ఆశ వర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సత్య నారాయణ మాట్లాడుతూ కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే ఉర్కోడ్స్ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను పరిరక్షించాలని ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని చట్టబద్ధమైన సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలన్నారు. గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్నారని ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి కార్మికులుగా గుర్తించాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, సమాన వేతనం, సౌకర్యాలు కల్పించాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. అనంతరం డాక్టర్ ఎం. మాధురికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పులపర్తి రత్నకుమారి, షేక్ నసీమా బేగం, మేకా విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# మంచు కొండలా కరుగుతున్న 'గుండాల' ఇసుక గుట్టలు

- అక్రమ ఆధార్ లతో అడ్డగోలుగా బుకింగ్
- అర్ధరాత్రి చీకటి మాటున తెలంగాణ కు తరలింపు
- పేదింటి కలను కబళిస్తున్న ఇసుక మాఫియా!
- అధికారుల నిర్వాకం తో కూటమి కి చెడ్డపేరు
- ఆధార్ తో ఆన్ లైన్ నిజమైన లబ్ధిదారులేనా?






**చింతూరు,ఫిబ్రవరి 2( మనం న్యూస్):** గత వైసీపీ ప్రభుత్వంలో అమలైన ఇసుక విధానంతో లక్షలాది పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. ఆ బాధను స్వయంగా గమనించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల ఇల్లు కట్టుకునే కల నెరవేర్చాలనే లక్ష్యంతో ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చారు.

### భారమని తెలిసినా ఉచితం

లోటు బడ్జెట్లో ఉన్నా సరే ప్రభుత్వానికి భారం అవుతుందన్న విషయం తెలిసినా సరే పేదవాడి ఇంటి కల నిజమవ్వాలని అన్న విజనరీ ఆలోచనతో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను అందించే నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికి రాష్ట్ర ప్రజలే కాదు ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేశారు. కానీ ప్రభుత్వం ఉద్దేశం ఒకటైతే జరుగుతున్న వాస్తవం మాత్రం మరొకటిగా మారింది. ఆంధ్ర,తెలంగాణ సరిహద్దులో ఇసుక మాఫియా రాజ్యం మేలటం దానికి పెద్ద అడ్డుకట్టగా మారింది. ఆంధ్ర,తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన గుండాల ప్రాంతంలో పేదలకు ఇసుక అందించాలనే ఉద్దేశంతో ఇసుక గుట్టలుగా నిల్వ చేసి, ప్రజల చేత ప్రజా పంపిణీ చేయాలని సొసైటీల ద్వారా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో స్థానిక సొసైటీలను ప్రోత్సహించి, వారి ద్వారా లబ్ధిదారులకు ప్రతి ఇంటికి ఉచిత ఇసుక చేరాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.అయితే ఈ వ్యవస్థలోకి ఇసుక మాఫియా చొరబడింది.ధనబలంతో,దౌర్జన్యంతో భయపెట్టి కొన్ని సొసైటీలను తమకు అనుకూలంగా మలుచుకున్నారనే ఆరోపణలు ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారుతోంది.

### రెవెన్యూ - పోలీసు - సొసైటీ మూడు వ్యవస్థలూ నిర్వీర్యమా?

నిజానికి ఇసుక పంపిణీపై పర్యవేక్షణ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరగాలి. కానీ అదే శాఖ కూడా మాఫియా ఒత్తిడికి తలవంచిన పరిస్థితి ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసు వ్యవస్థ కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు ఈ ప్రాంతంలో జగమెరిగిన సత్యం.లబ్ధిదారులు ఆధార్ కార్డు ద్వారా మాత్రమే ఇసుక తీసుకోవాల్సి ఉండగా ఈ మాఫియా మాత్రం బయోమెట్రిక్ విధానం లేకపోవడం వల్ల తెలియని ఆధార్ కార్డులతో ఆన్లైన్ చేసి రాత్రికి రాత్రే ఇసుకను లారీల్లో లోడ్ చేసి కొద్దీ దూరంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం లోని భద్రాచలంకు తరలిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

### పేదలకు 15% కూడా దక్కని ఇసుక

ప్రభుత్వం ఇచ్చే ఇసుకలో 15 శాతం కూడా స్థానిక పేదలకు అందడం లేదన్నది అత్యంత ఆందోళన కలిగించే అంశం.

దీంతో ఈ ప్రాంతం ఇసుక ద్వారా లబ్ధి పొందడం పోయి భారీగా నష్టపోతోంది. ప్రతిసారీ వరదలు వచ్చినప్పుడు సారవంతమైన భూమి కొట్టుకుపోవడం వల్ల నదులు లో ఇసుకగా మారి సారవంతమైన భూములు సౌడు నేలలగా క్రమంగా మారిపోతున్నాయి. ఇసుక పంపిణీలో పారదర్శకత ఉందా? బయోమెట్రిక్ ,సీసీ కెమెరాలు లేకపోవడం ఇటువంటి లోటుపోటులను ఆసరాగా భారీ వాహనాలలో ఇసుకను నింపి అర్ధరాత్రి తోలకాలతో కోట్లు సంపాదిస్తూ పేదవాడికి అవసరమైన చిన్న ట్రాక్టర్లకు లోడింగ్ చేయకుండా ఇబ్బందులు గురి చేయడమే కాక కూటమి ప్రభుత్వం యొక్క పేదవాడి ఆశలకు గండి కొడుతున్న ఆ లోడింగ్ వ్యవస్థను తీసివేయాలని పలువురు కోరుకుంటున్నారు.

అంతేకాదు ఆ చుట్టుపక్కల గ్రామాలలో అర్ధరాత్రి వాహనాలు పెద్ద శబ్దాలతో వెళ్లిపోతుంటాయి ఆ ప్రాంతంలో ప్రజలు నిద్రకు నోచుకోని రాత్రులు ఎన్నో ఇలా పక్క రాష్ట్రాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నా ప్రజలు నోరు మెదపలేని పరిస్థితి. మాఫియా ఆగడాలకు భయపడి గ్రామీణులు మౌనంగా ఉండిపోతున్నారు.

### ప్రభుత్వం విచారణకు కమిటీ వేయగలరా?

ఒక్కసారి నిజమైన ఎంక్వయిరీ చేస్తే మాఫియా బండారం బయటపడుతుంది లబ్ధిదారి ఇంటి వద్ద నిజంగా ఇసుక ఉందా? ఇంటి నిర్మాణం జరుగుతోందా? లేదా పేరుకే లబ్ధిదారులా? ఈ అంశాలపై ఒక్కసారి సమగ్ర విచారణ జరిపితే ఇసుక మాఫియా, వారికి సహకరిస్తున్న వ్యవస్థలు అన్నీ బహిర్గతం అవుతాయన్నది స్థానికుల అభిప్రాయం. బీజేపీ ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు పాయం వెంకయ్య డిమాండ్ ఈ అంశంపై బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు పాయం వెంకయ్య స్పందిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ అభినందనీయం. కానీ గుండాల ప్రాంతంలో ఆ ఇసుక పేదలకు కాకుండా బడా బాబుల చేతుల్లోకి వెళ్తోంది అనేది ఆరోపణ కాదు నిజమని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు నిజా నిజాలు ప్రభుత్వ యంత్రాంగమే తేల్చాలి లబ్ధిదారుల ఇంట్లో ఆ ఇసుక ఉందా వినియోగం అయ్యిందా లేదా పక్కదారి పట్టిందా అని నిజ నిర్ధారణ కమిటీ వేయాలని కోరుతున్నాను ప్రభుత్వానికి నా విన్నపం ఇదే కోటమే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరుగుతుంది ఆ ఉద్దేశంతోటే ఈ కుటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తుంది. దీంట్లో ఎవరైనా ప్రభుత్వాన్ని అబసపాలు చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోం అంటూ ఘాటుగా స్పందిస్తూ వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే ఇసుక పంపిణీ జరగాలి. రాత్రిపూట ఏ వాహనం కనిపించినా సీజ్ చేయాలి. ప్రత్యేక చెక్ పోస్టులు, జీపీఎస్ ట్రాకింగ్ అమలు చేయాలి. ఇసుక తరలిస్తున్న కాంట్రాక్ట్ కంపెనీపై కఠిన నిఘా అవసరం. అని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వం స్పందిస్తుందా?

పేదల ఇసుక నిజంగా పేదలకే చేరుతుందా?పేదల ఇళ్ల కలను కాపాడే బాధ్యత ఇప్పుడు ప్రభుత్వంపై ఉంది. ఇసుక మాఫియాను అరికట్టి ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందా? లేదా మంచు కొండలా గుండాల ఇసుక గుట్టలూ పేదల ఆశలూ కరిగిపోతాయా? అనేది వేచి చూడాలి.



# స్వామినాయుడు సేవలు అభినందనీయం

- సీఐ రాజనీకుమార్

**పాలకొల్లు, ఫిబ్రవరి 3,మనం ప్రతినిధి:** పాలమూరు గ్రామ సర్పంచ్ గా, కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ గా పంచదార వెంకట లక్ష్మి స్వామి నాయుడు ను అందిస్తున్న సేవలు అభినందనీయం అని పాలకొల్లు పట్టణ సీఐ కోలా రాజనీకుమార్ అన్నారు. పాలకొల్లు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్వర్యంలో జిన్నూర్ ఐడియల్ స్కూల్ లో ఆటల పోటీలు నిర్వహించినారు. దీనిలో భాగంగా పంచదార వెంకట లక్ష్మి స్వామి నాయుడు ను గ్రామ సర్పంచ్ హోదాలో సత్కరించారు.ముఖ్య అతిధులు తహసిల్దార్ -వై . దుర్గా కిశోర్,పట్టణ సీఐ రజని కుమార్ . ఎం ఈ ఓ : జి . వీరస్వామి పాలకొల్లు,ఏ శ్రీవాణి ఎలమంచిలి ఏం ఈ ఓ జి . విజయ కుమార్ పోడూరు ఎం ఈ ఓ పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లోఅసోసియేషన్ప్రెసిడెంట్:మహ్మద్ షాజహాన్ సెక్రటరీ:ఎం శ్రీరామ్ ట్రెజరేర్:ఏ . భాను ప్రకాష్ అసోసియేషన్ పెద్దలు: మద్దాల రాంప్రసాదు, రావూరి అప్పారావు ఐడియల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# దలైలామాకు గ్రామీ అవార్డు

- మెడిటేషన్స్‌పై ప్రసంగ ఆల్బమ్‌కు దక్కిన గౌరవం

**లాస్ ఏంజెలెస్, ఫిబ్రవరి 3 :** ప్రముఖ బౌద్ధ గురువు దలైలామాకు గ్రామీ అవార్డు దక్కింది. 'మెడిటేషన్స్-ద రిఫ్లెక్షన్స్ ఆఫ్ హిస్ హోలీనెస్ ద దలైలామా' పేరుతో ఆయన చేసిన ప్రసంగ ఆల్బమ్‌కు ఈ గౌరవం దక్కింది. 90 ఏళ్ల టిబెట్ ఆధ్యాత్మిక గురువు అయిన దలైలామాకు గోల్డెన్ గ్రామోఫోన్ దక్కడం ఇదే తొలిసారి. ఆదివారం రాత్రి లాస్ ఏంజెలెస్‌లోని క్రిప్టోడాట్‌కామ్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 90 కేటగిరీలో అవార్డులను ప్రకటించారు. దలైలామాకు అవార్డు దక్కడంతో హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలతోపాటు ఇతర ప్రాంతాల్లో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. దలైలామా తరఫున గాయకుడు రఫూస్ వెయిన్రైట్ అవార్డును స్వీకరించారు. 'ఆడియో బుక్స్, నరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్' కేటగిరీలో ఈ అవార్డు దక్కింది. గాయకులు మ్యాగీ రోజర్స్, ఆంద్రా డేతో కలిసి దలైలామా ఈ ఆల్బమ్ రూపకల్పనలో పాలుపంచుకున్నారు. కబీర్ సెహగల్ నిర్మించిన ఈ ఆల్బమ్‌లో సరోద్ విద్వాంసుడు అంజాద్ అలీ ఖాన్, ఆయన కుమారులు అమాన్ అలీ బంగాష్, అయాన్ అలీ బంగాష్, అమెరికా శాక్సాఫోన్ విద్వాంసుడు టెడ్ నాష్, గాయకుడు, గేయ రచయిత డెబీ నోవా తదితరులు కనిపించారు.

# ఢిల్లీకి చేరిన బెంగాల్ 'సర్' పోరాటం

## సీఈసీతో భేటీ నుంచి మమతా బెనర్జీ వాకౌట్



**ఢిల్లీ, ఫిబ్రవరి 3 :** పశ్చిమ బెంగాల్లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చేస్తోన్న పోరాటం ఢిల్లీకి చేరింది. సర్ సమస్యలపై మాట్లాడేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) అపాయింట్‌మెంట్ తీసుకుని ఢిల్లీ వచ్చిన బెంగాల్ సీఎం, టీఎంసీ అగ్రనేత మమతా బెనర్జీ ఈసీతో, ఢిల్లీ పోలీసులతో ఘర్షణకు దిగారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో సోమవారం సాయంత్రం భేటీ అయిన మమత ఆ సమావేశం నుంచి అర్ధంతరంగా వాకౌట్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జ్ఞానేశ్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అహంకారపూరితంగా వ్యవహరించారని, తమ ప్రతినిధులను అవమానించారని ఆరోపించారు. సర్ కసరత్తుతో పలువురు ప్రాణాలు కోల్పోయినా ఈసీ పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు. బీజేపీ దళారిగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని ధ్వజమెత్తారు. ఇక ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామన్నారు. మమతా బెనర్జీ ఆరోపణలను సీఈసీ తోసిపుచ్చారు. టీఎంసీ ప్రతినిధులకు సమాధానం చెబుతుండగానే మమత ఆగ్రహంతో భేటీ నుంచి వెళ్లిపోయారని తెలిపారు.

అంతకుముందు ఢిల్లీలోని బంగ భవన్ వద్ద భారీ స్థాయిలో పోలీసుల మోహరింపుపై మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో వారితో ఘర్షణకూ దిగారు. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 'సర్' బాధితులు ఢిల్లీలోని బెంగాల్ ప్రభుత్వ భవనాల్లో బస చేశారు. చాణిక్యపురిలోని బంగ భవన్ ప్రాంగణంలో మోహరించిన ఢిల్లీ పోలీసులతో మమత వాగ్వాదానికి దిగారు.

# 'ఎస్ఎఫ్డీఆర్' పరీక్ష విజయవంతం

## డీఆర్‌డీవో మరో ఘనత



చాందీపూర్(ఒడిశా), ఫిబ్రవరి 3 : దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు చేసింది. గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధికి కీలకమైన 'సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్' సాంకేతికతను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది.
పరీక్షల్లో భాగంగా నాజిల్ లెస్ బూస్టర్, సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ మోటార్, ఫ్యూయల్ ఫ్లో కంట్రోలర్ వంటి అన్ని వ్యవస్థలు ఆశించిన రీతిలో అత్యుత్తమ పనితీరును కనబరిచాయి. ఐటీఆర్ ఏర్పాటు చేసిన వివిధ ట్రాకింగ్ పరికరాల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఈ పరీక్ష విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. 'ఎస్ఎఫ్‌డీఆర్' ప్రొపల్షన్ వ్యవస్థ పరీక్ష విజయవంతంతో శత్రు దేశాల లక్ష్యాలను అత్యంత దూరం నుంచే అడ్డుకోగల క్షిపణుల తయారీ దిశగా భారత్ ముందడుగు వేసినట్లయ్యింది. ఈ ప్రయోగాన్ని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ లాబొరేటరీ, హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ, రీసెర్చ్ సెంటర్ ఇమారత్, ఐటీఆర్ శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు.

# 'ఐరోపా సైన్యం' ఏర్పాటు.. అత్యంత ప్రమాదకరం

- **ఈయూ ప్రతినిధి కాజా కల్లాస్**

**ఓస్లో(నార్వే), ఫిబ్రవరి 3 :** గ్రీన్‌లాండ్ విషయంలో ఇటీవల అమెరికా, ఐరోపా దేశాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ పరిణామాల నేపథ్యంలో యురోపియన్ ఆర్మీ ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే, దీన్ని ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కల్లాస్ వ్యతిరేకించారు. ఐరోపా సైన్యం ఏర్పాటు చాలా ప్రమాదకరమని హెచ్చరించారు.

'ఐరోపా సైన్యం అవసరమని చెప్పేవారు.. బహుశా ఈ విషయాన్ని ప్రాక్టికల్‌గా ఆలోచించి ఉండరు. యూరప్ దేశాలు ఇప్పటికే నాటోలో ఉన్న నేపథ్యంలో.. ఒక ప్రత్యేక సైన్యాన్ని సృష్టించలేరు. యుద్ధం వంటి సంక్షోభ సమయాల్లో 'ఎవరు ఎవరికి ఆదేశాలు జారీ చేస్తారు?' అనేది ముఖ్యమైన అంశం. ఒకవేళ నాటో, ఐరోపా సైన్యం రెండూ ఉంటే.. అప్పుడు పరిస్థితి గందరగోళంగా మారుతుంది. ఇది అత్యంత ప్రమాదకరం'' అని నార్వేలో నిర్వహించిన ఓ భద్రతా సమావేశంలో కల్లాస్ వ్యాఖ్యానించారు.

నార్వే ప్రధాని జోనాస్ సైతం యురోపియన్ ఆర్మీ అంశాన్ని వ్యతిరేకించారు. నాటో స్వతహాగా సంక్లిష్టమైనదని, అయినప్పటికీ.. పనిచేయగలదని తెలిపారు. అగ్రరాజ్యం మద్దతు లేకపోతే ఐరోపాకు రక్షణే లేదని ఇటీవల నాటో చీఫ్ మార్క్ రుట్టే హెచ్చరించిన విషయం తెలిసిందే.

రక్షణ విషయంలో అమెరికా, నాటోపై ఆధారపడాల్సి రావడం, ఉక్రెయిన్- రష్యా యుద్ధం, గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా వైఖరి వంటి పరిణామాల నేపథ్యంలో యురోపియన్ ఆర్మీ ఏర్పాటు అంశం చర్చల్లో నిలుస్తోంది. ఐరోపా తనను తాను రక్షించుకునేలా ఓ సైన్యం అవసరమని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ చాలా కాలంగా చెబుతున్నారు. లక్షమందితో ఐరోపా సైన్యం అవసరమని యురోపియన్ కమిషనర్ ఫర్ డిఫెన్స్ అండ్ స్పేస్ ఆండ్రియస్ కుబిలియస్ ఇటీవల చెప్పారు. జర్మనీ, స్పెయిన్ దేశాలూ ఇదే విధమైన వాదనలు వినిపించాయి.



# గంటలపాటు ఈది.. కుటుంబాన్ని కాపాడిన సాహస బాలుడు!



**పెర్త్, ఫిబ్రవరి 3 :** సముద్రంలో కొట్టుకుపోయిన తన తల్లి, తోబుట్టువులను కాపాడుకునేందుకు ఓ బాలుడు పెద్ద సాహసం చేశాడు. అల్లకల్లోలంగా మారిన సముద్రంలో దాదాపు 4 గంటలపాటు భీకర అలలకు ఎదురీది ఎట్టకేలకు తీరానికి చేరుకుని సమాచారం అందించాడు. అప్పటికే చీకటి పడటంతో హెలికాప్టర్ సాయంతో రంగంలోకి దిగిన అధికారులు.. తల్లి, మరో ఇద్దరు పిల్లలను సురక్షితంగా కాపాడారు. ఆస్ట్రేలియాలో ఈ ఘటన వెలుగుచూసింది.

పెర్త్‌కు చెందిన జోవాన్ అపెల్బీ అనే మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి చిన్న పడవలు (కయాక్), పెడల్ బోర్డ్‌ల సాయంతో సముద్రంలో విహారానికి వెళ్లారు. అంతలోనే వాతావరణం మారిపోవడంతో.. వారు క్రమక్రమంగా తీరానికి దూరంగా కొట్టుకుపోయారు. ఈ క్రమంలోనే.. తల్లి సూచనతో పెద్ద కుమారుడు ఆస్టిన్ (13) సాహసోపేత నిర్ణయం తీసుకున్నాడు. సాయాన్ని అర్థించేందుకు తొలుత కయాక్ తీరం వైపు బయల్దేరాడు. కానీ, అందులోకి నీరు చేరడంతో మధ్యలోనే వదిలేశాడు.

అనంతరం లైఫ్‌జాకెట్‌ను వదిలేసి.. తీరం వైపు ఈత కొట్టడం ప్రారంభించాడు. ఉద్ధృత అలల నడుమ దాదాపు 4 కిలోమీటర్ల మేర ఈది తీరానికి చేరుకున్నాడు.

బాలుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా అధికారులు హెలికాప్టర్ సాయంతో గాలింపు చేపట్టి.. తల్లి, ఇద్దరు పిల్లలను గుర్తించారు. ఆ సమయానికి వారు తీరానికి 14 కిలోమీటర్ల దూరంలో పెడల్ బోర్డులను పట్టుకుని వేలాడుతూ కనిపించారని చెప్పారు. బాలుడి ధైర్యసాహసాలను ప్రశంసించారు. నలుగురికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఎవరికీ ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం రాలేదన్నారు. ఆ సమయంలో ముగ్గురు పిల్లలను వదిలేసి తాను వెళ్లలేని పరిస్థితి ఉందని, ఆస్టిన్‌ను పంపడం తన జీవితంలో తీసుకున్న అత్యంత కష్టమైన నిర్ణయమని తల్లి జోవాన్ తెలిపారు. సముద్రంలో కొట్టుకుపోయిన మొదట్లో ధైర్యంగానే ఉన్నామని, కానీ.. చీకటి పడేకొద్దీ అలలు ఉద్ధృతంగా మారాయని, చలికి వణికిపోయామని చెప్పారు.

# ప్రతి ఒక్కరికీ ప్రయోజనమే!

## ట్రేడ్ డీల్‌పై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్

**ఢిల్లీ, ఫిబ్రవరి 3 :** భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం రైతుల నుంచి మత్స్యకారుల వరకూ దేశంలోని 140 కోట్ల మందికి ప్రయోజనకారిగా ఉంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ప్రకటించడం, ఆ విషయాన్ని ప్రధానమంత్రి మోదీ ధ్రువీకరించడం అనేక ప్రశ్నలకు తావిచ్చింది. దీంతో ఈ ట్రేడ్ డీల్కు సంబంధించిన కొన్ని వివరాలను మీడియాతో పీయూష్ గోయల్ పంచుకున్నారు. పార్లమెంటులో ఈ (ట్రేడ్ డీల్) వివరాలను పంచుకోవాలని తాను అనుకున్నానని, అయితే లోక్ సభలో ఈరోజు ఎంత రభస జరిగిందో అందరూ చూశారని గోయల్ అన్నారు. సభలో జరిగిన దానికి రాహుల్ గాంధీని ఆయన తప్పుపట్టారు.
మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే అముద్రిత పుస్తకం నుంచి విపక్ష నేత కొన్ని అంశాలను ప్రస్తావించేందుకు చేసిన ప్రయత్నమే ఈ రభసకు కారణమని అన్నారు.



**ద బెస్ట్ డీల్.. ఇది**

అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్తో తనకున్న మైత్రీ సంబంధాలను ఉపయోగించుకుని మనం పోటీ పడే అన్ని దేశాల కంటే బెస్ట్ డీల్ను ప్రధానమంత్రి మోడీ కుదుర్చుకున్నారని పీయూష్ గోయల్ తెలిపారు. 'ఎన్నో సవాళ్లు ఉన్నాయి. 50 శాతం టారిఫ్లను భారత్ ఎదుర్కొంది. రైతులు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతి దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డీల్ ఎప్పుడు కుదురుతుందంటూ కొన్నిరోజుల క్రితం వరకూ విపక్షాలు మమల్ని అడుగుతూనే ఉన్నాయి. నెలల తరబడి ఈ డీల్ పొందలేకపోయాం. కానీ ప్రధాని తనకున్న మైత్రీ సంబంధాలను ఉపయోగించుకుని గొప్ప డీల్ కుదిర్చారు. ఈ డీల్తో భారత్కు ఎన్నో విధాలుగా మేలు జరుగుతుంది' అని గోయల్ వివరించారు.

**పండుగ చేసుకుంటారు..**

వ్యవసాయరంగం పరిరక్షణపై వ్యక్తమవుతున్న అనుమానాలపై మాట్లాడుతూ.. వ్యవసాయం, పాడిరంగం పరిరక్షణపై మొదట్నించీ ప్రధాని దృష్టిసారించారని, వాటికి ఎలాంటి చెడు జరగదని చెప్పారు. సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసే మత్స్యకారులు ఈ డీల్ తర్వాత పండుగ చేసుకుంటారని, భారత ఉజ్వల భవిష్యత్తుకు ఈ డీల్ సంకేతమని చెప్పారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, టెక్స్‌టైల్స్, మెరైన్ గూడ్స్, జెమ్స్, జ్యూవెల్లరీ రంగాలకు చాలా ప్రయోజనాలు చేకూరుతాయని పీయూష్ గోయల్ చెప్పారు.

# యార్ ఏంటి..? ఇవేం మాటలు..?

## ప్యానెల్ స్పీకర్ ఆగ్రహం



**ఢిల్లీ, ఫిబ్రవరి 3 :** బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రసంగిస్తున్న సమయంలో అధికార కూటమి సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో విపక్ష ఎంపీ ఒకరు ప్యానెల్ స్పీకర్‌ను ఉద్దేశించి 'యార్' అని సంబోధించారు. ఇలా మాట్లాడటాన్ని ప్యానెల్ స్పీకర్ వ్యతిరేకించారు. ''ఇప్పుడు మీరు ఏం అన్నారు? ఈ యార్ ఏంటి? ఇది పార్లమెంట్. మీరు సభాపతి స్థానంలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి అలా మాట్లాడకూడదు. ఇది సభా మర్యాదకు వ్యతిరేకం. వెంటనే మీ మాటలు వెనక్కి తీసుకోండి'' అని ప్యానెల్ స్పీకర్‌గా ఉన్న తెన్నేటి కృష్ణ ప్రసాద్ మందలించారు. ఆయన లోక్‌సభలో ప్యానెల్ ఆఫ్ ఛైర్ పర్సన్‌లలో ఒకరు.

చైనా దురాక్రమణపై భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె రాసిన ఆత్మకథలోని అంశాలను విపక్షనేత రాహుల్‌గాంధీ మంగళవారం కూడా ప్రస్తావించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా జాతీయ భద్రతా అంశాలపై మాట్లాడాలనుకుంటున్నానని చెప్పారు. ఈ క్రమంలోనే విపక్ష సభ్యులు స్పీకర్ కుర్చీ దిశగా కాగితాలు చించి విసిరారు. వారిపై స్పీకర్ చర్యలు తీసుకున్నారు. ఈ సెషన్ మొత్తానికి ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు. హిబీ ఈడెన్, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గుర్జీత్ సింగ్, కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ పడొలె, డీన్ కురియకోస్, సీపీఐ(ఎం)ఎంపీ ఎస్ వెంకటేశన్‌లను సస్పెండ్ చేశారు. అనంతరం సభ రేపటికి వాయిదా పడింది.

# గాంధీ విగ్రహం ధ్వంసం, చోరీ..

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత్ డిమాండ్..!





**ఆస్ట్రేలియా ఫిబ్రవరి 3 :** ఆస్ట్రేలియాలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. మెల్బోర్న్లో భారతీయులు అధికంగా నివసించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన గాంధీ కాంస్య విగ్రహాన్ని కట్ చేసి ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గాంధీ కాంస్య విగ్రహాన్ని కట్ చేసిన వారిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని విదేశాంగ శాఖ డిమాండ్ చేసింది. దొంగతనానికి గురైన విగ్రహాన్ని కనుగొని.. బాధ్యులను వదలొద్దని ఢిల్లీలోని ఆస్ట్రేలియా దౌత్యాధికారులకు తేల్చి చెప్పింది.మెల్బోర్న్లో భారత సంతతి ప్రజలు ఎక్కువగా నివసించే రోవ్విల్లే ప్రాంతంలోని గాంధీ కాంస్య విగ్రహాన్ని కొందరు ధ్వంసం చేశారు. అంతటితో ఊరుకోకుండా విగ్రహాన్ని పాదాలు మాత్రమే ఉంచి.. కాళ్ల వరకు కట్ చేసి ఎత్తుకెళ్లారు అగంతకులు.
ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన ఇండియన్ కమ్యూనిటీ స్థానిక విక్టోరియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. గాంధీ విగ్రహాన్ని ధ్వంస చేయడం, ఎత్తుకెళ్లడాన్ని ఖండించారు. 'మెల్బోర్న్లో భారత కమ్యూనిటీ నివసించే ప్రాంతంలోని గాంధీ కాంస్య విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనపై సత్వరమే చర్యలు తీసుకోవాలని, అపహరణకు గురైన విగ్రహాన్ని త్వరగా కనిపెట్టాలని ఆస్ట్రేలియా అధికారులను కోరాం' అని జైస్వాల్ వెల్లడించారు. అయితే.. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇంకా స్పందించాల్సి ఉంది. అహింసావాది గాంధీ కాంస్య విగ్రహాన్ని రోవ్విల్లేలో 2021 నవంబర్ 12వ తేదీన అప్పటి ప్రధాని స్కాట్ మోరిసన్ ఆవిష్కరించారు.

# గురుకులాలు... విషసర్పాలకు ఆవాసాలా..?

- **హరీష్ రావు**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల సంగతి దేవుడెరుగు.. ఉన్న గురుకులాల పరిస్థితి అధ్వాన్నం చేశారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పాము కాటుకు గురై ఆస్పత్రిలో చేరిన గురుకుల విద్యార్థిని ప్రాణానికి పూర్తి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గురుకులంలో ఇంటర్ విద్యార్థిని అశ్మిత పాముకాటుకు గురై మృత్యువుతో పోరాడుతుందన్న ఘటనపై తీవ్రంగా స్పందించారు. విద్యార్థిని పాము కాటుకు గురైన వార్త తనను ఎంతో కలిచివేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి.. మీ పాలనలో గురుకులాలు విద్యా నిలయాలా..? లేదంటే విషసర్పాలకు ఆవాసాలా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా ఇది మీ పరిపాలనా వైఫల్యం కాదా? రూ.20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అని చెబుతూ రంగుల లోకం చూపిస్తూ గురుకులాలను మీరు గాలికి వదిలేయడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో పిచ్చి మొక్కలు తొలగించే దిక్కులేదు. చిమ్మ చీకట్లో లైట్లు వేసే నాథుడు లేడన్నారు. అపరిశుభ్రత కారణంగా గురుకులాల్లో నేడు కుక్కకాట్లు, పాము కాట్లు సర్వసాధారణంగా మారిపోవడం అత్యంత దుర్మార్గమైన విషయమన్నారు.

గురుకుల బిడ్డలకు కడుపునిండా తిండి లేదు.. ప్రాణాలకు రక్షణ లేదన్నారు. సీఎం హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి విదేశాల్లో ఫొటోలకు పోజులిస్తే ఇక్కడ పేద విద్యార్థులు ఆస్పత్రి పాలై కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు చదువుకోవడానికి వెళ్తున్నారా..? లేక చావుతో పోరాడేందుకు వెళ్తున్నారా..? అని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి పతనమవుతున్న గురుకులాలను కాపాడాలన్నారు. రాజకీయ కక్షసాధింపుల మీదున్న శ్రద్ధలో కొంతైనా పేద పిల్లల బతుకుపై పెట్టండని విజ్ఞప్తి చేశారు.

## బీఆర్ఎస్‌లో భారీ చేరికలు



సూర్యాపేట, ఫిబ్రవరి 3 (మనం ప్రతినిధి): సూర్యాపేట పట్టణం లోని 21 వ వార్డు మాజీ కౌన్సిలర్, ప్రముఖ న్యాయవాది బాణాల విజయ్ కుమార్ ఆ వార్డుకు చెందిన సుమారు 20 మంది బీఎస్పీ. సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గులాబి పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వారికీ మాజీమంత్రి,, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకు బీఫాంలు అందజేసిన ఎమ్మెల్యే



తిరుమలగిరి, ఫిబ్రవరి 03 (మనం న్యూస్): తిరుమలగిరి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనుండి పోటీ చేస్తున్న అభ్యర్థులకు నామినేషన్ల ఉపసంహరణ గడువు చివరి రోజు మంగళవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు బీఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారికంగా బీఫాం లు కేటాయించిన అభ్యర్థులందరినీ గెలిపించి తిరుమలగిరి మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలే అసలైన పునాది అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా ఆరు గ్యారంటీల ఫలితాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలకు కలుగుతున్న లాభాలను వివరించి, ప్రతి గడప గడపకు పార్టీ సందేశాన్ని చేర్చాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు, డీసీసీ మాజీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ మాట్లాడుతూ సమిష్టి కృషితోనే విజయం సాధ్యమని, వర్గ విభేదాలకు తావు లేకుండా పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై. నరేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి హుండీ అపహరణ

- అర్ధరాత్రి గుడిలోకి వెళ్లి హుండి ఎత్తుకెళ్లిన దుండగులు

ఆత్మకూర్ ఎస్, ఫిబ్రవరి 3(మనం న్యూస్): మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో గల దండు మైసమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. గుర్తు తెలియని దొంగలు గుడి వెనుక వైపు నుంచి ఆలయం లోపలికి ప్రవేశించి, గర్భ గుడి దగ్గర ఉన్న హుండీని ఎత్తుకెళ్లిపోయారు. ఆ హుండీని గుడి వెనకాల ఉన్న పొలాల వైపు కొద్ది దూరం వెళ్లి అక్కడ గడ్డపారతో పగలగొట్టి భక్తులు కానుకలుగా సమర్పించిన నగదును దోచుకెళ్లారు. సుమారు 20వేల రూపాయల నగదు అపహరణకు గురైనట్లు ఆలయ ఈవో జయరామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు



చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూర్ (ఎస్). ఎస్ ఐ బి. శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

### ఈ నెల 5వ తేదీన బేతవోలులో

## మెగా ఉచిత నేత్ర చికిత్స శిబిరం



చిలుకూరు, ఫిబ్రవరి 3 (మనం న్యూస్): స్వర్ణ భారతీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఐ కంటి వైద్యశాల సూర్యాపేట వారి సహకారంతో ఈ నెల 5వ తేదీన గురువారం మండలంలోని బేతవోలు గ్రామంలో చేసే ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరంను అవసరం ఉన్న వారు వినియోగించుకోవాలని కోరుతూ మంగళవారం బేతవోలు గ్రామంలో సంబందింత కర పత్రంను సర్పంచ్ వట్టికూటి నాగయ్యతో కలిసి నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత నేత్ర వైద్య శిభిరంను కంటి చూపు లోపం ఉన్న వినియోగంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఓరగంటి కిట్టు, ఉప సర్పంచ్ ఇట్టిమళ్ల ఏడుకొండలు, పీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామనర్సయ్య, స్వర్ణ భారతీ ట్రస్ట్ అధ్యక్షులు నీలా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చారుగండ్ల ప్రవీణ రాజశేఖర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలి

మేళ్లచెరువు ఫిబ్రవరి 3 మనం న్యూస్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మేళ్లచెరువు శివరాత్రి జాతరను విజయవంతం చేయాలని హుజూర్నగర్ ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి వారి దేవాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేళ్లచెరువు జాతరకు లక్షలాది సంఖ్యలో భక్తులు వస్తున్నందున ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్,ఆర్ డబ్ల్యుఎస్, శాఖలు అధికారులు,అన్ని శాఖల అధికారుల తో సమన్వయం తో పనిచేస్తూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అన్నారు. స్థానికంగా ఉన్న సిమెంట్ పరిశ్రమలు కూడా శివరాత్రి జాతరకు తమ చేయూతనివ్వాలని ఆయన కోరారు.ఈ




కార్యక్రమంలో సూర్యాపేట జెడ్పి సీఈఓ శిరీష, కోదాడ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, కోదాడ రూరల్ ఇన్చార్జి సీఐ చరమందరాజు, దేవాదాయ శాఖ ఏసి భాస్కర్, తాసిల్దార్ రాజేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బచ్చు పద్మా శ్రీనివాసరెడ్డి,ఉత్సవ కమిటీ చైర్మన్ పెండ్లి లచ్చయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు, కార్యనిర్వహణాధికారి ఎన్. శంబిరెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మృతి చెందిన బాల్య స్నేహితుడికి ఆర్థిక సాయం



తుంగతుర్తి, ఫిబ్రవరి 3 (మన న్యూస్): మండల కేంద్రంలోని హరిజన కాలనీకి చెందిన పదవ తరగతి స్నేహితుడు ఏగురి కిరణ్ మాతృమూర్తి ఏగూరి వసంత అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన దశ దిన కార్యక్రమంలో 2009 - 2010 బ్యాచ్ పదవ తరగతి స్నేహితులు కుటుంబానికి పెద్దదిక్కు చనిపోవడంతో తీవ్ర దుఃఖంలో ఉన్న తన తోటి మిత్రుని కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పి కుటుంబాన్ని పరామర్శించి అనంతరం రూ. 8 వేలు ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి భారీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈదురి పరశురాములు,ఇరుగు సుధాకర్,తడకమళ్ళ రవికుమార్, జటాంగి మధు, ఎస్ కే యాకూబ్ పాషా, బొజ్జ సాయికిరణ్, బరపడి సునీల్, కొమ్ము కిరణ్ మద్దెల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 94.39 శాతం మంది విద్యార్థుల హాజరు

జగిత్యాల, ఫిబ్రవరి 03 (మనం న్యూస్): జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు 94. 39 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు జగిత్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ కన్వీనర్ బొప్పరాతి నారాయణ గారు తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ విభాగంలో 884 మంది విద్యార్థులకు గాను 862 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 22 మంది విద్యార్థులు గైర్ హాజరయ్యారన్నారు.. ఒకేషనల్ విభాగంలో 560 మంది విద్యార్థులకు గాను 501 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారని 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.. మొత్తంగా 1444 మంది విద్యార్థులకు గాను 1363 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 81 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని, దీంతో 94.39 శాతం హాజరు నమోదయిందన్నారు.. మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్ పరీక్షల్లో జనరల్ విభాగంలో 724 మంది విద్యార్థులకు గాను 722 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఆయన తెలిపారు.. ఒకేషనల్ విభాగంలో 516 మంది విద్యార్థులకు గాను 476 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 40 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని తెలిపారు.. మొత్తంగా 1240 మంది విద్యార్థులకు గాను 1198 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారని 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని దీంతో 96.61% మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు.

## రైతులు యాప్ సేవలు వినియోగించుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3 (మనం ప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ ద్వారా రైతులు ఎరువులు కొనుగోలు చేస్తున్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలోని అన్ని ఫెర్టిలైజర్ షాప్ లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని రైతులు యాప్ ద్వారా 13,381 ఎరువుల బస్తాలు బుకింగ్ చేశారని, 9,436 బస్తాలు కొనుగోలు చేశారని వెల్లడించారు. అన్ని చోట్ల రైతులకు సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్, ఒక సహాయకుడు



ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరూ యాప్ లో యూరియా బుక్ చేసుకుని తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని స్పష్టం చేశారు.

## ఆన్ డ్యూటీ అధికారులు పోస్టల్ బ్యాలెట్ వినిగించుకోవాలి



సూర్యాపేట, ఫిబ్రవరి 03 (మనం ప్రతినిధి): జిల్లాలో మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వి.సి హాల్ నందు జిల్లాలో ని మున్సిపల్ కమీషనర్లు, ఆర్డీవోలు, తాసిల్దార్లతో మున్సిపల్ ఎన్నికల పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7,8,9 తేదీలలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఫెసిలిటేషన్ సెంటర్లలో సంబంధిత మున్సిపాలిటీకి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసిన తదుపరి సాధారణ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదని, కావున అభ్యర్థులు ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డిప్యూటీ సీఈవో శిరీష, డివిజనల్ పిఓ నారాయణరెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ డెలివరీ గడువులోగా పూర్తి చేయాలి



- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3 (మనం ప్రతినిధి): సీఎంఆర్ (కస్టమ్ మిల్ రైస్) డెలివరీ గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీపై రైస్ మిల్లుల యజమానులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 2024-25 ఖరీఫ్ సీజన్, 2024-25 రబీ సీజన్ కు మిల్లుల వారీగా వారికి కేటాయించిన ధాన్యం, డెలివరీ చేయకుండా పెండింగ్ లో ఉన్న ధాన్యం వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. రైస్ మిల్లుల వారీగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా గడువులోగా పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. మిల్లర్లు నిబంధనల ప్రకారం సీఎంఆర్ను సమయానికి డెలివరీ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఖరీఫ్ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 16-02-2026 చివరి తేదీ అని, రబీ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 28-02-2026 చివరి తేదీ అని వెల్లడించారు. జిల్లాకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయడం మిల్లర్లు బాధ్యతగా భావించాలని సూచించారు. గత అనుభాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే సీజన్ లో లక్ష్యాన్ని సమర్థవంతంగా చేరుకునేలా ముందుచూపుతో వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో ఇంచార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి రాధాబాయి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, భద్రతపై వీడియో కాన్ఫరెన్స్

- ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి
- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 03( మనం ప్రతినిధి ): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర డీజీపీ శ్రీ శివధర్ రెడ్డి ఐపీఎస్ గారు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు మరియు ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీజీపీ గారు ఎన్నికల నిర్వహణలో పోలీస్ శాఖ పాత్ర, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు(ఎంసీసీ), పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, క్రిటికల్ మరియు సున్నిత ప్రాంతాలపై పర్యవేక్షణ వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీ గారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీస్



శాఖ బాధ్యతలు అత్యంత కీలకమని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గత ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నేరస్తులు, ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులు, పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులను గుర్తించి బైండోవర్ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీల వివరాలు, సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాల వివరాలపై సంబంధిత అధికారులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని అన్నారు. ప్రతి అధికారి తన పరిధిలో పరిస్థితులపై స్పష్టమైన సమాచారం కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేయాలని, డబ్బు, మద్యం తదితర ప్రలోభాలకు సంబంధించిన అక్రమ రవాణా మరియు పంపిణీపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్కు ముందు మరియు పోలింగ్ రోజున అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలని తెలిపారు.అలాగే, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య వార్తలపై సైబర్ విభాగం ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టి, చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డీజీపీ గారు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సరిపడా బందోబస్తు ఏర్పాటు చేసి, ఓటర్లు నిర్భయ ంగా తమ ఓటు హక్కును వినియో గించుకునేలా పూర్తి భద్రత కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు పాల్గొని, జగిత్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల భద్రతా ఏర్పాట్ల వివరాలను డీజీపీ గారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డీఎస్పీ రఘు చందర్, ఎస్సై ఇన్స్పెక్టర్లు, పాల్గొన్నారు.

## వేసవికాలం నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు



కోదాడ, ఫిబ్రవరి 3(మనం న్యూస్): మండల పరిధిలోని గణపవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ బలుగూరి స్నేహ దుర్గయ్య ఆధ్వర్యంలో వేసవికాలం నీటి ఇబ్బందులు రాకుండా ముందు చర్యలలో భాగంగా ఆర్డబ్ల్యుఎస్ ఏఈ రవి ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బల్లూరి స్నేహ దుర్గయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఊర్లో తాగునీటి స్థితిని మిషన్ భగీరథ నీటి సరఫరా వాటర్ ట్యాంక్ ని బిసి కాలనీలో 120000 లీటర్ల వాటర్ ట్యాంక్లు పరిశీలించిన ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రవి అధికారి కి వివరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎస్ జీవిత, ఉపసర్పంచ్ శంకరశెట్టి కోటేశ్వరరావు, వార్డు మెంబర్లు బండి చినకోటయ్య, మాడూరి కృష్ణారావు, కుర్రి వెంకన్న, ఇర్ల శ్రీనివాసరెడ్డి, బోర్ర దుర్గారావు, గాయం కరుణాకర్ రెడ్డి, శ్యామకూరి గురవయ్య, కొండ ధనమూర్తి, విప్పాల హనుమంతు, సత్యం, గ్రామపంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

- భీమేశ్వర ఆలయంలో పూజలు

వేములవాడ, ఫిబ్రవరి 3 (మనం న్యూస్): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో రానున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భీమేశ్వర ప్రధాన ఆలయానికి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీల్చైర్ సదుపాయంతో నూతనంగా ఏర్పాటు చేసే ర్యాంపును పరిశీలించారు. అలాగే లడ్డూ కౌంటర్, పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్లు, చలువ పందిళ్లు, టెంట్లు, వీఐపీ రోడ్లు, టాయిలెట్స్, శివార్చన స్టేజీ, నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లు, పార్వతీపురం ధర్మశాల రోడ్డుతోపాటు ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. భీమేశ్వర స్వామి వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కార్యాలయంలో రూ. 1000 వేద ఆశీర్వచనం,



రూ.500 స్పెషల్ కోడె, రూ. 300 స్పెషల్ దర్శనం టికెట్స్ అందుబాటులో ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు.

### భీమేశ్వర ఆలయంలో పూజలు

అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం స్వామివారి మండపంలో ఆలయ ఈవో శ్రీమతి ఎల్ రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, ఆలయ డీఈలు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఓలు జయకుమారి, శ్రావణ్ కుమార్, బ్రహ్మం అన్న, శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సోషల్ టాలెంట్ టెస్టో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన దూడపాక అక్షర



పెద్దపల్లి,ఫిబ్రవరి03(మనం న్యూస్): పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్టో పెద్దపల్లి జిల్లా,మంథని మండలం, ఆరెంద హై స్కూల్లో 10వ తరగతి చదువుతున్న దూడపాక అక్షర జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి ప్రతిభను చాటింది. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన అక్షరను ఫిబ్రవరి 7న హైదరాబాద్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆరెంద హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఈదులపల్లి నరసింహ రావు అక్షరను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అక్షరను సిద్ధం చేస్తున్నామని సోషల్ టీచర్ బెజ్జల శ్రీలత తెలిపారు.అలాగే ప్రథమ స్థానం సాధించిన అక్షరను ఉపాధ్యాయులు సువార్త,మమత, గియాశుద్ధిన్,పద్మజ, శ్రీవాణి,శ్రీలత, సహేందర్,అమన్ అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.అక్షర రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ఫలితం సాధించాలని వారు ఆకాంక్షించారు.

# ఆడపిల్లల చదువే అసమానతలకు అడ్డుకట్ట

- అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి



వరంగల్, ఫిబ్రవరి 3(మనంప్రతినిధి): జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిని బి రాజమణి అధ్యక్షతన అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి ముఖ్య అతిథిగా ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించడం జరిగింది. జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ముందుగా అందరికీ జాతీయ బాలిక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ఆడపిల్లలు ప్రతి రంగాల్లో ముందుండాలని ఆడపిల్లల కోసం ప్రభుత్వం ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహిస్తుంది అని తెలియజేస్తూ ముందుగా ఆడపిల్లలలో భయం ఎక్కువగా ఉంటుంది దానివల్ల కొంతమంది వెనుకడుగు వేస్తూ ఉంటారు అలా కాకుండా ధైర్యంగా ఆడపిల్లలు అనుకునే లక్ష్యాల్ని నెరవేర్చుకోవాలని తెలిపారు

జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిని రాజమణి గారు మాట్లాడుతూ చదువు బాలికలకు ఎంతో ముఖ్యమని చదువుతూనే ఏదైనా సాధించవచ్చు అని తెలియజేస్తూ ప్రభుత్వం బాలికల సాధికారత కోసం ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ముఖ్యంగా బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని ఆడపిల్లల రక్షణ మరియు విద్య కోసం విజయవంతంగా అమలు చేయడం జరుగుతుంది అని తెలిపారు

వెటర్నరీ ఆఫీసర్ బాలకృష్ణ గారు మాట్లాడుతూ విద్య అంటే సరస్వతి దేవి, ఆరోగ్యం అంటే పార్వతీదేవి ఇవి రెండూ ఉంటేనే జీవితంలో ముందుకు ఎదుగుతారని తెలియజేస్తూ ప్రభుత్వం ఆడపిల్లల కోసం ఎన్నో రకాల పథకాలు ప్రవేశపెట్టింది కేజీబీవీ పాఠశాలలలో మంచి భోజనంతోపాటు మంచి విద్య అందించడం జరుగుతుంది అని తెలియజేశారు

డిస్ట్రిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు గారు మాట్లాడుతూ మన వరంగల్ జిల్లాలో1000 మంది బాలురకు 945 మంది మాత్రమే బాలికలు ఉన్నారు లింగ నిష్పత్తి ఇంకా తక్కువగానే ఉంది అని తెలియజేస్తూ ప్రభుత్వం బాలికల ఆరోగ్యం కోసం ఖుఖిజు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది అని తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ ఫిజికల్ యాక్టివిటీస్ కూడా చేయాలని అలా చేయడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని తెలియజేయడం జరిగింది డిస్టిక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రంగయ్య నాయుడు గారు మాట్లాడుతూ ప్రతి బాలికలు వారి సమస్యలను అధిగమించేలా మన జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి గారు స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు ఈ రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం వల్ల చాలామంది మోసాలకి గురవుతున్నారు సోషల్ మీడియాని మంచికి కాకుండా చెడుకు ఉపయోగించడం జరుగుతుంది ఇలా చేయకుండా ప్రతి విద్యార్థిని బాగా చదువుకొని భవిష్యత్తులో మంచి స్థాయిలలో ఉండాలని తెలియజేశారు

# రైతులే స్వయంగా ఈ పంట నమోదు చేసుకోవచ్చు

- వ్యవసాయ అధికారి పవన్ కుమార్



గడివేముల, ఫిబ్రవరి 3(మనం న్యూస్): గడివేముల మండలం బుజునూరు గ్రామంలో జొన్న పంట సాగు చేసిన రైతులతోనే స్వయంగా ఈ పంట నమోదు కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి జీకే . పవన్ కుమార్, ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 2.0 యాప్ ద్వారా స్వయంగా రైతులే ఈ పంట నమోదు చేసుకోవచ్చు. అలాగే పంట సాగు వివరాలు తెలుసుకోవచ్చు. రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుండి '2.0' యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి. ఆధార్ ఓటీపీ ద్వారా లాగిన్ అయి, 'నా పొలాలు' విభాగం లో సాగు వివరాలను సమోదు చేయవచ్చు. వీటిని రైతు సేవా కేంద్రం సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరిస్తారు. ఒకవేళ వివరాలు తప్పుగా ఉంటే గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. రైతులు స్వయంగా పంట నమోదు చేసేటప్పుడు ఏమైనా ఇబ్బందులు ఉంటే మీ గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించండి. పంట నమోదు సమయంలో రైతులకు మూడు దశల్లో సంక్షిప్త సమాచారం అందుతుంది. నమోదుకు ముందు రోజు ఒకటి, నమోదు పూర్తయ్యాక వివరాలతో కూడిన లింక్ ద్వారా రెండో మెసేజ్ వస్తుంది. ఆ లింక్ ఓపెన్ చేసి వివరాలు సరిచూసుకుని చేస్తే మూడో ధ్రువీకరణ మెసేజ్ వస్తుంది. వివరాలు తప్పుగా ఉంటే ఖ్చ్ఛిట్ చేయవచ్చు. 'ఈ-పంట' యాప్ ద్వారా పంట నమోదు ను రెవెన్యూ సిబ్బంది మరియు వ్యవసాయ సిబ్బంది కలిసి జాయింట్ గా చేయడం జరుగుతుంది. ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పీఎం కిసాన్ -అన్నదాత సుఖీభవ, పంటల కొనుగోలు, రుణాలు, యూరియా పంపిణీ వంటి పథకాలు అందుతాయి. ఈ కార్యక్రమంలో ,వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్ , గ్రామ వ్యవసాయ సహాయకులు హబీబ్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# 7న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన



కర్నూల్, ఫిబ్రవరి 3 (మనంబ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 7న కర్నూలు జిల్లా పర్యటన లో భాగంగా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో నిర్వహించనున్న పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, ప్రజావేదిక, రైతులతో ముఖాముఖి కార్యక్రమాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి , ఎస్పీ విక్రాంత్ పాటిల్ , ఎమ్మెల్యే జయ నాగేశ్వరరెడ్డి , జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు

# వాతావరణ పర్యవేక్షణకు ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు



- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూల్, ఫిబ్రవరి 3(మనం బ్యూరో): ఖచ్చితమైన, రియల్ టైమ్ వాతావరణ పర్యవేక్షణ కోసం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు నిరంతర డేటాను అందిస్తాయని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలోని ఏపీ ట్రాన్స్ కో కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు ఆర్టీజిఎస్ కు అనుసంధానం అయ్యాయన్నారు. ఈ కేంద్రం ద్వారా వర్షపాతం, నేలలో తేమ, వాతావరణ పీడనం, గాలి, ఉష్ణోగ్రత వంటి వివరాలు ఆటోమేటిక్ గా ఆన్లైన్ లో నమోదు అవుతాయని తెలిపారు. తుఫాను లాంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడానికి, వ్యవసాయ ప్రణాళికలు రూపొందించడానికి సంబంధిత వాతావరణ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కేంద్రానికి సంబంధించిన యంత్రాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ భారతి, డివైఎస్ఓ భాస్కర్, రామాంజనేయులు, ఏ ఎస్ ఓ సరళ కుమారి, తదితరులు పాల్గొన్నారు.



# చెట్నెహాళ్ళిలో రూ. 10 లక్షలతో సీసీరోడ్లు

మంత్రాలయం ,ఫిబ్రవరి 3మనం న్యూస్: మంత్రాలయం మండల పరిధిలోని చెట్నెహాళ్ళి గ్రామంలోని మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు రూ. 10 లక్షల తో సీసీరోడ్లు నిర్మాణ పనులను మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్జీఎస్ నిధులతో గ్రామంలోని ఈడిగా ఉసేన్ ప్ప ఇంటి దగ్గర నుంచి చిన్న తాత రామాంజినేయులు ఇంటి వరకు రూ. 5 లక్షల , మరో రూ. 5లక్షల తో ఎంపిపి స్కూల్ నుంచి గ్రామ చావిడి వరకు సీసీరోడ్లు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్డు కాంట్రాక్టర్ శీను , టీడీపీ నాయకులు డీలర్ గోపాల్ , వెంకటరాముగౌడ్ , కురువ జయన్న , ఈడిగా ఉసేనప్ప , తదితరులు ఉన్నారు.

# నల్లచెలిమిలలో గోకుల మిషన్ కింద లేగ దూడల ప్రదర్శన

- లింగ నిర్ధారిత వీర్యంతో పాడి పశువుల అభివృద్ధికి శాస్త్రీయ మార్గం



దేవనకొండ, ఫిబ్రవరి 3 (మనం న్యూస్): నల్లచెలిమిల గ్రామంలో రాష్ట్రీయ గోకుల మిషన్ కార్యక్రమంలో భాగంగా లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశుపోషక రైతుల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ రాజశేఖర్ గారు మాట్లాడుతూ, పాడి పశువుల సంఖ్యను త్వరితగతిన పెంచుకోవాలంటే లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించుకోవడం అత్యంత ప్రయోజనకరమని సూచించారు. దీని ద్వారా మేలు జాతికి చెందిన ఆడ దూడలు ఎక్కువగా జన్మించి రైతులకు ఆర్థిక లాభం చేకూరుతుందని తెలిపారు. పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ బి. మల్లన్న గారు, గోనెగండ్ల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పశువు ఈనిన మూడు నెలల అనంతరం మరలా చూడి కట్టించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. పశువుల ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం, టీకాలు, పరాన్నజీవుల నివారణ కీలకమని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 69 లేగ దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించారు. మేలు జాతి దూడలను పెంచుతున్న రైతులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేశారు. దూడల ఆరోగ్యాభివృద్ధికి అవసరమైన విటమిన్ టానిక్స్ను కూడా పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్, వెలమకూరు పశు వైద్యాధికారి డాక్టర్ కె. అనీల, ఆ హనుమన్న, పశు వైద్య సిబ్బంది, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతులకు ఆధునిక పశుపోషణ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# దిశా నిర్దేశం చేసేందుకే కొనసాగిస్తున్నాం



కర్నూలు ఫిబ్రవరి 03మనం న్యూస్: భారతదేశ అత్యంత చారిత్రక మైన వేదికగా కొనసాగిస్తూ, దిశా నిర్దేశం చేసేందుకే కొనసాగిపు చేపట్టడం సంతోషాన్నిచ్చిందని బ్లెండర్స్ ప్రైడ్ సీఎంవో దేబ శ్రీ దాస్ గుప్తా పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వినూత్నమైన ఫ్యాషన్ షోలను నిర్వహించినట్లు చెప్పారు. తన ఫ్యాషన్ టూర్ ను 3 ప్రధాన నగరాల వ్యాప్తంగా ఫ్యాషన్ అనుభవాలు విజయ వంతంగా పునర్నిర్వచించి, మైమరిపించే విధంగా అధునాతనమైన మార్గంలో ఫ్యాషన్ ముందుకు సాగేందుకు మార్గం సుగమం చేసిందని చెప్పారు. భవిష్యత్తు పరిణామాలకు నాంది పలికే ద వన్ ఎండ్ ఓన్లీ ( ఒకే ఒక్కటి)ని సృష్టించిన మూడు వినూత్నమైన కథనాలను సమర్పించిందని అన్నారు. ఎఫ్ డి సి ఐ చైర్మన్ సునీల్ సేఠి మాట్లాడుతూ బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ తో తమ సహాయ సహకారాల పట్ల ఎంతో ఉత్సాహంతో ఉన్నామన్నారు. 2,100 కు పైగా హాజరైన ప్రభావ వంతమైన శ్రోతలను, మార్గ దర్శకత్వం కోసం రూపొందించి నట్లు తెలిపారు. ఇది ఫ్యాషన్ ప్రపంచంలో రెండు శక్తి క్షేత్రాలను ఒక చోటికి చేర్చిందని గుర్తు చేశారు. తమ నిబద్ధతను ఇది మరింతగా పెంపొందిస్తుందని చెప్పారు.సృజనాత్మకత, సంస్క ృతిని వేడుకగా జరుపుకునే వైవిధ్య భరితమైన డిజైన్ దృక్కోణాలను ఒకే చోటికి చేర్చి, దేశ భవిష్యత్తు ఫ్యాషన్ కు వడిని కూర్చుంది ఈ ఎడిషన్ అన్నారు.

# పాస్ పుస్తకాలలో తప్పులను సరి చేసుకోవాలి

మంత్రాలయం,ఫిబ్రవరి 03మనం న్యూస్: పట్టాదారు పాస్ పుస్తకాల కోసం రైతులు తప్పులు సరి చేసుకోవాలని మంత్రాలయం తహశీల్దారు రమాదేవి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలోని సచివాలయంలో రైతులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రీ-సర్వే పూర్తి అయ్యిందని కావున రైతులకు ఆన్ లైన్ అడంగల్, వన్ బి, సర్వే నెంబర్, ఖాతా నెంబర్, ఎల్ పిఎం నెంబర్ లను కరెక్ట్ గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ ఓ ఆనందు, టిడిపి నాయకులు బండ్రాళ్ల నరసింహులు, పోలిశివ, చిదానంద, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ఎంపీడీవో పదోన్నతులు కల్పించారు

- 660 మంది కి జీతాలు మాత్రం మరిచారు
- తక్షణమే చెల్లించాలని డిమాండ్

పాలకొల్లు, ఫిబ్రవరి 3,మనం ప్రతినిధి : ఏపీ రాష్ట్రవ్యాప్తంగా గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న 660 మంది గ్రామ కార్యదర్శులకు వార్డు సచివాల యాల పర్యవేక్షణ కోసం డిప్యూటీ ఎంపీడీవోల హోదాలో పదోన్నతులు కల్పించారు. ఇది జరిగి రెండు నెలలకు పైబడి అవుతోంది. ఇంకా ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. పదోన్నతులు ఇచ్చిన వెంటనే జీతాలుకు సంబంధించి ఏర్పాట్లు కూడా చేయాల్సి ఉండగా జీతాలు చెల్లించడం లో జాప్యం చేయడం దురదృష్టకరమైన పలువురు విమర్శిస్తున్నట్లు తెలిసింది. కొందరికి ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు నిర్వహించడంతో వారికి మరింత భారంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సచివాలయం ఉద్యోగులు సర్వేలు, ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబించడంతో సూపర్వైజర్లు గా వచ్చిన డిప్యూటీ ఎంపీడీవోలు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. ఒకవైపు జీతాలు సకాలంలో రాకపోవడం మరోవైపు సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఉన్నత అధికారులు ఒత్తిడి తో సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీలో సమస్యల బెడద ఎక్కువ కావడంతో ఎంతో కొంత మానసిక ప్రశాంతతో ఉద్యోగాలు చేసుకుందామని డిప్యూటీ ఎంపీడీవో పదోన్నతి పై సచివాలయాలకు వస్తే జీతాలు నిలిచి పోవడం, సచివాలయం ఉద్యోగుల నుంచి తలపోట్లు ఎక్కువ కావడం మరింత ఇబ్బందికరంగా మారిందని కొందరు మానసికంగా ఎవరికీ చెప్పుకోలేక బాధపడుతున్నట్లు తెలుస్తోంది. కావున ఎప్పటికైనా ఆలస్యం కాకుండా వెంటనే జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవోలు కోరుతున్నారు.

# అనాథలకు సాయం చేస్తే భగవంతునికి సేవచేసినట్లే



- బూదూరు వైసిపి నేత మినిగి బుజ్జిగ జక్కయ్య
- అనాథ ఆశ్రమానికి రూ. 20,000 ఆర్థికసాయం

మంత్రాలయం, ఫిబ్రవరి 03మనం, న్యూస్: :సమాజంలో ఉన్న అనాథలకు సాయంచేస్తే ఆభగవంతునికి సేవ చేసినట్టే అని బూదురు గ్రామ వైసిపి నేత మినిగి బుజ్జిగ జక్కయ్య అన్నారు. మంగళవారం ఆయన బూదూరు స్వగృహంలో ఎమ్మిగనూరులో ఉన్న పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనాథ ఆశ్రమానికి రూ. 20,000 ఆర్థికసాయం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు సాయంచేస్తే ఆ భగవంతుడు మన కుటుంబాలకు మేలులు చేస్తాడన్నారు.రబోయే కాలంలో తనాశక్తి మేరకు మేరకు సహాయం చేస్తానని అన్నారు.ఇలాంటి సేవ చేసే వారిని ప్రోత్సహించాలన్నారు. ఎమ్మిగనూరులోని పూలే అంబేద్కర్ సొసైటీ అనాథ ఆశ్రమం వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న, సొసైటీ అధ్యక్షురాలు ప్రతిభా భారతి,సాతర్ల ప్రసాద్ కదిరి కోట సుందర్రాజు సామేల్,లకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు జక్కయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

# మారేడుబాక పాఠశాలలో మంచి నీటి బోర్లు ఏర్పాటు



- తాగు నీరు కోసం కూటమి ప్రభుత్వం ముందడుగు

కుక్కునూరు, ఫిబ్రవరి 03 ( మనం న్యూస్): మండలంలో స్థానిక గ్రామ పంచాయతీ అయిన గోపరాజు గూడెం లో పాఠశాలలో మంచి నీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బంది తెలుసుకున్న స్థానిక కూటమి నాయకులు ఆ గ్రామం లో ఉన్న రెండు మంచినీటి బోర్లు ను ఎంపీపీ నిధులు ద్వారా మంచి నీటి బోర్లు ఏర్పాటు చెసి సమస్య పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లీ తండ్రులు కూటమి నాయకులుకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ మడకం తిరుపతమ్మ, ఎంపీటీసీ ముప్పాలా శ్రీదేవి,టీడీపీ సీనియర్ నాయకులు ముప్పాల శివయ్య, జనసేన ఉపాధ్యక్షులు మంత్రి గోపాల కృష్ణ, టీడీపీ నాయకులు నరుకుల్లా సత్యనారాయణ, పెరసని లక్ష్మణ రావు, తూము రవి, వార్డ్ అప్కా రమాదేవి, కొలూరు శ్రీను, కేసరి రామకృష్ణ, అధికారులు ఏ ఇ వీరాస్వామి, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ బడ్జెట్ పెంచి, అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చెయ్యాలి

- ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా
- సిఐటియు నేత సాయికిరణ్ డిమాండ్




కుక్కునూరు,ఫిబ్రవరి 3 ( మనం న్యూస్): బడ్జెట్ పెంచి, అంగన్వాడీలకు కనీస వేతనం,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టం అమలు చెయ్యాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఐసిడిఎస్ కి బడ్జెట్ పెంచాలని అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్యేశించి సాయికిరణ్ మాట్లాడుతూ 2026-27 కేంద్ర బడ్జెట్లో 26 లక్షల మంది అంగన్వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్తో సహా దాదాపు ఒక కోటి మంది స్కీమ్ వర్కర్ల దుస్థితి మరియు హక్కులపై మాట్లాడకపోవడం అన్యాయం. ఐఇ్ఖి,ఇతర స్కీం వర్కర్లు కు ప్రాథమిక సేవల పథకాలలో మౌలిక సదుపాయాలు మరియు సేవల నాణ్యతపై బడ్జెట్ మౌనంగా ఉంది. కేటాయింపులలో ఎటువంటి పెరుగుదలలేదు. బడ్జెట్ మరియు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల ద్వారా 'అన్ని కార్మికులకు కనీస వేతనాలు అందిస్తున్నట్లు' గొప్పలు చెప్పుకుంటున్న భారత ప్రభుత్వం, అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు కేవలం రూ.2700 మరియు అంగన్వాడీ సహాయకులకు నెలకు రూ.1350 వేతనంగా చెల్లిస్తోంది. 2018 నుండి సామాన్య ప్రజలకు ఆహారం, ఆరోగ్యం మరియు విద్య వంటి ప్రాథమిక సేవలను అందించే ఈ గ్రాస్ రూట్ స్థాయి కార్మికుల వేతనంలో ఎటువంటి పెరుగుదల లేదు. స్కీమ్ కార్మికులకు సామాజిక భద్రత లేదా పెన్షన్ లేదు. అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు గ్రాట్యుటీ మంజూరు చేస్తూ 2022లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా ప్రభుత్వం ఇంకా అమలు చేయలేదు, అయితే అంగన్వాడీలు ఉద్యోగులకు కూడా గ్రాట్యుటీ మంజూరు చేస్తున్నట్లు చెప్పి బడ్జెట్ కేటాయింపులు లేవు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఐసిడిఎస్ కి బడ్జెట్ పెంచి, అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలని, అంగన్వాడీ సమస్యలు అన్ని పరిష్కరించాలని లేదంటే ఆందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ప్రాజెక్టు అధ్యక్షులు కుంజ నాగలక్ష్మి, కార్యదర్శి సువ్వేటి లత, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పోచారపు వెంకటేశ్వర్లు, అంగన్వాడీలు అన్నపూర్ణ, మంగ, , పున్నమ్మ,లక్ష్మి,నయోమి,సుజాత,జ్యోతి,శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# సూర్య మళ్లీ ఉదయించాడు..



మరికొన్ని రోజుల్లోనే టీ20 వరల్డ్‌కప్ 2026 భారత్, శ్రీలంక వేదికగా ప్రారంభం కానుంది. అయితే న్యూజిలాండ్ తో అయిదు టీ20 మ్యాచ్ ల సిరీస్ ముందు వరకు టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ లేమిని భారత్ ను ఇబ్బందిపెట్టింది. కానీ కివీస్ తో పొట్టి సిరీస్ లో సూర్యకుమార్ యాదవ్ మూడు హాఫ్ సెంచరీలతో తన సత్తా చాటాడు. ఇందులో రెండు వరుస అర్ధ శతకాలున్నాయి. అలాగే ఈ సిరీస్ లో టాప్ స్కోరర్ గానూ నిలిచాడు.

సూర్యకుమార్ యాదవ్ 2025లో ఫామ్‌లేమితో తడ'బ్యాటు'కు గురయ్యాడు. టీ 20 వరల్డ్‌కప్ 2024 నుంచి.. డిసెంబర్ 2025 వరకు అతడు 28 ఇన్నింగ్స్ ల్లో 17.92 యావరేజ్ తో కేవలం 448 పరుగులే చేశాడు. ఇందులో రెండు అర్ధశతకాలు మాత్రమే ఉన్నాయి. 23 ఇన్నింగ్స్ ల వరకు సూర్య అసలు హాఫ్ సెంచరీనే చేయలేదు.

కివీస్ తో జరిగిన టీ20 సిరీస్ తో సూర్య తిరిగి రిథమ్లోకి వచ్చాడు. మొదటి మ్యాచ్ లో 32, రెండో టీ20లో 82* (కేవలం 37 బంతుల్లో), మూడో మ్యాచ్ లో 57*, అయిదో టీ20లో 63 పరుగులు సాధించాడు. నాలుగో మ్యాచ్ లో మాత్రం 8 రన్స్ చేశాడు. మొత్తానికి ఈ మూడు హాఫ్ సెంచరీల్లో రెండుసార్లు అజేయంగా నిలిచాడు. ముఖ్యంగా రాయ్‌పుర్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మూడో మ్యాచ్ లోనూ మరో అర్ధశతకం బాది తాను ఫామ్ లోకి వచ్చినట్లు నిరూపించాడు.

సూర్య మెరుపులు తోడైతే..

కివీస్ తో జరిగిన టీ20 సిరీస్ లో సూర్యకుమార్ యాదవ్ 80.66 యావరేజ్, 196.74 స్ట్రైక్ రేట్ తో 242 పరుగులు సాధించి, టాప్‌స్కోరర్ గా నిలిచాడు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ (182 పరుగులు) కంటే కూడా ఎక్కువ రన్స్ సాధించడం గమనార్హం. టీ20 వరల్ కప్ 2026లో డిపెండింగ్ ఛాంపియన్ గా బరిలోకి దిగుతున్న భారత్ కు సూర్య ఫామ్ అదనపు బలం కానుంది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ వీరబాదుడుకు సూర్య మెరుపులు తోడైతే.. స్కోర్ బోర్డ్ పరుగులెత్తడం ఖాయం. ప్రత్యర్థులు బిత్తరపోయి చిత్తవడం తథ్యం.. అని అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

## 'పద్మ శ్రీ' అందుకోవడం నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన క్షణం: రోహిత్ శర్మ



భారత స్టార్ క్రికెటర్, మాజీ సారథి రోహిత్ శర్మ ఇటీవల 'పద్మ శ్రీ' అవార్డుకు ఎంపికయ్యాడు. తనకు ఈ పురస్కారం దక్కడంపై హిట్ మ్యాన్ తాజాగా స్పందించాడు. ''పద్మ శ్రీని అందుకోవడం నాకు, నా కుటుంబానికి ప్రత్యేకమైన క్షణం. ఈ గౌరవాన్ని అందించిన భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. క్రికెట్ కెరీర్ లో అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా. దేశం కోసం మ్యాచ్ లు, ట్రోఫీలు గెలవడానికి నా ప్రయత్నం ఎప్పుడూ కొనసాగుతుంది. ధన్యవాదాలు. జై హింద్'' అని రోహిత్ పేర్కొన్నాడు.

దూకుడైన బ్యాటింగ్ తో హిట్ మ్యాన్ గా పేరుతెచ్చుకున్న రోహిత్ శర్మ.. కెప్టెన్ గానూ భారత క్రికెట్ పై బలమైన ముద్ర వేశాడు. అతడి సారథ్యంలోనే టీమ్ఇండియా 2024లో టీ20 ప్రపంచకప్ ను గెలుచుకుంది. 2025లోనూ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా చేజిక్కించుకుంది. రోహిత్ వన్డేల్లో 11577, టెస్టుల్లో 4301, టీ20ల్లో 4231 పరుగులు చేశాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 50 సెంచరీలు, 111 అర్ధసెంచరీలు సాధించాడు. టెస్టులు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన ఇతను వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2027 వన్డే వరల్ కప్ లో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్న రోహిత్.. ఇటీవల న్యూజిలాండ్ తో సిరీస్ లో పెద్దగా రాణించలేదు. అంతకుముందు సఫారీలతో జరిగిన మూడు వన్డేల సిరీస్ లో 146 పరుగులు చేశాడు.

## వారికి నిద్ర ఎలా పడుతుంది: రకుల్ ప్రీత్ సింగ్

బాలీవుడ్ లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్ గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై నటీనటులు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. కొన్నిరోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. ''పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదు'' అని అన్నారు.

ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్ ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.



## భారత్‌లో మళ్లీ ఫార్ములావన్!

భారత్‌లో మళ్లీ ఫార్ములావన్ కార్లు రయ్ రయ్ మంటూ దూసుకెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలో ఈ ఆటను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఆసక్తిని ప్రదర్శిస్తోంది. జేపీ గ్రూప్ ఆధ్వర్యంలో 2011లో గ్రేటర్ నోయిడాలోని బుద్ధా సర్క్యూట్ లో తొలిసారి ఎఫ్-1 రేసు జరిగింది. చివరగా 2013లో రేసు నిర్వహించారు. పన్నుల విషయంలో వివాదం, ఇతర సమస్యలతో భారత్ కు ఫార్ములావన్ దూరమైంది. ఫార్ములావన్ పునరుద్ధరణ కోసం కేంద్ర క్రీడల మంత్రి మన్ సుఖ్ మాండవీయ ఇప్పటికే బుద్ధా సర్క్యూట్ ను పరిశీలించారని.. ప్రస్తుతం ఈ రేసింగ్ ట్రాక్ నిర్వహణను చూస్తున్న యమున ఎక్స్ ప్రెస్ వే ఇండస్ట్రీయల్ డెవలప్మెంట్ అథారిటీ అధికారులతో మాట్లాడారని తెలిసింది. ఈ ట్రాక్ ను సొంతం చేసుకోవాలని అదానీ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే భారత్ లో మళ్లీ ఎఫ్-1 ట్రాక్ సందడిగా మారే అవకాశాలున్నాయి. ''ఎఫ్-1 రేసును నిర్వహించడం ఖర్చుతో కూడిన వ్యవహారం. ఆ సమస్య త్వరలో తీరుతుందని ఆశిస్తున్నాం. ఎఫ్-1 రేసును పునరుద్ధరించేలా చేస్తామని క్రీడల మంత్రి నిర్వాహకులకు భరోసా ఇచ్చారు'' అని భారత ఫార్ములావన్ వర్గాలు తెలిపాయి. ఎఫ్-1 రేసు నిర్వహించాలంటే ఏడాదికి రూ.200 కోట్ల నుంచి 500 కోట్ల వరకు వ్యయం అవుతుంది.

## ఫన్నీగా సూపర్ సుబ్బు టీజర్..

శృంగారం లేదా సెక్స్ ఎడ్యుకేషన్ అనే పదాలు వింటే చాలు చాలామంది అదేదో బూతులా చూస్తారు. అసలు ఈ పదాలు ఉచ్చరించడమే తప్పు అన్నట్లు ప్రవర్తిస్తారు. కానీ ప్రస్తుత జనరేషన్ లో వీటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాలామంది పలు రకాలుగా అవగాహన తెచ్చుకుంటున్నారు. ఇప్పుడు ఇదే విషయంపై తెలుగులో ఓ వెబ్ సిరీస్ తీశారు. దాని టీజర్ ఇప్పుడు విడుదల చేశారు. 'సూపర్ సుబ్బు' పేరుతో తీసిన ఈ సిరీస్ లో సందీప్ కిషన్ లీడ్ రోల్ చేశాడు. నెట్ ఫ్లిక్స్ లో త్వరలో ఇది స్ట్రీమింగ్ కానుంది. ముంబైలో మంగళవారం ఓ ఈవెంట్ నిర్వహించిన సదరు ఓటీటీ సంస్థ.. అక్కడ దీని టీజర్ రిలీజ్ చేసింది. కాన్సెప్ట్ ఎలా ఉండబోతుందో రివీల్ చేసింది. టీజర్ బట్టి చూస్తే.. సుబ్బు.. చిన్నప్పటి నుంచి చిలిపి కుర్రాడు. పెద్దయిన తర్వాత కూడా అలానే ప్రవర్తిస్తుంటాడు. పెళ్లి చేస్తే దారిలోకి వస్తాడనుకుంటే ఏకంగా 60 మంది అమ్మాయిలు ఇతడిని రిజెక్ట్ చేస్తారు.




మరోవైపు సుబ్బుకి టీచర్ గా అవకాశమొస్తుంది. కాకపోతే ఓ పల్లెటూరిలో సెక్స్ ఎడ్యుకేషన్ గురించి చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? చివరకు వెళ్లిన పనిలో సక్సెస్ అయ్యాడా లేదా? అనేదే కాన్సెప్ట్ లా అనిపిస్తుంది. ఈ సిరీస్ లో సందీప్ కిషన్ కి జోడీగా మిథిలా పాల్కర్ నటించింది. మురళీ శర్మ, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు చేశారు.

## జోడీ రిపీట్



ధనుష్, సాయిపల్లవి జోడీ రిపీట్ అవుతోంది. ధనుష్ హీరోగా 'అమరన్' ఫేమ్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో 'డీ 55'(వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కనుంది. వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టెక్ స్టూడియోస్ సంస్థలు నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుంది. ఈ మూవీలో ఓ హీరోయిన్ గా శ్రీలీల నటించనున్న విషయం తెలిసిందే.మరో హీరోయిన్ గా సాయిపల్లవి నటించనున్నట్లుగా సోమవారం ప్రకటించారు మేకర్స్. గతంలో 'మారి 2' (2018) చిత్రంలో ధనుష్, సాయిపల్లవి జోడీగా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రంలోని 'రౌడీ బేబీ...' సాంగ్ కూడా అప్పట్లో బాగా పాపులర్ అయ్యింది.

అలాగే 'అమరన్ ' వంటి హిట్ మూవీ తర్వాత దర్శకుడు రాజ్ కుమార్ పెరియ సామితో సాయిపల్లవి చేస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్రాన్ని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారట ధనుష్ అండ్ టీమ్. ఈ సినిమాకు సంగీతం: సాయి అభ్యంకర్.

## పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయతీకి సూపర్ స్టార్ కానుక

తనకు దొరికిన బంగారాన్ని పోలీసులకు అప్పగించిన పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయతీని సూపర్ స్టార్ రజనీకాంత్ మెచ్చుకోవడంతో పాటు బంగారు గొలుసును కానుకగా అందించారు. చెన్నై మహానగర పాలకసంస్థలో కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మ (50) ఇటీవల తనకు రోడ్డుపై దొరికిన 45 తులాల బంగారాన్ని పోలీసులకు అప్పగించి పలువురు మన్ననలు అందుకున్నారు. తాజాగా ఆమెను అగ్ర కథానాయకుడు రజనీకాంత్ సన్మానించారు. తన ఇంటికి పిలిచి ఆమెతో ఆప్యాయంగా మాట్లాడిన రజనీకాంత్ ఆమెకు ఒక బంగారపు గొలుసును కానుకగా ఇచ్చారు.



ఇక పద్మకు భారత తపాలా శాఖ ఇటీవల అరుదైన గౌరవాన్ని అందించింది. ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఆమెకు రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని కూడా అందించారు. ఆమెను అభినందిస్తూ ప్రభుత్వం తరఫున రూ.లక్ష నగదు బహుమతిని చెక్కు రూపంలో అందించించిన సంగతి తెలిసిందే.



## 'ది ప్యారడైజ్'.. కాన్ఫిడెంట్‌గా నాని అండ్ టీమ్..!

న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ది ప్యారడైజ్' ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతుందా అని ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను పాన్ ఇండియా చిత్రంగా భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాలో నాని ఒక వైవిధ్యమైన లుక్ తో ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడు.

అయితే, ఈ సినిమాకు సంబంధించి రోజుకో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో పలు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ముందుగా ప్రకటించినట్లు మార్చి 26న రిలీజ్ చేయరని తెలుస్తోంది. ఇప్పుడు ఈ సినిమా బడ్జెట్ అమాంతం పెరిగిపోయిందనే టాక్ వినిపిస్తోంది. కానీ, తమ కథపై మేకర్స్ ఫుల్ ధీమాగా ఉండటమే ఈ పుకార్లకు కారణమని సినీ సర్కిల్స్ లో చర్చ సాగుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని తనదైన విజన్ తో రూపొందిస్తున్నాడు.

ఇక ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా ఎస్ఎల్ వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేస్తున్నారు. మరి 'ది ప్యారడైజ్' మూవీపై వస్తున్న పుకార్లపై మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి.

## బాక్సాఫీస్ రికార్డులను పాతరపెట్టేందుకు సిద్ధమవుతున్న రణ్ వీర్ సింగ్..!

బాలీవుడ్ హీరో రణ్ వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్ చిత్రంగా నిలిచింది. ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ యాక్షన్ స్పై డ్రామా కళ్లు చెదిరే వసూళ్లను రాబట్టి బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఇక ఈ సినిమాకు సీక్వెల్ గా 'ధురంధర్ : ది రివెంజ్' చిత్రాన్ని తెరకెక్కించారు మేకర్స్. కాగా ఈ చిత్ర టీజర్ ను తాజాగా రిలీజ్ చేశారు.



ఈ టీజర్ ఆద్యంతం పవర్ ఫుల్ యాక్షన్ సీన్స్ తో నింపేశారు. రణ్ వీర్ సింగ్ మరోసారి ఇండియన్ బాక్సాఫీస్ ను చెడుగుడు ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. అయితే, ఈ సినిమాలో రణ్ వీర్ సింగ్ పాత్రకు సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ కూడా ఉండబోతున్నట్లు ఈ టీజర్ చూస్తే అర్థమవుతుంది. రెండు వైవిధ్యమైన లుక్స్ తో రణ్ వీర్ సింగ్ ఈ టీజర్ లో కనిపించాడు. ఇక టీజర్ చివర్లో వచ్చే పవర్ ఫుల్ డైలాగ్ ఈ టీజర్ కే హైలైట్ గా నిలిచింది.

ఇక యాక్షన్ డోస్ కు ఏమాత్రం కొదువ లేదని ఈ టీజర్ కట్ చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమాలో మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రామ్ పాల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా భాషల్లో మార్చి 19న గ్రాండ్ రిలీజ్ కు రెడీ చేస్తున్నారు. 'ధురంధర్ 2' టీజర్ తో అప్పుడే ఈ సినిమాపై అదిరిపోయే అంచనాలు క్రియేట్ అవుతున్నాయి. మరి ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందో చూడాలి.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.